PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం


సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 275 | విజయవాడ, సోమవారం 8 మే 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Monday 8 May 2023 | Rs

నేటితో ప్రచారానికి తెర



● లోపలి పేజీలో..●



రెజ్లర్ల పోరాటానికి మద్దతు తెలుపుతున్న మహిళా రైతులు

7


గుజరాత్‌లో మహిళల అదృశ్యం

ఐదేళ్లలో 41 వేల మంది ఆచూకీ గల్లంతు

మోడీ, అమిత్ షా సొంత రాష్ట్రంలో అంతుచిక్కని మిస్టరీ

న్యూఢిల్లీ : దేశానికే ఆదర్శం గుజరాత్. ఆ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి చూసి నేర్చుకొమ్మని ప్రధాని మోడీ, హెూంమంత్రి అమిత్‌షా అదే పనిగా ఊదరగొడుతుంటారు. కానీ గుజరాత్‌లో పేదలకు, మహిళలకు ఎలాంటి రక్షణ లేదని జాతీయ నేర గణాంకాల రికార్డు బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) తెలిపింది. 'కేరళ ఫైల్స్' పేరిట తీసిన సినిమాలో 32 వేల మంది మహిళల్ని సిరియాకు తీసుకెళ్లినట్లు పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తున్న బిజెపి గుజరాత్‌లో ఇంత పెద్ద సంఖ్యలో మహిళలు అదృశ్యం అయితే నోరు మెదపకపోవడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వ సంస్థ విడుదల చేసిన రిపోర్టు ప్రకారమే గత అయిదేళ్లలో గుజరాత్‌లో 41 వేల మంది మహిళలు గాయబ్ అయ్యారు. 2019-2020లో అహ్మదాబాద్, వడోదరలోనే 4,722 మంది మహిళలు అదృశ్యమయ్యారని 2021లో అసెంబ్లీలో సాక్షాత్తూ గుజరాత్ ప్రభుత్వమే వెల్లడించింది. గుజరాత్‌కు చెందిన బాలికలను, మహిళలను తరచూ ఇతర రాష్ట్రాలకు పంపి వ్యభిచారంలోకి దింపుతున్నారని గుజరాత్ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు సుధీర్ సిన్హా ఆందోళన వ్యక్తం చేశారు. మిస్సింగ్ కేసులు హత్య కేసుల కన్నా తీవ్రమైనవని ఆయన అన్నారు. గుజరాత్ పోలీసులు ఈ కేసుల దర్యాప్తు విషయంలో అలసత్వం వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. బాలికలు అదృశ్యం కావడానికి మానవ అక్రమ రవాణాయే కారణమని రాష్ట్ర మాజీ అదనపు డిజిపి డాక్టర్ రాజన్ ప్రియదర్శి తెలిపారు. మహిళల అదృశ్యంపై గుజరాత్ కాంగ్రెస్ ప్రతినిధి హిరేన్ బంకర్ మాట్లాడుతూ 'కేరళ మహిళల గురించి బిజెపి నేతలు మాట్లాడుతుంటారు. కానీ గుజరాత్‌లో 40 వేల మందికి పైగా కన్పించకుండా పోతే పెదవి విప్పరు. పైగా ఇది దేశ ప్రధాని, హోం మంత్రి సొంత రాష్ట్రం' అని ఎద్దేవా చేశారు.

సంవత్సరం వారీగా కేసులు



మొత్తం ఆచూకీ దొరకని మహిళల సంఖ్య : 41,621

అల్లూరి స్ఫూర్తితో మన్యాన్ని కాపాడుకుందాం

- సీతారామరాజు వర్ధంతి సభలో బివి రాఘవులు పిలుపు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

అటవీ ప్రాంతాన్ని కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నిస్తోందని, ఈ నేపథ్యంలో గిరిజనులను, మన్య ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సుందరయ్య విజ్ఞాన కేంద్రం చైర్మన్ బివి.రాఘవులు అన్నారు. ఆ దిశగా అల్లూరి స్ఫూర్తితో కృషి చేయాలని పిలుపునిచ్చారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి సభ ఆదివారం విశాఖపట్నంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అల్లూరిని హిందుత్వవాదిగా చిత్రీకరించేందుకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. అల్లూరి పోరాటాలను, త్యాగాలను రాఘవులు గుర్తు చేశారు. ప్రజల ఆరోగ్య, జీవన పరిస్థితులను మెరుగుపరిచేందుకు ఆయన నాడు ఎంతగానో కృషి చేశారన్నారు. 1884లో తీసుకొచ్చిన అటవీ చట్టం వల్ల గిరిజనులు బ్రిటిష్ వారికి బానిసలుగా బతకాల్సిన పరిస్థితి తలెత్తిందన్నారు. ఈ క్రమంలో అల్లూరి పెద్ద ఎత్తున పోరాడారని, 1922-24 మధ్య సాయుధ పోరాటం నిర్వహించారని తెలిపారు. అప్పటి బ్రిటిష్ చట్టం మాదిరి నేటి ప్రభుత్వాలు అటవీ సంరక్షణ చట్టం పేరుతో గిరిజనుల అటవీ భూములను ప్రయివేటువారికి అప్పగించే కుట్రలు పన్నుతున్నాయన్నారు. హైడ్రో ప్రాజెక్టులు, టూరిజం, మైనింగ్ పేర్లు చెప్పి కార్పొరేట్ శక్తులను అటవీ ప్రాంతంలోకి అనుమతిస్తున్నారని వెల్లడించారు. విశాఖలోని రుషికొండను నేటి పాలకులు బోడి కొండగా మార్చేశారన్నారు. అభివృద్ధి పేరుతో అడవులను ప్రయివేటు కంపెనీలకు అప్పగిస్తే తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. బ్రిటిష్ వారు గిరిజనులకు అడవులు లేకుండా చేస్తే, నేటి పాలకులు భావితరాలకు అడవులు లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. అడవుల నాశనంతో తలెత్తే విపత్కర పరిస్థితులను వివరించారు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాన్ని అల్లూరిపై రుద్దుతూ హిందుత్వవాదిగా చూపిస్తూ ఆర్‌ఆర్‌ఆర్ చిత్ర కథనం రాసిన విజయేంద్రప్రసాద్‌ను ఎంపి చేశారని, అల్లూరిని రాముడు అవతారంలో చూపి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారని తెలిపారు. అంబేద్కర్ సహా పలువురు నేతలను హిందుత్వవాదులుగా చిత్రీకరించే ప్రయత్నాలు సాగుతుండడంపై రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి ప్రయత్నాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరముందన్నారు. నేడు దేశంలోనే చాలా ప్రాంతాల్లో హిందూ, ముస్లింల మధ్య విభేదాలు రెచ్చగొడుతూ మత ఘర్షణలకు దారి తీసే విధంగా బిజెపి ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. ఈ వైఖరులపైనా పోరాడాల్సి ఉందన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం సాంస్కృతిక విభాగం బాధ్యులు జిఎస్.రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గీతం కాలేజీ ప్రొఫెసర్ చిన్నయ్య సూరి, సిఐటియు జాతీయ కోశాధికారి సాయిబాబు, అల్లూరి విజ్ఞాన కేంద్రం ట్రస్టు కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు, ట్రస్టు మెంబర్ ఎం.జగ్గునాయుడు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు అల్లూరి చిత్రపటానికి బివి.రాఘవులు పూలమాలవేసి నివాళ్లర్పించారు. అల్లూరి సీతారామరాజు, గురజాడ గొప్పతనాన్ని తెలియజేస్తూ ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి.



విశాఖలో జరిగిన అల్లూరి వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న బివి రాఘవులు , హాజరైన నగర ప్రజలు

బిడ్స్ ముసుగులో 'ఉక్కు'పై ప్రయి'వేటు'

- మహిళా రెజ్లర్ల ఆందోళనపై కేంద్రం కళ్లు తెరవాలి
- ఎల్‌జి పాలిమర్స్ బాధితులకిచ్చిన హామీల అమలేదీ? : రాఘవులు

● లోపలి పేజీలో..●

మణిపూర్‌లో 157 మంది రాష్ట్ర విద్యార్థులు

- ఘర్షణల నేపథ్యంలో బిక్కుబిక్కుమంటున్న వైనం
- సురక్షితంగా రప్పించాలని సర్వత్రా డిమాండ్
- రెండు ప్రత్యేక విమానాలు ఏర్పాటు : సిఎంఒ



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి/ అమరావతి బ్యూరో

మణిపూర్‌లో విద్యాభ్యాసం కోసం వెళ్లిన తెలుగు విద్యార్థులు అక్కడ జరుగుతున్న అల్లర్లలో చిక్కుకుని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 157 మంది విద్యార్థులు ఎన్‌ఐటి, ట్రిపుల్ ఐటి, వ్యవసాయ కళాశాలలో చదువుతున్నట్లు ప్రాథమిక అంచనా. ఘర్షణల నేపథ్యంలో విద్యార్థులు క్యాంపస్‌లు వదిలి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. అనంతపురం జిల్లాకు చెందిన గుర్రం యజ్ఞశ్రీ చౌదరి, కె.పవన్ సాయి రెడ్డి, భూఖ్యా సునీల్ నాయక్, దినేష్ చిత్ర, యాతం తేజేశ్వరరెడ్డి, వినీష్ కుమార్‌రెడ్డి, ఎం.విఘ్నేష్ అక్కడ జరుగుతున్న హింసాకాండలో చిక్కుకొని ఇబ్బందులు పడుతున్నారు. అయితే తాము సురక్షితంగా ఉన్నట్లు సునీల్‌నాయక్ ప్రజాశక్తికి తెలిపారు. క్యాంపస్ బయట పెద్దఎత్తున గొడవలు జరుగుతున్నట్లు వివరించారు. రోజుకు రెండు పూటల భోజనం మాత్రమే లభిస్తోందని, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక విమానాన్ని పంపించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తమ విద్యాసంస్థ యాజమాన్యం చెబుతోందని, అది ఎప్పుడన్నది తెలియదని నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. తమ పిల్లలకు ఏమవుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మణిపూర్‌లో చిక్కుకున్న విద్యార్థులను, ప్రజలను సురక్షితంగా స్వస్థలాలకు రప్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని టిడిపి, సిపిఎం, సిపిఐ తదితర పార్టీలు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా మణిపూర్ నుంచి విద్యార్థులను సురక్షితంగా వెనక్కి రప్పించేందుకు రెండు ప్రత్యేక విమానాలను ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇందుకోసం అయ్యే ఖర్చునంతటినీ ప్రభుత్వం వెచ్చిస్తుందని వెల్లడించింది. వీటిలో ఒక విమానం హైదరాబాద్ నుంచి సోమవారం ఉదయం 9.35 గంటలకు, మరో విమానం కోల్‌కత్తా నుంచి సోమవారం 11 గంటలకు బయల్దేరి వెళ్లాయని తెలిపింది. ఈ విమానాల ద్వారా మొత్తం 157 మంది విద్యార్థులను స్వస్థలాలకు సురక్షితంగా తీసుకొస్తామని పేర్కొంది.

బిజెపి ప్రభుత్వ తప్పుడు పద్ధతుల వల్లే హింస

- సిపిఎం మణిపూర్ రాష్ట్ర కార్యదర్శి

● లోపలి పేజీలో..●

మణిపూర్‌లో కర్ఫ్యూ సడలింపు

- నేడు సుప్రీం విచారణ

ప్రకాశంలో భూ ప్రకంపనలు

ప్రజాశక్తి- ముండ్లమూరు (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలంలోని ముండ్లమూరు, వేంపాడు గ్రామాలలో భూప్రకంపనలు సంభవించడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఆదివారం ఉదయం 10.15 గంటల ప్రాంతంలో రెండు సెకన్ల పాటు భూమి కంపించడంతో ఇళ్లలోని వస్తువులు కింద పడిపోయాయి. భూప్రకంపనల శబ్దంతో ప్రజలు ఇళ్లలో నుంచి భయంతో బయటకు పరుగులు తీశారు.

ఎటువంటి ప్రమాదమూ జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ గ్రామంలో 2017లో రెండుసార్లు భూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. 2023 ఫిబ్రవరి 14న భూమి కంపించింది. ప్రస్తుత ముండ్లమూరు తహశీల్దార్ నయీమ్ అహమ్మద్ మాట్లాడుతూ తాను ఇక్కడ డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేసిన సమయంలో భూ ప్రకంపనలు గుర్తు చేశారు.

రాష్ట్రంలో నీట్ ప్రశాంతం

- 60 వేల మంది హాజరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్య విద్యాకోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్) ఆదివారం ప్రశాంతంగా జరిగింది. దేశవ్యాప్తంగా ఈ పరీక్షకు 20,87,449 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. 499 నగరాల్లో 4,702 పరీక్ష కేంద్రాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ) ఏర్పాటు చేసింది. 14 పరీక్ష కేంద్రాలను ఇతర దేశాల్లో ఏర్పాటు చేసింది. తెలుగుతో పాటు 13 భాషల్లో ఈ పరీక్షను నిర్వహించింది. రాష్ట్రంలో సుమారు 60 వేల మంది పరీక్షలు రాశారు. వీరికోసం గుంటూరు, కర్నూలు, నెల్లూరు, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, నరాసరావుపేట, మచిలీపట్నం, అనంతపూర్, భీమవరం, చీరాల, చిత్తూరు, ఏలూరు, కడప, కాకినాడ, నంద్యాల, ఒంగోలు, ప్రొద్దుటూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తాడేపల్లిగూడెం, తణుకు, విజయనగరం చోట్ల సుమారు 150 కేంద్రాలను ఎన్‌టిఎ ఏర్పాటు చేసింది. మధ్యాహ్నం 2 నుంచి 5.20 గంటల వరకు ఆఫ్‌లైన్‌లో ఈ పరీక్ష జరిగింది. నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను లోపలికి అనుమతించలేదు. పరీక్షా కేంద్రాల వద్ద మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేసి విద్యార్థులను లోపలికి పంపించారు. విద్యార్థులు లోహాలతో తయారు చేసిన ఉంగరాలు, ముక్కుపుడకలు ధరించి వస్తే వాటిని తొలగించి, అనంతరం వారిని లోపలికి అనుమతించారు. కెమిస్ట్రీ, బోటనీ పేపర్లు కొంచెం కష్టంగా ఉన్నాయని విద్యార్థులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఫిజిక్స్, జువాలజీ సరళంగానే ఉన్నాయని తెలిపారు. మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్ల కారణంగా అక్కడ పరీక్షను నిర్వహించలేదు. పరీక్ష అన్సర్ 'కీ' నీ ఈ నెల చివరిలో ఎన్‌టిఎ విడుదల చేసే అవకాశం ఉంది. జూన్ నాల్గవ వారంలో ఫలితాలు విడుదలయ్యే అవకాశం ఉంది. అన్సర్ కీ, ఫలితాలను అభ్యర్థులు www.nta.ac.in, https://neet.nta.nic.in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.



విజయవాడలోని ఒక పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు తెచ్చుకున్న మంచినీళ్ల బాటిల్‌పై స్టిక్కర్ తొలగిస్తున్న అధికారి

టెక్సాస్‌లో కాల్పులు

- తొమ్మిది మంది మృతి
- దుండగుణ్ణి హతమార్చిన పోలీసులు

టెక్సాస్ : అమెరికాలో తుపాకీ సంస్కృతి బుసలు కొడుతున్నది. శనివారం టెక్సాస్‌లోని ఆలెన్ నగరంలోని రద్దీగా ఉన్న ఓ షాపింగ్ మాల్ సమీపంలో ఓ దుండగుడు విచక్షణా రహితంగా జరిపిన కాల్పుల్లో తొమ్మిదిమంది మరణించారు. ఐదేళ్ల చిన్నారిసహా మరో ఏడుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం తెలియగానే హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు దుండగుణ్ణి కాల్చి చంపారు. 120కిపైగా దుకాణాలున్న మాల్ పరిసరాల్లో దుండగుడు ఈ దారుణానికి పాల్పడినట్లు నగర పోలీస్ చీఫ్ బ్రయన్ హార్వే ప్రకటించారు. ఘటనా స్థలంలోనే ఏడుగురు చనిపోయారని, ఆసుపత్రిలో మరో ఇద్దరు మరణించారని తెలిపారు. మృతుల్లో ఇద్దరు పోలీసు అధికారులు ఉన్నారు. నిందితుడు ఒక్కసారిగా కాల్పులు జరపడంతో స్థానికులు ప్రాణ భయంతో అటు ఇటు పరుగులు తీశారు. ఈ ఊచకోతకు పాల్పడిన దుండగుడి ఉద్దేశమేమిటన్నది ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. హత్యాకాండకు ఈ ఘటనపై స్పందించిన టెక్సాస్ రాష్ట్ర గవర్నర్ ఇది మాటలకు అందని విషాదమని వ్యాఖ్యానించారు. స్థానిక అధికారులకు, బాధితులకు అన్ని రకాల సహాయసహకారాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అమెరికాలో ఈ ఏడాది ఇంతవరకు 128 కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి. అమెరికాలో పెచ్చరిల్లుతున్న తుపాకీ సంస్కృతికి ఇది దర్పణంపడుతున్నది. అమెరికా సమాజాన్ని పట్టి పీడిస్తున్న ఈ తుపాకీ సంస్కృతిని అక్కడి రిపబ్లికన్లు బాహాటంగా సమర్థిస్తున్నారు.



పుట్టపాడు అడవుల్లో ఎదురు కాల్పులు

- ఇద్దరు మావోస్టులు మృతి
- ఇవి హత్యలే : ఆజాద్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లోని పుట్టపాడు అడవుల్లో పోలీసులు, మావోయిస్టులకు మధ్య ఆదివారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలో పుట్టపాడు అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేస్తున్న పోలీసులపై అకస్మాత్తుగా ఒక ఎత్తైన ప్రదేశం నుంచి మావోయిస్టులు కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు తిరిగి ఎదురు కాల్పులు జరిపారు. కొన్ని నిమిషాల పాటు మావోయిస్టులకు, పోలీసులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. అనంతరం ఆ ప్రదేశంలో రెండు మృతదేహాలను, ఒక ఎస్‌ఎల్‌ఆర్‌ను, ఒక సింగల్ బోర్ తుపాకీని, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో చర్ల ఎల్‌ఓఎస్ కమాండర్ మడకం ఎర్రయ్య రాజేష్‌గా గుర్తించారు. నిరాధాయుడైన రాజేష్‌ను పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని, ఇవి సర్కార్ హత్యలేనని అల్లూరి సీతారామరాజు, భద్రాద్రి కొత్తగూడెం డివిజన్ మావోయిస్టు పార్టీ కార్యదర్శి ఆజాద్ ఆరోపించారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు దీనిని ఖండించాలని ఆయన ఓ లేఖలో కోరారు.

దిక్కుతోచని మొక్కజొన్న రైతు

- కొనుగోలుకు ప్రభుత్వం ఆంక్షలు
- ఆలస్యంగా కేంద్రాలు ప్రారంభం
- అకాల వర్షాలతో అపారనష్టం

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల మొక్కజొన్న రైతులు ఎక్కువగా నష్టపోయారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం వల్ల ఈ నష్టం మరింత పెరిగింది. రబీ సీజన్‌లో 26 జిల్లాల్లో 5.93 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది మొక్కజొన్న సాగు చేశారు. అత్యధికంగా బాపట్ల జిల్లాలో 94 వేల ఎకరాల్లో సాగైంది. ఏలూరు జిల్లాలో 71 వేలు, గుంటూరు జిల్లాలో 60 వేలు, విజయనగరం జిల్లాలో 59 వేలు, నంద్యాల జిల్లాలో 49 వేలు, పల్నాడు జిల్లాలో 34 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. రెండ్రోజుల క్రితం ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల్లో అనేక ఆంక్షలు విధించారు. దీంతో, రైతులకు కష్టాలు మరింత పెరిగాయి. ఏప్రిల్‌లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని మార్క్‌ఫెడ్ అధికారులు మార్చిలో ప్రకటించారు. కానీ, మే మొదటి వారంలో ఏర్పాటు చేశారు. గత నెల 29 నుంచి రాష్ట్రంలో అకాల వర్షాలు ప్రారంభమయ్యాయి. అప్పటికే మొక్కజొన్న కండెలను రైతులు విరిసి పొలాల్లో ఉంచారు. రెండు రోజులు ఆరబెట్టి మిషన్ల వద్దకు తీసుకెళ్లేలోగా వర్షాలకు తడిసిపోయాయి. కొన్ని జిల్లాల్లో కండెలను మిషన్ల వద్దకు తీసుకెళ్లి మొక్కజొన్న గింజలను కళ్లాల్లో ఆరబోసి ఉంచగా వర్షాలకు తడిసిపోయాయి. పట్టాలు కప్పినా ఫలితం లేకపోయింది. కోసిన పంట వర్షాలకు తడిసి కండెలకు మొక్కలు వచ్చాయి. వాతావరణంలో అధిక తేమ, వర్షాలు ఎక్కువ రోజులు కొనసాగడంతో కొన్నిచోట్ల బూజు (ఫంగస్) వచ్చింది. దీంతో, ప్రయివేటు వ్యాపారులు కూడా కొనడం లేదు. ఆరబోసిన ప్రాంతాల్లో భూమి కింద భాగం నుంచి తేమ వచ్చి గింజలకు ఫంగస్ ఎక్కువగా వచ్చిందని అధికారులు చెబుతున్నారు. సాగుకు ముందే రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బికెల్లో) నమోదు చేసుకున్న రైతులు మొక్కజొన్న విక్రయానికి మళ్లీ దరఖాస్తు చేయాలని అధికారులు సూచించారు. మొక్కజొన్న క్వింటాలు మద్దతు ధర రూ.1,962గా నిర్ణయించారు. ఆర్‌బికెల్లో కొనుగోలుకు ఎక్కువ సమయం పడుతోందని, ఈలోగా తాము కోసిన మొక్కజొన్నను ఎక్కడ దాచాలో తెలియడంలేదని రైతులు వాపోతున్నారు. 14 శాతం కన్నా తక్కువ తేమ శాతం ఉండాలని, ఫంగస్ వస్తే ఎండబెట్టి ఫంగస్ పోయిన తరువాత తీసుకురావాలని మిగతా 2లో



గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలంలో మొక్కజొన్నకు మొలకలు

టిడిపిలో చేరిన పీరుకట్ల విశ్వప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శ్రీకాకుళం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ టిడిపిలో చేరారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్వప్రసాద్‌కు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఆముదాలవలస టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కూన రవికుమార్ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. విశ్వప్రసాద్‌తో పాటు ఆయన సోదరుడు పీరుకట్ల ప్రభాకర్ రావుకు, ఆయన అనుచరులకు పార్టీ కండువాలు కప్పి చంద్రబాబు వారిలో పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఆకాశవాణి పేరుపై కేంద్రానికి డిఎంకె లేఖ

చెన్నై: ఆల్ ఇండియా రేడియోను ఆకాశవాణిగా మారుస్తూ ప్రసారభారతి నిర్ణయాన్ని తమిళనాడులోని అధికార డీఎంకే (%ణవీఖ%) పార్టీ తప్పుబట్టింది. ఈ మేరకు ఆ పార్టీ ఎంపీ టీఆర్ బాలు కేంద్ర సమాచార, ప్రసార మంత్రి అనురాగ్ ఠాకూర్ కు లేఖ రాశారు. ఆకాశవాణి పదానికి బదులు ఆల్ ఇండియా రేడియో పేరునే వినియోగించాలని డిమాండ్ చేశారు.

"ఆల్ ఇండియా రేడియోకు బదులు ఆకాశవాణి అని పిలవడాన్ని డీఎంకే పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ఈ విషయంలో మీరు కలుగజేసుకుని పాత పేరునే వినియోగించాలని ప్రసారభారతి కి సూచించాలని మిమ్మల్ని కోరుతున్నా. ఇది సరైన నిర్ణయం కాదు. ప్రసారభారతి నిర్ణయానికి వ్యతిరేకంగా తమిళనాడులో పలు పార్టీలు, ప్రజలు ఆందోళన చేపట్టారు. తమిళనాడులోని రేడియో కేంద్రాలు ఆకాశవాణిని వానొలి అని పలుకుతున్నాయి"అని లేఖలో పేర్కొన్నారు.

ప్రసారభారతి మాత్రం పేరు మార్పు అనేది ఇది గతంలో తీసుకున్న నిర్ణయమని చెబుతోంది. కొద్ది రోజుల క్రితం రేడియోల్లో ప్రసారాలు, ప్రకటన సమయంలో ఇక మీదట కేవలం ఆకాశవాణి అన్న పేరు మాత్రమే ఉపయోగించాలని ఆకాశవాణి డీజీ వసుధా గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు.



యుపిలో రోడ్డు ప్రమాదం

- ఐదుగురి మృతి

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో శనివారం రాత్రి ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా మరో పదిహేను మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెళ్లి బృందం ప్రయాణిస్తున్న వ్యాన్‌ను జాలౌన్ జిల్లాలోని గోపాల్ పుర ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో వ్యాన్ బోల్తా పడింది. ఆ సమయంలో వాహనం 40 మంది ప్రయాణికులు ఉన్నారు. ఐదుగురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. పదిహేను మందికి గాయాలు కావడంతో దగ్గర్లోని ఆసుపత్రికి తరలించినట్లు వివరించారు. మిగతా ప్రయాణికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మాధోగఢ్ పోలీసులు తెలిపారు.

బిడ్స్ ముసుగులో 'ఉక్కు'పై ప్రయి'వేటు'

- మహిళా రెజ్లర్ల ఆందోళనపై కేంద్రం కళ్లు తెరవాలి
- ఎల్‌జి పాలిమర్స్ బాధితులకిచ్చిన హామీల అమలేదీ? : రాఘవులు



ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం చాలా మొండిగా వ్యవహరిస్తోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. వర్కింగ్ కేపిటల్ అందకుండా, నిధులివ్వకుండా బిగబట్టి ఏదో ఒకరకంగా దివాళా తీయించి ప్రయివేటీకరణకు కుట్ర చేస్తోందని విమర్శించారు. ఆదివారం ఆయన విశాఖలోని జగదాంబ సమీపానగల సిపిఎం కార్యాలయంలో పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వర్కింగ్ కేపిటల్ కోసం బిడ్స్‌ను తాజా ముందుకు తెచ్చిందని చెప్పారు. ముడిసరుకు సరఫరా చేయడం, ఉత్పత్తి అయ్యాక మధ్యంతర ఉత్పత్తిని తీసుకోవడం కోసం బిడ్స్ (ఇఒఐ) పిలిచామని, ఇది ప్రయివేటీకరణ కాదని స్టీల్ యాజమాన్యం చెబుతుండడం శోచనీయమన్నారు. ఇఒఐకి 29 కంపెనీలు ఆసక్తి చూపగా తమకు తెలిసిన సమాచారం ప్రకారం 19 బిడ్స్ తిరస్కరణకు గురై పది మాత్రమే మిగిలాయని, వాటిలో విదేశీ కంపెనీలే అధికంగా ఉన్నాయని తెలిపారు. ఈ కంపెనీలు ఏ ప్రాతిపదికన బిడ్డింగ్‌లో పాల్గొన్నాయి? ఎలాంటి షరతులు విధించారు? ఆయా దేశాల ఉత్పత్తిలో ఈ కంపెనీలకు భాగస్వామ్యం ఉందా? ముడిసరుకు సరఫరా చేసి ఉత్పత్తిని పట్టుకుపోతాయా? వంటి విషయాలను, బిడ్స్ షరతులను యాజమాన్యం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. బిడ్స్ ముసుగులో ప్రయివేటీకరణను సహించేది లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన ఎన్ఎండిసి, సెయిల్ వంటి వాటి నుంచి ముడిసరుకు సాధించాలని కోరారు. స్టీల్ కార్మికుల వేతన ఒప్పందాలు అన్ని చోట్లా అమల్లోకి వచ్చాయని, ఒక్క వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు అమలు కాలేదని తెలిపారు. కార్మికుల్లో అసంతృప్తిని సృష్టించి వారిని నిర్లిప్తతకు గురిచేసి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేయనివ్వకుండా నిస్తేజంగా ఉండేలా కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. స్టీల్ ఉత్పత్తిలో కార్మికులు ఉత్సాహంగా పాల్గొనాలంటే వేతన ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున జంతర్ మంతర్ వద్ద కొద్ది రోజులుగా మహిళా రెజ్లర్లు చేస్తోన్న ఆందోళనపై మోడీ సర్కారు కళ్లు తెరవాలని రాఘవులు డిమాండ్ చేశారు. ఐదుగురు మహిళా రెజ్లర్లపై డబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్ అనుచితంగా ప్రవర్తించాడని, లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఆందోళన జరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం ఉలుకూ పలుకూ లేకుండా కాలయాపన చేయడం దారుణమని తెలిపారు. తమపై లైంగిక వేధింపులు జరిగాయని బాధితులు చెప్పినా పట్టించుకోకపోవడం, అధికారులను సైతం ప్రధాని మోడీ విచారణకు ఆదేశించకపోవడం ఘోరమన్నారు. రెజ్లర్ల ఆందోళనపై క్రీడాకారులంతా స్పందించి సంఘీభావం తెలపాలని కోరారు. దేశానికి పతకాలు తెచ్చిపెట్టిన మహిళా క్రీడాకారుల పట్ల మోడీ సర్కారు ఇలా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. వెంటనే బ్రిజ్‌భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

విశాఖలో ఎల్‌జి పాలిమర్స్ ఘటన జరిగి మూడేళ్లవుతోందని, సిఎం జగన్ నాడు చేసిన వాగ్దానాల్లో కొన్నే అమలయ్యాయని రాఘవులు తెలిపారు. బాధిత గ్రామాల ప్రజల ఆరోగ్య విషయాలు పట్టించుకోలేదని, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి నేటికీ పునాదిరాయి కూడా వేయలేదని అన్నారు. పరిహారం కూడా అరకొరగానే అందించారని తెలిపారు.

ఎపిలో దురదృష్టకర రాజకీయ పరిస్థితులు

దేశంలో ఏ రాష్ట్రంలోనూలేని దురదృష్టకర రాజకీయాలు ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్నాయని రాఘవులు వ్యాఖ్యానించారు. ఇక్కడ అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు మోడీని పొగడడంలో పోటీపడుతున్నాయని, రాష్ట్ర ప్రయోజనాలను ఏ మాత్రమూ పట్టించుకోవడం లేదని అన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు ఒక టివి ఛానల్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ రాజకీయాలకూ, అభివృద్ధికీ సంబంధం లేదని చెప్పడం కొత్త రాజకీయంలా అనిపిస్తోందని పేర్కొన్నారు. కేంద్ర పాలన బాగుందని చెబితే పర్వాలేదని, లేదంటే జైళ్లకు పంపిస్తామని బెదిరించే రాజకీయం బిజెపిదని, ఎపి విషయంలోనూ అదే జరుగుతోందని ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నకు రాఘవులు సమాధానమిచ్చారు. దేశంలో బిజెపి పాలన అంతమే తమ లక్ష్యమని, అందుకోసం ఏ పార్టీ ఏ రాష్ట్రంలో కృషి చేసినా సిపిఎం సహకరిస్తుందని వెల్లడించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

కాంట్రాక్ట్ అధ్యాపకుల్ని రెగ్యులర్ చేయాలి

- రాష్ట్ర విస్తృత సమావేశం డిమాండ్
- నూతన కన్వీనింగ్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని డిగ్రీ, ఇంటర్, పాలిటెక్నిక్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే క్రమబద్ధీకరించాలని కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర సమావేశం డిమాండ్ చేసింది. గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ప్రభుత్వ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర విస్తృత సమావేశం కె రత్న అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యవక్తగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సంఘం నాయకులు కె శ్రీనివాస్‌యాదవ్, కె సురేష్ మాట్లాడుతూ 2/94 యాక్ట్‌ను సవరించి, అందర్నీ రెగ్యులర్ చేయాలని, ఈలోగా వచ్చే విద్యా సంవత్సరానికి అధ్యాపకులకు ఒకరోజు బ్రేక్‌తో రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం క్రమబద్ధీకరించినట్లుగానే ఎపి ప్రభుత్వమూ చర్యలు తీసుకోవాలని కోరారు. 2014కు ముందు విధుల్లో చేరిన కాంట్రాక్ట్ అధ్యాపకులందరినీ క్రమబద్ధీకరించాలన్నారు. 2/94 యాక్ట్‌ను సవరించకుండా క్రమబద్ధీకరిస్తే 2004కు ముందు విధుల్లో చేరిన కేవలం సుమారు 700 మంది మాత్రమే అర్హత సాధిస్తారని, 2008-2014కు మధ్య ఎక్కువమంది కాంట్రాక్ట్ అధ్యాపకులు విధుల్లో చేరారని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ జెఎసి చైర్మన్ ఎవి నాగేశ్వరరావు ఇప్పటిదాకా ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలన్నీ పోరాటాల ద్వారానే సాధించుకున్నవేనని, కావున కాంట్రాక్ట్ అధ్యాపకులు, ఉద్యోగులు ఐక్యంగా ఉండి క్రమబద్ధీకరణ కోసం పోరాడాలని కోరారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం జాతీయ అధ్యక్షులు కొప్పిశెట్టి సురేష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని క్రమబద్ధీకరణ చేసిన నేపథ్యంలో రాష్ట్రంలోనూ ఉద్యోగులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. ఎన్నికల హామీని ప్రభుత్వం నెరవేర్చి, ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల్ని క్రమబద్ధీకరించాలని, 2/94 యాక్ట్‌ను సవరించాలని, ఒక్కరోజు బ్రేక్‌తో రెన్యువల్ ఇవ్వాలని, ఎపిపిఎస్‌సి నోటిఫికేషన్లు నిలిపివేయాలని సమావేశంలో తీర్మానించారు.

అనంతరం కె శ్రీనివాస్‌యాదవ్, కె సురేష్ కన్వీనర్లుగా, కె రత్నకుమారి, జి మాణిక్యం, డి ఉమాదేవి, ఎ సంతోషరావు, కె శ్రీనివాసరావు, మాదవరావు, డాక్టర్ ప్రభాకర్, కె లలితారాణి, శేషగిరి, బాలయ్య, బి వీరయ్య, రామరాజు కో-కన్వీనర్లుగా కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు రాజగోపాల్, పాలిటెక్నిక్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర నాయకులు సాయిరాజు పాల్గొన్నారు.

విద్యార్థులను సురక్షితంగా తీసుకురావాలి

- సిఎస్‌కు చంద్రబాబు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మణిపూర్‌లోని ఇంఫాల్‌లో స్థానిక ఘర్షణల్లో చిక్కుకున్న తెలుగు విద్యార్థులను సురక్షితంగా ఇంటికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని టిడిపి అధినేత చంద్రబాబ నాయుడు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. ఇంఫాల్‌లోని సెంట్రల్ అగ్రికల్చర్ యూనివర్సిటీ, ఎన్‌ఐటిలలో సుమారు 100 మందికి పైగా తెలుగు విద్యార్థులు చదువుతున్నారని, ఘర్షణల నేపథ్యంలో వారి భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులను సురక్షితంగా ఇంటికి తిరిగి రావడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంఫాల్ నుంచి రాష్ట్రానికి ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులను తరలించాలని తెలిపారు. కాగా ఇంఫాల్‌లోని ఎన్‌ఐటి క్యాంపస్‌లో ఉన్న ఎపి ప్రజలను రాష్ట్రానికి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు, కార్యదర్శి అజయ్ భల్లాకు టిడిపి ఎంపి కనకమేడల రవీంద్ర విడివిడిగా లేఖలు రాశారు. మణిపూర్‌లో తెలుగు విద్యార్థులను కాపాడటంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు విమర్శించారు. ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రసరమ్యంగా నాటిక పోటీలు

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా తెనాలి మండలంలోని కొలకలూరులో మూడ్రోజులుగా కొలంకపురి నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇరు తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు రంగస్థల కళావైభవానికి అద్దం పట్టే రీతిలో సాగుతున్నాయి. ప్రతి ప్రదర్శన ఒక విలువైన సందేశంతో సాగుతోంది.

గ్రామంలోని అగస్తేశ్వర స్వామి ఆలయం ఎదుట రెబలస్టార్ ఉప్పలపాటి కృష్ణంరాజు కళాప్రాంగణంలో ఆదివారం మూడోరోజు నాటిక ప్రదర్శనలకు ప్రముఖ పారిశ్రామికవేత్త కారెంపూడి వెంకట్రావ్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రముఖ రంగస్థల నటులు నూతలపాటి సాంబయ్య అధ్యక్షతన నిర్వహించిన సభలో కరణం సురేష్ జ్ఞాపకార్థం సవ్యసాచి పురస్కారాన్ని ప్రముఖ రంగస్థల, సినీ నటుడు నాయుడు గోపికి అందించారు. గుంటూరుకు చెందిన అమ్మన విజయలక్ష్మి, కాకినాడ ప్రాంతం పత్తిపాడుకు చెందిన యాకుబ్ కుటుంబ సభ్యులకు కళాపరిషత్ తరపున ఆర్థికసాయం అందించారు. ఆత్మీయ అతిథులుగా ప్రముఖ రంగస్థల కళాకారులు వైఎస్ కృష్ణేశ్వరరావు, కావూరి సత్యనారాయణ, నరసరావుపేటకు చెందిన రంగస్థలి అధ్యక్షులు షేక్ బాజి, పరిషత్ బృందం పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న నాటిక ప్రదర్శనలు

నాటిక ప్రదర్శనలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ఆదివారం తొలి ప్రదర్శనగా గుంటూరు అభినయ ఆర్ట్స్‌వారి 'అతీతం' నాటికను ప్రదర్శించారు. రామచంద్రమౌళి రచనకు ఎన్ రవీంద్రారెడ్డి దర్శకత్వం వహించారు. రెండో ప్రదర్శనగా చలసాని కృష్ణప్రసాద్ దర్శకత్వంలో పిటి మాధవ్ రచించిన 'నిశ్శబ్దమా.. నీ ఖరీదు ఎంత?' నాటికను ప్రదర్శించారు. మూడో ప్రదర్శనగా సూదనగుంట వెంకటేశ్వర్లు స్వీయ రచన, దర్శకత్వంలో వీరన్నపాలెం కళానికేతన్ వారు 'స్థిరాస్థి' నాటికను ప్రదర్శించారు.



సవ్యసాచి పురస్కారం అందుకుంటున్న నాయుడు గోపి

నేడు యండమూరికి పురస్కారం:

పోటీల చివరి రోజైన సోమవారం రాత్రి ప్రముఖ నాటక, నవల రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌కు గోపరాజు వెంకట శివరామ సుబ్రహ్మణ్యా శర్మ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మరో తొమ్మిది మంది రంగస్థల ప్రముఖులకు దర్శక, దార్శనికుల గౌరవ పురస్కారాలను అందించనున్నారు. చివరి రోజున ప్రత్యేక ప్రదర్శనగా శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు వారి 'ప్రేమతో నాన్న' నాటికను ప్రదర్శించనున్నారు.

నెలాఖరు నాటికి జిల్లా కేంద్రాలకు జెవికె కిట్లు

- ముమ్మరంగా పాఠశాల విద్యాశాఖ కసరత్తు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అందించే జగనన్న విద్యా కానుక (జెవికె) కిట్లను ఈ నెలాఖరు నాటికి జిల్లా కేంద్రాలకు చేరవేసేందుకు పాఠశాల విద్యాశాఖ ముమ్మర కసరత్తు చేస్తోంది. ఈ కిట్లలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యునిఫాం, జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్ట్ అందిస్తున్న విషయం తెలిసిందే.

- మొత్తం టెక్స్‌బుక్స్, వర్క్ బుక్స్ 3,54,61,730 పుస్తకాలు అవసరమని పాఠశాల విద్యాశాఖ తేల్చింది. వీటిల్లో ఇప్పటికే 1,67,52,446 పుస్తకాలను జిల్లా గొడౌన్, మండల జెవికె పాయింట్లకు చేరవేసింది. మరో 23,16,786 పుస్తకాలు ముద్రణకు సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ నెల 14లోపు 70.43 శాతం పూర్తవుతుందని పేర్కొన్నారు. మిగిలిన 1,04,83,595 పుస్తకాల కోసం 3,697 మెట్రిక్ టన్నుల పేపర్ అవసరమని తెలిపారు. ప్రస్తుతం రోజుకు 350 నుంచి 400 మెట్రిక్ టన్నుల పేపర్ కాంట్రాక్టర్ నుంచి వస్తోందని చెప్పారు.
- యునిఫాం మూడు జతల కింద 39,95,992 సెట్లు అవసరమని విద్యాశాఖ తేల్చింది. వీటిల్లో ఇప్పటికే 3,87,393 సెట్లు సరఫరా చేశామని, మరో 4,66,439 సెట్లు పంపుతున్నామని తెలిపారు. మరో 5,02,545 జతలు కాంట్రాక్టర్ దగ్గర ఉన్నాయని పేర్కొంది. రోజుకు లక్ష సెట్ల వరకు ఉత్పత్తి జరుగుతుందని, మిగిలిన 21,71,706 సెట్లు ఈ నెల 26తో పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు.
- అదేవిధంగా 39,95,992 బ్యాగ్‌లు అవసరం కాగా వీటిలో 2,43,399 బ్యాగ్‌లు కాంట్రాక్టర్ నుంచి వస్తున్నాయని చెబుతున్నారు. మరో 9,25,201 బ్యాగ్‌లు కాంట్రాక్టర్ వద్ద ఉన్నాయని అంటున్నారు. రోజుకు 1.20 లక్షల బ్యాగ్‌ల ఉత్పత్తి జరుగుతుందని, ఈ నెల 27తో మొత్తం పూర్తవుతుందని చెబుతున్నారు.
- బూట్లు 39,83,297 జతలు అవసరం మని అధికారులు నిర్ణయించారు. వీటిల్లో జెవికె మండల పాయింట్లకు 21,741 జతలు చేరుకున్నాయని, మరో 93,879 జతలను పంపించిన్నట్లు అధికారులు చెబుతున్నారు. కాంట్రాక్టుల వద్ద 14,24,960 జతలు ఉన్నాయని, వీటిని ఈ నెల 11వ తేదిలోపు మండల కేంద్రాలకు పంపిస్తామని అంటున్నారు. రోజుకు 1.30లక్షల బూట్ల ఉత్పత్తి జరుగుతుందని, మిగిలిన 24,42,717 బూట్లను ఈ నెల 25వ తేది నాటికి పూర్తవుతుందని అంచనా వేస్తున్నారు.
- నోట్ పుస్తకాలు 2,32,46,064 అవసరం కాగా వీటిల్లో మండల కేంద్రాలకు 7,36,326 పుస్తకాలను అందించారు. మరో 2,22,072 పుస్తకాలు మండల కేంద్రాలకు పంపామని, మరో 28,50,000 పుస్తకాలు కాంట్రాక్టర్ల వద్ద ఉన్నాయని చెబుతున్నారు. రోజుకు 7లక్షల పుస్తకాల పంపిణీ జరుగుతుందని, మిగిలిన 1,94,37,666 పుస్తకాలు ఈ నెల 26వ తేదితో పూర్తవుతుందని చెబుతున్నారు. ఈ నెల 31వ తేది నాటికి జెవికె కిట్లలోని అన్ని వస్తువులను అన్ని జిల్లాలకు పంపుతామని, పాఠశాలలు తెరిచే నాటికి జెవికె కిట్లను విద్యార్థులకు అందిస్తామని అధికారులు అంటున్నారు.

దిక్కుతోచని మొక్కజొన్న రైతు

(మొదటి పేజి తరువాయి)

అధికారులు ఆంక్షలు పెడుతున్నారు.

పలు జిల్లాల్లో గత తొమ్మిది రోజులుగా వర్షాలు కొనసాగుతున్నాయి. ఎండ తీవ్రత లేదు. ఈ నెల 10వ తేదీ వరకూ వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. దీంతో, ఫంగస్ పోవడానికి ఎండలో ఆరబెట్టేందుకు రైతులకు అవకాశం లేకుండాపోయింది. పైగా, ఎప్పుడు వర్షం వస్తుందోనని భయం, ఆరబెట్టుకునేందుకు అనువైన స్థలాలు లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తడిసిన మొక్కజొన్నను కొనుగోలు చేసినా వాటిని కోళ్ళు, పశువుల మేతకు తప్ప, మనుషుల ఆహారానికి వినియోగించలేని పరిస్థితి ఉందని, ఫంగస్ మరింత పెరిగితే పశువులకు కూడా వినియోగించకూడదని అధికారులు అంటున్నారు. కోసిన మొక్కజొన్నను ఇళ్లకు తెచ్చుకోలేక, ఆర్‌బికెల్లో విక్రయించుకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మొక్కజొన్న తడిసి మొలకలు వస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తం విస్తీర్ణంలో 33 శాతం మునిగితేనే నష్టపరిహారం వస్తుందని అధికారులు చెబుతున్నారు. పంట కోయకుండా ఉంటేనే నష్టపరిహారం వస్తుందని అంటున్నారు. కోసిన తరువాత నష్టం జరిగితే పరిహారం రాదన్న నిబంధనలు సడలించాలని, పంటన వెంటనే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

ఉక్కు పోరాటానికి దేశవ్యాప్త మద్దతు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటానికి దేశ వ్యాప్త మద్దతు లభిస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ తెలిపింది. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 815వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ, నాయకులు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉద్యమం దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమవుతోందన్నారు. అయినప్పటికీ మోడీ సర్కారు ప్రయివేటీకరణకే మొగ్గు చూపడం దారుణమన్నారు. ఉక్కును కాపాడుకోవడానికి ఎంతటి పోరాటానికైనా కార్మికులు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. సొంత గనులు కేటాయించి, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ పనిచేసేలా చూడాల్సిన బాధ్యత నుంచి కేంద్ర ప్రభుత్వం తప్పుకుని ప్రయివేటువారికి అప్పగించడానికి పూనుకోవడం హేయమైన చర్య అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు కర్మాగారం విషయంలో జోక్యం చేసుకుని కేంద్రంపై ఒత్తిడి పెంచాలని కోరారు.



ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం వేమవరంలో సమస్యలను తెలుసుకుంటున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- వేమవరంలో సిపిఎం బృందం పర్యటన

ప్రజాశక్తి - విజయవాడ రూరల్

పేదలు తమ సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని, ఇందుకు సిపిఎం అండగా ఉంటుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలోని వేమవరంలో సిపిఎం ప్రతినిధి బందం ఆదివారం పర్యటించింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు ఎదుట గ్రామస్తులు తమ సమస్యలను ఏకరువుపెట్టారు. తమ గ్రామంలోని సమస్యలను ఎవరూ పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, అసలు డ్రెయినేజీ వ్యవస్థేలేదని వాపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, రెండు రోజులకొకసారి నీళ్ల వచ్చే పరిస్థితి ఉందని తెలిపారు. కోతుల సమస్యను కూడా గ్రామస్తులు నేతల దృష్టికి తీసుకొచ్చారు. అంగన్‌వాడీ సెంటరు కూడా తమకు దూరంగా ఉందని తెలిపారు. మంచినీటి పైపులైను పగిలిపోయి ఐదు నెలలు అవుతున్నా దానికి మరమ్మతులు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వస్తే రోడ్లన్నీ నీటిలో మునిగిపోయి నడవలేని విధంగా తయారవుతున్నాయని వివరించారు. తమ సమస్యల పరిష్కారానికి సిపిఎం నేతలైనా కృషి చేయాలని విన్నవించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి గ్రామస్తులంతా ఐక్యమై ఉద్యమించాలన్నారు. సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో పర్యటించిన బృందంలో పార్టీ రాష్ట్ర, జిల్లా, స్థానిక నాయకులు పి.అజయ్ కుమార్, ఎం.హరిబాబు, ఎ.వెంకటేశ్వరరావు, టి.నరసింహారావు, తాడిసెట్టి శ్రీను, ఏసుపాదం, సాంబశివరావు, రాజ్యం, మల్లేశ్వరరావు, సంసోను తదితరులు ఉన్నారు.

మణిపూర్ నుండి విద్యార్థులను తక్షణం రప్పించాలి

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మణిపూర్ రాష్ట్రంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులతో రాష్ట్రానికి చెందిన విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వున్నారని, ఆ విద్యార్థులను తక్షణమే రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత కొద్దిరోజులుగా రిజర్వేషన్ల సమస్యపై మణిపూర్ రాష్ట్రంలో ఏర్పడిన ఘర్షణలు, అత్యవసర పరిస్థితితో కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులిచ్చారని తెలిపారు. మణిపూర్ ఎన్ఐటిలో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి దారుణంగా వుందని పేర్కొన్నారు. విద్యార్థులు చాలా ఆందోళనతో ఉన్నారని పేర్కొన్నారు. ఈ ఘర్షణలతో మణిపూర్‌లోని అన్ని కమ్యూనికేషన్స్ వ్యవస్థలు ధ్వంసమైన నేపథ్యంలో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనతో వున్నారని పేర్కొన్నారు. తెలంగాణా ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక విమానాల ద్వారా విద్యార్థులను తీసుకురావడానికి ప్రయత్నాలు మొదలు పెట్టిందని రాష్ట్ర ప్రభుత్వం కూడా తక్షణం మణిపూర్ నుండి విద్యార్థులను తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.

విద్యార్థులతో ఫోన్‌లో మాట్లాడిన రామకృష్ణ

మణిపూర్‌లో చిక్కుకున్న రాష్ట్ర విద్యార్థులతో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. అక్కడ ఏపి విద్యార్థులంతా భయానక వాతావరణంలో వున్నారని తక్షణమే వారి తరలింపునకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యను శాంతిభద్రతల సమస్యలా కాకుండా రాజకీయ సమస్యగా గుర్తించి తక్షణమే పరిష్కరించాలని కోరారు.

ఎంపీలపై అనర్హత వేటు..

- 1988 తర్వాత 42 మంది ఎంపీలపై చర్య
- 14వ లోక్‌సభలో అత్యధికంగా 19 మంది తొలగింపు

న్యూఢిల్లీ : 1988 తర్వాత ఇప్పటి వరకూ పార్లమెంటులో 42 మంది ఎంపీలు అనర్హత వేటుకు గురై సభ్యత్వాలు కోల్పోయారు. 14వ లోక్‌సభ అత్యధికంగా 19 మందిపై వేటు వేసింది. ప్రశ్నలు అడిగినందుకు ముడుపులు తీసుకున్న ఉదంతం, క్రాస్ ఓటింగ్ వంటి కారణాలతో ఎక్కువ మంది సభ్యుల సభ్యత్వాలు రద్దయ్యాయి. పార్టీ ఫిరాయింపులు, సభలో ప్రవర్తన, రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం జైలుశిక్ష పడడం వంటి కారణాలతో ఎంపీల సభ్యత్వాలను రద్దు చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఎన్‌సిపి నేత మహమ్మద్ ఫైజల్, బిఎస్‌పి నాయకుడు అఫ్జల్ అన్సారీలకు న్యాయస్థానాలు జైలుశిక్ష విధించడంతో వారి సభ్యత్వాలు రద్దయ్యాయి. వీరిలో ఫైజల్ కోర్టు నుంచి స్టే పొందారు. 1985లో ఫిరాయింపుల నిరోధక చట్టం అమలులోకి వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా కాంగ్రెస్ సభ్యుడు లాల్‌డుహోమాపై వేటుపడింది. తొమ్మిదవ లోక్‌సభలో జనతాదళ్ నేత విపి సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు తొమ్మిది మంది సభ్యులపై ఫిరాయింపుల నిరోధక చట్టం కింద వేటు పడింది.

2005లో ముడుపులు తీసుకొని ప్రశ్నలు అడిగినందుకు ఉభయసభలకు చెందిన 11 మందిని, 2008 జూలైలో ప్రభుత్వంపై విశ్వాస పరీక్ష సందర్భంగా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినందుకు తొమ్మిది మంది లోక్‌సభ సభ్యులను అనర్హులుగా ప్రకటించారు. 10వ లోక్‌సభలో పివి నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు పార్టీ ఫిరాయించిన నలుగురిపై వేటు పడింది. రాజ్యసభ కూడా 1989 నుండి ఇప్పటివరకూ నలుగురిపై వేటు వేసింది. పార్లమెంట్ సభ్యుడిగా ఉంటూ లాభాలు ఆర్జించే వేరే పదవిని నిర్వహించినందుకు 2001లో జెఎంఎం నేత శిబూ సొరేన్, 2006లో సమాజ్‌వాదీ పార్టీ సభ్యురాలు జయాబచ్చన్‌లపై అనర్హత వేటు వేశారు. అవినీతి కేసులో శిక్ష పడిన కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు రషీద్ మసూద్, దాణా కుంభకోణం కేసులో శిక్ష పడిన ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, జెడి (యు) సభ్యుడు జగదీష్ శర్మ కూడా అనర్హతకు గురయ్యారు.

పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి-పెండ్లిమర్రి (కడప జిల్లా)



పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించలేదన్న మనస్తాపంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన వైఎస్ఆర్ కడప జిల్లా పెండ్లిమర్రి మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాచనూరు గ్రామానికి చెందిన పొలతల అనూష (14) చౌటపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలు రాసింది. శనివారం విడుదలైన పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేనిసమయంలో బాత్‌రూమ్‌లో చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బాత్‌రూమ్‌కు వెళ్లిన కుమార్తె ఎంతకూ బయటకు రాకపోవడంతో తల్లిదండ్రులు ఆంజనేయులు, శాంతకుమారి అనుమానంతో తలుపులు పగలగొట్టి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించింది. తహశీల్దార్ ఉదయభాస్కర్‌రాజు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆంబోతు వీరంగంతో వృద్ధుడు మృతి

రెండు ఆవులూ మృత్యువాత

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని మట్టపర్రు గ్రామంలో ఒక ఆంబోతు ఆదివారం ఉదయం వీరంగం సృష్టించింది. సమీప గ్రామాల్లో కొద్ది రోజులుగా సంచరిస్తున్న ఈ అంబోతు శనివారం రాత్రి నుంచి రంకెలు వేస్తూ విపరీత చేష్టలతో తిరుగుతుండటంతో జనం ఆందోళన చెందారు. ఆదివారం తెల్లవారుజామున మట్టపర్రు చినపాలెం గ్రామానికి చెందిన పెచ్చెట్టి శ్రీరామమూర్తి (76) కాలకృత్యాలు తీర్చుకునేందుకు రోడ్డుపై నడిచి వెళ్తుండగా ఆంబోతు ఒక్కసారిగా దాడి చేసి కొమ్ములతో ఎత్తి పడేసింది. దీంతో శ్రీరామమూర్తి అక్కడికక్కడే మృతి చెందారు. గమనించిన గ్రామస్తులు కేకలు వేయడంతో ఆంబోతు అక్కడి నుంచి పారిపోయి పెనుమదం శివారు అల్లంగుంట వైపు వెళ్లింది. అక్కడ రెండు ఆవులను పొడవటంతో అవి మృత్యువాత పడ్డాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఫైర్, రెవెన్యూ, వెటర్నరీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఐదు గంటల శ్రమించాక మధ్యాహ్నం సమయంలో ఆంబోతును బంధించారు. శ్రీరామ్మూర్తి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీట మునిగి ఇద్దరు మృతి

- ఒకరు గల్లంతు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్/ బ్రి.కొత్తకోట (కడప జిల్లా)

వేర్వేరు చోట్ల నీట మునిగి ఇద్దరు మృతి చెందగా, ఒకరు గల్లంతయ్యారు. ఈ సంఘటనలు వైఎస్ఆర్ కడప జిల్లాలో ఆదివారం చోటుచేసుకున్నాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజంపేటకు చెందిన యశ్వంత్ కుమార్ (23), ధనుష్ (20), కార్తీక్, హేమంత్ కలిసి ఊటుకూరులోని చెరువులోకి ఈతకు వెళ్లారు. కార్తీక్, హేమంత్ ఒడ్డున ఉండగా యశ్వంత్ కుమార్, ధనుష్ చెరువులోకి దిగారు. లోతుగా ఉన్న ప్రాంతంలోకి వెళ్లడంతో మునిగి గల్లంతయ్యారు. ఒడ్డున ఉన్న యువకులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని గల్లంతైన యువకుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వారిలో యశ్వంత్ కుమార్ మతదేహాన్ని వెలికి తీశారు. ధనుష్ మతదేహం కోసం గాలిస్తున్నారు. యశ్వంత్ పాలిటెక్నిక్ చదువుతుండగా, ధనుష్ కడప ఆర్‌డిఒ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

పెద్దతిప్పసముద్రం మండలంలోని పులికల్లు పంచాయతీ పరిధిలోనిహరిజనవాడకు చెందిన మిట్టపల్లి కిట్టన్న (45) గ్రామానికి సమీపంలో ఉన్న చెరువులో చేపల వేటకు వెళ్లారు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మతి చెందారు. ఈ ఘటనలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమలలో కనిపించని రద్దీ

ప్రజాశక్తి- తిరుమల

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. వర్షాలు, తుఫాను హెచ్చరికలతో భక్తులు తమ తిరుమల పర్యటనను రద్దు చేసుకున్నారని టిటిడి అధికారులు తెలిపారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని పది కంపార్ట్‌మెంట్లలో భక్తులు శ్రీవారి దర్శనం కోసం వేచి ఉన్నారు. నడకదారి వచ్చే భక్తులకు నాలుగు గంట సమయంలోనే శ్రీవారి దర్శనం పూర్తవుతుందని అధికారులు తెలిపారు. ఉదయం ఏడు గంటలకు సర్వదర్శనం క్యూలైన్‌లోకి టోకెన్లు లేకుండా ప్రవేశించిన భక్తులకు మాత్రం పన్నెండు గంటల పాటు శ్రీవారి దర్శన సమయం పట్టే అవకాశముందని పేర్కొన్నారు. రూ.300 ప్రత్యేక దర్శనం భక్తులకు శ్రీవారి దర్శనం రెండు నుంచి మూడు గంటల సమయం పడుతోందని తెలిపారు. తిరుమల శ్రీవారిని 76,392 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 36,248 మంది తమ తలనీలాలను సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారని అన్నారు. హుండీ ఆదాయం 2.83 కోట్ల రూపాయలు వచ్చిందని వెల్లడించారు. పదో తరగతి పరీక్ష ఫలితాలు రావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

అకాల వర్షాలకు పంట నష్టాన్ని తగ్గించుకోండిలా !

వరి, మొక్కజొన్న రైతులకు వ్యవసాయశాఖ సూచనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అకాల వర్షాల కారణంగా పంట చేతికందే సమయంలో కళ్లెదుటే వర్షార్పణం అవుతుంటే కళ్ళాల్లో పంటను రక్షించుకునేందుకు అన్నదాతలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయశాఖ పలు సూచనలు చేసింది.



- వరి పంట కోతకు 10-15 రోజులన్న దశలో చేను పడిపోయి నీట మునిగితే, బూజు తెగుళ్ల వల్ల గింజ రంగుమారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వర్షాలు తగ్గిన వెంటనే లీటరు నీటికి 1.0 మిల్లీలీటరు ప్రోపికోనజోల్ (టిల్ట్/బంపర్/ప్రొపిగార్డ్) లేక 1.0 గ్రాములు, కార్బెండిజం (బావిస్టిన్/ధనుస్టిన్/బెన్‌ఫిల్/బెన్ గార్డ్) లేక 2.0 గ్రాములు కార్బెండిజం ప్లస్ మాంకోజెబ్(సాఫ్/సిక్సర్/కంపానియన్) చొప్పున కలిపి పిచికారి చేయాలని పేర్కొన్నారు.
- కోత దశలో, లేదా కోత కోసిన తర్వాత పనలు వర్షానికి తడిచినట్లయితే గింజ మొలకెత్తకుండా ఉండడానికి 5 శాతం ఉప్పు ద్రావణాన్ని (లీటరు నీటికి 50గ్రాములు కల్లు ఉప్పు) పనలపై పడే విధంగా పిచికారి చేయాలి.
- వర్షాలు తగ్గి ఎండరాగానే పనలను తిరగేసి ఎండబెట్టి నూర్చుకోవాలి. పొలంలో నీరు లేకపోయినట్లయితే మడిలోనే పనలనూ ఉప్పు నీరు చల్లుకోవచ్చని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.
- ఒక వేళ పొలంలో నీరు నిలిచి ఉన్నట్లయితే పనలను గట్లపైకి తెచ్చుకొని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవడం ద్వారా మొలకెత్తకుండా, రంగు మారకుండా నివారించవచ్చు.
- పనలు కుప్పవేసే దశలో తుఫాన్ లేదా అకాల వర్షాలతో పనలు తడిచినట్లయితే కుప్పలు వేసే సమయంలో ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్ప వేసుకోవడం వల్ల నష్టాన్ని నివారించుకోవచ్చని వ్యవసాయశాఖ సూచిస్తోంది. నూర్చిన ధాన్యం కళ్లాలపై ఉన్న సమయంలో అటువంటి ధాన్యాన్ని 2, 3 రోజులు ఎండబెట్టడానికి వీలు కాకపోతే కుప్పల్లో గింజ మొలకెత్తడమే కాక రంగు మారి చెడు వాసన వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో నష్టాన్ని నివారించడానికి ఒక క్వింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పును 20 కిలోల పొడి ఊక లేక 4 కిలోల వరి గడ్డితో కానీ కలిపి ధన్యం పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తి చెడిపోకుండా నివారించుకోవచ్చు.
- ఎండకాసిన తర్వాత ధాన్యాన్ని ఎండబోసి, తూర్పార బెట్టి నిల్వచేసుకోవాలి. ధాన్యం పూర్తిగా తడిచి రంగు మారిపోయినప్పుడు ఆ ధాన్యానికి మార్కెట్ పూర్తిగా తగ్గిపోతుంది. ఈ నేపథ్యంలో ధాన్యం పచ్చి బియ్యం కంటే ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవడం వల్ల నష్టాన్ని కొంత వరకు తగ్గించుకోవచ్చు.



మొక్కజొన్న రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కోతకు వచ్చిన మొక్క జొన్న పంటను అధిక వర్షాల నేపథ్యంలో వీలుచూసుకొని వెంటనే కోత చేపట్టాలి. తడిసిన కండెలను గచ్చుపై పలుచగా పేర్చి ఎండలో బాగా ఆరబెట్టాలి. సాధ్యమైనంత త్వరగా నూర్పిడి చేయాలి.
- కోత దశకు చేరువలో ఉన్న పంట నేలకు ఒరిగితే పొలంలోని నీటిని పిల్ల కాలువల ద్వారా బయటకు పంపించాలి. చేను పైన ప్రోపికొనజోల్ 1 మిల్లీలీటరు లేదా హెక్సాకొనజోల్ 2 మిల్లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- కల్లంపైన ఆరబెట్టిన మొక్కజొన్నను వీలైనంత వరకు నీటిలో తడవకుండా చూడాలి. తడి కండెల పైన టార్పాలిన్ కప్పకూడదు. గాలి బాగా తగిలే విధంగా నీడలో ఆరబెట్టుకోవాలి. అవసరాన్ని బట్టి కండెల పైన 5 శాతం మొత్తటి ఉప్పును పలుచగా చల్లి కిందామీదా బాగా కలపడం వల్ల మొలకరాకుండా నివారించవచ్చు.
- తడికండెలను కుప్పగా పోయకుండా గచ్చుపై పలుచగా పేర్చి బాగా ఆరబెట్టి సాధ్యమైనంత త్వరగా నూర్పిడి చేపట్టాలి.

యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టండి

- వెలిగొండ టన్నెల్‌లోని వరద నీటిని పరిశీలించిన మంత్రి సురేష్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల (ప్రకాశం జిల్లా)



మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి సురేష్

వెలిగొండ ప్రాజెక్టులోని టన్నెల్‌లోకి ప్రవేశించిన నీటిని యుద్ధ ప్రాతిపదికన తొలగించి వెంటనే రెండో టన్నెల్ తవ్వకం పనులు ప్రారంభించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండల పరిధిలోని కొత్తూరు వద్ద వెలిగొండ ప్రాజెక్టు సొరంగాల్లోకి చేరిన వరద నీటిని అధికారులతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. వరద నీరు వచ్చి చేరిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ వరుసగా నాలుగు రోజులు క్రితం నల్లమల అభయరణ్య ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల తీవ్రతకు వెలిగొండ హెడ్ రెగ్యులేటరీ పనులు జరుగుతున్న శ్రీశైలం ఎగువ ప్రాంతంలోని కొల్లంవాగు వద్ద వరద నీరు పోటెత్తిందని తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ ద్వారా మొదటి సొరంగంలోకి ప్రవేశించి కొత్తూరు వద్ద జరుగుతున్న సొరంగ నిర్మాణ ప్రాంతంలోకి భారీగా నీరు వచ్చి చేరిందన్నారు. దీంతో సొరంగ మార్గంలో విద్యుత్ ప్రసారం పూర్తిగా నిలిచిపోయిందని చెప్పారు. యుద్ధ ప్రాతిపదికన రెండు రోజుల్లో తిరిగి విద్యుత్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తిరిగి నాలుగు, ఐదు రోజుల్లోనే సొరంగం తవ్వకం పనులు ప్రారంభిస్తారని చెప్పారు. వెలుగొండ సొరంగం మార్గంలోకి వచ్చి చేరిన వరద నీటి విషయంపై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని తెలిపారు. తొందర్లోనే ఆయన కూడా వెలుగొండ ప్రాజెక్టు సొరంగ మార్గాన్ని పరిశీలిస్తారని చెప్పారు.

9వ తేదీన తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల

హైదరాబాద్ : ఈ నెల 9వ తేదీన (మంగళవారం) ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు విడుదలయ్యే అవకాశం ఉంది. మంగళవారం ఉదయం 11 గంటలకు నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డులో ఫలితాలను విడుదల చేయనున్నట్లు సమాచారం. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఎగ్జామ్స్ మార్చి 15వ తేదీ నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు నిర్వహించిన సంగతి తెలిసిందే. ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు ఐదు లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్ ఫలితాల కోసం ntnews.com, tsbie.cgg.gov.in అనే వెబ్‌సైట్లను లాగిన్ అవొచ్చు.

తెలంగాణకు భారీ వర్ష సూచన

- పలు ప్రాంతాల్లో పిడుగుపాటుకు అవకాశం

హైదరాబాద్ : తెలంగాణలో రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాలో ఈదురుగాలులలతో కూడిన ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది.ంది. అక్కడక్కడా పిడుగులు పడే ప్రమాదం ఉందని కూడా వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించింది.హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణ్ పేట్, సంగారెడ్డి, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. గంటకు 41 నుంచి గరిష్ఠంగా 61 కిలోమీటర్ల వేగంతో ఈదులు గాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది.

రాష్ట్రానికి జగన్ చీడ : టిడిపి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

పంటకు చీడ పట్టినట్టు రాష్ట్రానికి జగన్ చీడ పట్టుకుందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న విమర్శించారు. విశాఖలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో ఇబ్బందులు పడుతున్న రైతులను పట్టించుకోకుండా గత ప్రభుత్వంలో శంకుస్థాపనలు చేసిన వాటికి మళ్లీ శంకుస్థాపనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ ఓడిపోతే రాజకీయాల్లో తెరమరుగుకావడం తథ్యమన్నారు. విశాఖలో వైసిపి అక్రమాలను తాను నిరూపిస్తే రాజకీయాల నుంచి జగన్ తప్పుకుంటారా? అని సవాలు విసిరారు. ఈ నెల 16న పెందుర్తి, 17న ఎస్ కోట, 18న అనకాపల్లిల్లో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాలు జరుగుతాయని, వీటికి చంద్రబాబు హాజరవుతారని వెల్లడించారు.

అల్లూరికి భారత రత్న ప్రకటించాలి : పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వాతంత్ర్య సమరయోధుడు, మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజుకు భారతరత్న ప్రకటించి ఆ పురస్కారానికి మరింత వన్నె అద్దాలని, ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేటి తరం దేశ వాసులందరికీ అల్లూరి సంకల్పం, పోరాట పటిమ, ధీరత్వం మృత్యువుకు వెరవని ధైర్యం, జ్ఞాన ఆధ్మాత్మిక సంపద గురించి తెలియాలని పేర్కొన్నారు.

హిజాబ్ ముస్లింల హక్కు

- షరతులు లేకుండా దుల్హన్ అమలు
- ముస్లిములతో ముఖాముఖిలో నారా లోకేష్



ముస్లింలతో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న నారాలోకేష్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

హిజాబ్ ముస్లిముల హక్కు అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. అన్ని మతాల విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిందేనని తెలిపారు. యువగళం పాదయాత్రలో భాగంగా ఆదివారం కర్నూలులోని ఎస్‌టిబిసి కళాశాల మైదానంలో ముస్లింలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు లోకేష్ సమాధానం ఇచ్చారు. టిడిపి అధికారంలోకి రాగానే షరతులు లేకుండా దుల్హన్ పథకాన్ని అమలు చేస్తామని, దామాషా ప్రకారం రాజకీయాల్లో మైనార్టీలకు అవకాశం కల్పిస్తామని, మైనార్టీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి ఉప కులాల వారీగా ఖర్చు చేస్తామని హామీ ఇచ్చారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వక్ఫ్ బోర్డుకు జ్యుడీషియల్ అధికారాలు ఇస్తామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని తిరిగి అమలు చేస్తామని, జగన్ ప్రభుత్వం నిలిపివేసిన సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని తెలిపారు. డిఎస్‌సి ద్వారా ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని, షాదీ ఖానాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో మిస్బా ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షిస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నంద్యాలలో కుటుంబంతో సహా ఆత్మహత్యకు పాల్పడిన అబ్దుల్ సలాం కుటుంబ సభ్యులు, గురజాల నియోజకవర్గం పిన్నెల్లిలో ఊరి నుంచి వెలివేసిన ముస్లిం మైనార్టీ బాధితులు లోకేష్‌కు తమ సమస్యలను వివరించారు. అబ్దుల్ సలాం ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షిస్తామని లోకేష్ తెలిపారు. పిన్నెల్లిలో ముస్లిములను ఇబ్బంది పెట్టిన అధికారులపై జ్యుడీషియల్ విచారణ చేపట్టి సస్పెండ్ చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మైనార్టీలకు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్రలో మాజీ మంత్రులు ఎన్ఎండి ఫరూక్, భూమా అఖిలప్రియ, దేవినేని ఉమా, అమర్నాథ్‌రెడ్డి, మండలి మాజీ చైర్మన్ షరీఫ్, టిడిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ టిజి.భరత్, నంద్యాల ఇన్‌ఛార్జి భూమా బ్రహ్మానందరెడ్డి, శ్రీశైలం ఇన్‌ఛార్జి బుడ్డా రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై ఉధృత ఉద్యమం

- ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగుల సమస్యలపై మూడో దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. శ్రీకాకుళంలోని రెవెన్యూ అతిథి గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులపై అక్రమంగా బనాయించిన కేసులు, సస్పెన్షన్లను వెంటనే ఎత్తివేయాలని, వేధింపులు విడనాడాలని, వారి సమస్యలను పరిష్కరించాలని మూడో దశ ఉద్యమంలో భాగంగా ఈ నెల ఎనిమిదో తేదీన కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేస్తామని, తొమ్మిదిన జిల్లాలో ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తామని చెప్పారు. 12 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎంపిలకు 'ఉద్యోగుల ఆవేదనను చెబుదాం' కార్యక్రమంలో భాగంగా వినతిపత్రాలు అందజేస్తామన్నారు. 17న అనంతపురంలో, 27న ఏలూరులో, జూన్ ఎనిమిదో తేదీన గుంటూరులో ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తామని, 30వ తేదీన జిల్లా కేంద్రాల్లో ఒకరోజు సామూహిక నిరాహార దీక్ష చేపడతామని వివరించారు. ప్రభుత్వం ఒక్కో ఉద్యోగికి రూ.1.50 లక్షల నుంచి రూ.నాలుగు లక్షల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు సిపిఎస్ రద్దు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ వంటి అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉండడంతో ఉద్యోగులు సతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకు పోరాటం సాగుతుందని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు



అల్లూరి సమాధి వద్ద నివాళ్లర్పిస్తున్న ఆర్‌డిఒ జయరాం

అల్లూరి సమాధి వద్ద ఘన నివాళి

ప్రజాశక్తి - సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా), గొలుగొండ (అనకాపల్లి జిల్లా)

అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా అనకాపల్లి జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాలో ఆదివారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలంలోని ఎఎల్ పురం అల్లూరి పార్కులో ఉన్న అల్లూరి సమాధి వద్ద నర్సీపట్నం ఆర్‌డిఒ హెచ్‌వి జయరాం ఘన నివాళ్లర్పించారు. ముందుగా పార్కులో ఉన్న అల్లూరి కాంస్య విగ్రహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని కోరారు. చిన్న వయసులోనే బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన అల్లూరి అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. గిరిజన ప్రజల కోసం ఆయన చేసిన పోరాటాలు, గెరిల్లా యుద్ధాలు ప్రఖ్యాతిగాంచాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ జి ఆనందరావు, వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు లోచల సుజాత, కెడి పేట ఎస్‌ఐ ఉపేంద్ర, స్థానిక ఎంపిటిసి చింతల బుల్లిప్రసాద్, విఆర్‌ఒ శ్రీధర్ పాల్గొన్నారు.

రూ.35 కోట్లతో అల్లూరి స్మృతి వనం అభివృద్ధి : డిప్యూటీ సిఎం

. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం డిప్యూటీ సిఎం రాజన్నదొర నివాసంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కెడి పేటలో రూ.35 కోట్లతో అల్లూరి స్మృతి వనం అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. తెల్లదొరలను గడగడలాడించిన అల్లూరి సీతారామరాజు గొప్ప పోరాట యోధుడని కొనియాడారు. తాను గిరిజన శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గతేడాది అల్లూరి జయంతి సందర్భంగా కెడి పేట గ్రామాన్ని సందర్శించినట్లు చెప్పారు. అల్లూరి స్మృతి వనంలో నలుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించినట్లు తెలిపారు. విశాఖ నగర పరిధిలోని రుషికొండలోనూ రూ.20 కోట్లతో అల్లూరి సీతారామరాజు స్మృతి వనం నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు, మాజీ కౌన్సిలర్ కొల్లి వెంకటరమణ పాల్గొన్నారు.



దెబ్బతిన్న కాకర పంటను పరిశీలిస్తున్న అధికారులు

ప్రతి రైతును ఆదుకుంటాం

- రాష్ట్ర ఉద్యాన శాఖ కమిషనర్ ఎస్ఎస్. శ్రీధర్

ప్రజాశక్తి - బుక్కరాయసముద్రం (అనంతపురం)

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు, ఈదురుగాలులకు నష్టపోయిన వ్యవసాయ, ఉద్యాన పంటల రైతులను ఆదుకుంటామని రాష్ట్ర ఉద్యాన శాఖ కమిషనర్ ఎస్ఎస్.శ్రీధర్ తెలిపారు. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం గ్రామంలో వర్షాలకు నష్టపోయిన పంట పొలాలను ఆదివారం ఆయన పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు. పంటసాగు, పెట్టుబడి, పంట కోత వివరాలు అడిగి తెలుసుకున్నారు. అప్పులు చేసి కాకర పంట సాగుచేశానని, వర్షాలకు దెబ్బతినడంతో తీవ్రంగా నష్టపోయానని గ్రామానికి చెందిన రైతు జనార్ధన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ తీగజాతి పంటలను రాళ్లపందిరి ద్వారా సాగు చేస్తే ఇలాంటి అకాల వర్షాలకు నష్టం వాటిల్లకుండా ఉంటుందని సూచించారు. రైతులు అధైర్యపడొద్దని, నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని తెలిపారు. మరో రైతు రాజశేఖర్ సాగు చేస్తున్న కొత్తరకం విఎన్ఆర్ జామ తోటను ఆయన పరిశీలించి మార్కెటింగ్‌కి అనుకూలమైన విషయాలు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ మండల అధికారి శైలజ మండలంలోని సాగుచేసిన పంట వివరాలను కమిషనర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పెషల్ ఇన్‌ఛార్జ్, గుంటూరు కార్యాలయ డిడిహెచ్ ధర్మజ, జిల్లా ఉద్యాన శాఖ ఇన్‌ఛార్జి నరసింహారావు, ఎపిఎంఐపి పిడి ఫిరోజ్, సత్యసాయి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు,

రాష్ట్ర ప్రజల శ్రేయస్సుకే యాగం

మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసమే అష్టోత్తర శత కుండాత్మక చండీ రుద్ర రాజ శ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం నిర్వహిస్తున్నామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో మహా యజ్ఞానికి సంబంధించిన పతాకావిష్కరణ ఆదివారం నిర్వహించారు. ఆగమ సలహా మండలి, పండితుల సలహాల మేరకు యాగాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. నాలుగు ప్రధానమైన యాగశాలలు నిర్మాణం చేస్తున్నామని, ఈ నెల 12న ఉదయం 5గంటలకు యాగం ప్రారంభమవుతుందన్నారు. యజ్ఞ ప్రారంభ కార్యక్రమం లోనూ, పూర్ణాహుతి కార్యక్రమంలోనూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారని మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు.



అక్షరం
చిగురిస్తే శబ్దమౌతుంది..
తీగ సాగితే వాక్యమౌతుంది
పందిరంత విస్తరిస్తే గ్రంథమౌతుంది
సమస్త వాఙ్మయ సృష్టికి బీజరూపం అక్షరమే!
-డా సి నారాయణ రెడ్డి



చీకటి

క్రమక్రమంగా ఆక్రమిస్తోంది చీకటి
ఒక పథకం ప్రకారమే బయల్దేరిన చీకటి
దేశమంతా విస్తరిస్తోంది!
మన అస్తిత్వాల మీద
చారిత్రక మూలాల మీద
నల్ల మబ్బుల్లా కమ్ముకుంటోంది
చీకటిని చింతిస్తూ కూర్చుంటే
దీపం వెలగదని తెలిసే
పద్దెనిమిది వందల మంది యోధులు
నిరసన పత్రాలను వెలుగు బాణాలుగా
సంధించి వదిలారు
అయినా ఉప్పొంగిన కెరటాల్లా
దూసుకొస్తున్న చీకటి
మన జ్ఞాననేత్రాలను పెకలించి
అజ్ఞానంలోకి విసిరేసే పెనుచీకటి
దేశమంతా చీకట్లో తచ్చాడే రోజు
ఎంతో దూరంలో లేదనిపిస్తోంది

చారిత్రక సత్య పాఠాలను వదిలేసి
సరికొత్తగా చీకటి పాఠాలను వల్లె వేసే
అంధ ప్రపంచమొకటి పొడుచుకొస్తోంది
ఈ చీకటిని ఛేదించాలంటే
పద్దెనిమిది మంది యోధులతోపాటు
ప్రతి పౌరుడూ ఒక కాంతి ఖడ్గం కావాల్సిందే
చీకటిని కడిగేసే వెలుగు కాగడాలు ధరించి
నింగీ నేలంతా కదం తొక్కాల్సిందే
దేశం దారితప్పి చీకట్లో కలవకముందే
కళ్లు తెరిచి కాంతికిరణాలమవ్వాల్సిందే!

– చిత్తలూరి



మాట మంచిదే .. కానీ..?

ఆ మాట మంచిదే
ఆత్మహత్యలాపితే
దెబ్బ తిన్న కుర్రకారు
ఎమోషన్లలో మోషన్
ఆపితే కౌన్సెలింగ్ ఒకె
ఒక ప్రాణం మిగిలినట్టే
ఒక దీపం నిలిపినట్టే!


ఆత్మహత్యలన్నింటికీ
కౌన్సిలింగే హెూల్డింగా?
అయితే ఏ కౌన్సిలింగుతో
ఆకలి చావును ఆపగలవు
ఇంకెలాంటి కౌన్సెలింగుతో
బ్యాంకు అప్పు వసూళ్ళకు
వీధిన పడేసిన రైతు పరువు
ఆత్మహత్య నాపగ ఓదార్చగలవు
కడుపు నిండని చెమట జీవులు
పనుల కోసం పరాయి ఊళ్ళకెళ్ళి
బతక (బతుకు) లేక ఉరి దారి పడితే
ఏ కౌన్సెలింగుతో దారి చూపగలవు?

కోట్లు మింగి ఎగ్గొట్టిన కార్పొరేటుకు
విదేశీ పరుగు వీసాల కౌన్సెలింగా
కష్టంతో జాతి ఆకలాపే శ్రములకు
వీధివసూళ్ళ ఉరితాళ్ళ ఊరేగింపా?

మాట మంచిదే కదా అంటూ
అన్నింటికీ అదే మం(చి)దనడం
పాలక విధాన హత్యలు దాచేసి
ఆత్మహత్యను బూచీ చేయడమేగా!

('ఆత్మహత్యల నిరోధంలో మీడియాదే కీలక పాత్ర' అని ఓ అధికారి ఉపదేశం చదివాక)

– ఉన్నం వెంకటేశ్వర్లు
8790068814



ప్యాసింజర్ ఆటో

అణగారిన వర్గాల ఐరావతం
బతుకు పోరుకు తోటి బాటసారి
అంటూ ముట్టూ తెలియని ఆదర్శవాది
సమానత్వం పాటించే సామ్యవాది
పల్లె జీవుల పవిత్ర బతుకు సారథి

నలుగురైదుగురు కెపాసిటైనా
పద్దైదు మందిని పట్టక కుక్కినా
కిక్కురుమనకుండా నక్కినట్టుంటది
ఎక్కితే ఇంకొక్కరికి చోటుందంటది
బతుకు జీవుడా అంటూ
బాధపడక ముందుకు సాగుతుంటది
ఆపద వస్తే అంబులెన్స్ అవుతది
గతుకుల రోడ్డుపై ఉక్కు గుర్రమైతది
పట్టని నడుమును పట్టిస్తది
పట్టిన నడుమును విడిపిస్తది
పంట పొలమోనికి నేస్తమైతది
పండిన పంటకు అంగడైతది
అలసిన దేహాలకు ఆసరైతది
అమాసపున్నానికి అలిగి ఆగిపోతుంది
ఆయిల్ గ్రీస్ పెడితే లేసి పరుగు తీస్తది

అతుకుల బతుకుకు ఆదేరవైతది
ఆదరించిన యజమానికి
ఆస్తులు కూడబెట్టకున్నా?
ఆకలి తీర్చే అన్నమైతది!

– డా.ఎడ్ల కల్లేశ్, 98667 65126

గేయ కవితా ప్రస్థాన బాటసారి 'పాటసారులు'

మహాకవి గురజాడ అప్పారావు గేయ కవిత్వాన్ని ప్రచారంలోకి తీసుకుని వచ్చిన తరువాత కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ వంటి వారు గేయ కవిత్వానికి విశేషమైన ప్రాచుర్యాన్ని కల్పించారు. గేయ కవిత ప్రారంభంలో భావ కవిత్వంగా కొంతవరకు పరిఢవిల్లినా, క్రమంగా అభ్యుదయ కవిత్వంగా రూపుదిద్దుకుంది. తెలంగాణా విమోచనోద్యమంలో గేయం నిర్వహించిన పాత్ర అమోఘమైనది. తరువాతి కాలంలో విప్లవ కవిత్వంగానూ మారుమ్రోగింది. పదం, గేయం, పాట సమానార్థకాలు. గురజాడ తరువాత ఒక అర్ధ శతాబ్దం పాటు గేయ కవిత నిరంతరాయంగా సాగింది. తదుపరి వచన కవిత్వం బలపడి గేయ కవిత్వం వెనుకబడిపోయింది. ఏదైనా ఒక భావాన్ని లయబద్ధంగా చెప్పినప్పుడే అది మనసుకు నాటుకుంటుంది. వచనానికి ఆ శక్తి లేదు. పాటకు శబ్దించే గుణం ఉన్నందువల్ల పాడిన వాళ్లనే కాదు, విన్నవాళ్లను కూడా ప్రభావితం చేయగలదు. పాట కంటే గొప్ప వినోద సాధనం, ప్రచార సాధనం మరొకటి లేదు. ఈ అవసరాన్ని గుర్తించి 'గేయం ఐపోతుంది మాయం/ ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే/ తెలుగు కవిత్వం తన జవ సత్వాలను/ కోల్పోవడం ఖాయం' అంటూ ఉత్తరాంధ్రకు చెందిన ప్రముఖ అభ్యుదయ కవి సీరపాణి 'గేయ కవితా ప్రస్థానం' పేరుతో 2017 నవంబర్ 26వ తేదీన ఒక గేయ కవిత ఉద్యమాన్ని విజయనగరంలో ప్రారంభించారు. గేయ రచనా సామర్థ్యం ఉన్న కవులను ప్రోత్సహించడానికి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న కవుల నుంచి రచనలను ఆహ్వానించారు. 100 మందికి పైగా కవుల గేయ కవితలను 'పాటసారులు' పేరుతో ఒక సంకలనంగా ప్రచురించారు. రచయితలు తమకు నచ్చిన విషయం మీద రాసి వీలు కల్పించారు.

'అమ్మ' అనే గేయంలో రాయవరపు సరస్వతి 'అమ్మే ఇలలో దైవం/ అమ్మే జగతికి మూలం/ చందమామ చూపించి/ గోరుముద్ద తినిపించి/ తొలి మాటను పలికించి/ తొలి అడుగ వేయించె' అని సృష్టిలో మాతృమూర్తి ఔన్నత్యాన్ని ఉగ్గడిస్తారు. 'అమ్మా చల్లనినిమ్మా' గేయంలో డా: పి.బాబురావు 'అమ్మ హస్తమే అమృతం పంచు/ అమ్మ హస్తమే ఆశీర్వదించు/ అమ్మ కమ్మని తేనెల మనసు/ అమ్మ నిమ్మల నీడని తెలుసు' అని అమ్మ చేతి చలువ విలువలను వర్ణిస్తారు.


మహిళల పట్ల జరుగుతున్న అత్యాచారాలను నిరసిస్తూ కొంతమంది కవులు గేయాలను రాశారు. 'భారతీయుడ ఓయి యువకుడ' గేయ కవితలో బుడితి రామినాయుడి 'ఆడవాళ్లను ఏడిపిస్తే/ అల్లుడౌదువు అసురుడౌదువు/ అమ్మ అక్క చెల్లి కూడా/ ఆడవాళ్ళని మరచిపోకోయ్' అంటూ ఆకతాయిలను హెచ్చరిస్తారు. 'భూమి కరుసు' గేయ కవితలో సంకిస భరద్వాజ శంకర్ 'సదువుకోను బడికి పోతె/ కోతి మూక సదువ నీదు/ సదువుకోని పనికి పోతె/ కొంటె చూపు బతక నీదు/ ఆలి కరుసు అమ్మ కరుసు/ అక్క కరుసు సెల్లి కరుసు/ భూమి కరుసు బువ్వ కరుసు/ కరుసై పోనాది వదినమ్మ' అని పీడిత స్త్రీల దుస్థితిని చెబుతారు.

'జరభద్రం'లో పుచ్చకాయల బ్రహ్మాజీ 'జనులున్న అడవిలో జరభద్రమో/ పులులున్న అడివైన పలుతీరు నయమమ్మ/ ఏ మనిషి గుండెలో ఏ మృగము దాగెనో/ ఏ పలువ మనసులో ఏ పాములాడునో/ ఆచితూచి నీవు అడుగు వేయావమ్మా/ ఆదమరచి ఉంటే ఆపదలు దాపించు' అని ఆడపడుచులకు పలు జాగ్రత్తలు సూచిస్తున్నారు.

ఈ సంకలనంలో తెలుగు భాష యొక్క ప్రాశస్త్యానికి పరవశిస్తూ గానం చేసిన కవి కోకిలలూ ఉన్నారు. 'ఎంత సక్కని భాష మన భాష/ ఎంత కమ్మని భాష మన భాష/ సెలయేటి గలగలలు కిలకిలరావాలు/ సొగసైన నుడికార మందార హల్లులు/ తేనెలొలికే భాష తియ్యనైనా భాష/ ఓ అమ్మ ఓ అయ్య ఓ అక్క ఓ సెల్లి' అంటూ సిహెచ్.వి లక్ష్మి తెలుగు భాషా సౌందర్యాన్ని కళ్ళముందు పెడతారు. 'జీవనాడి నా తెలుగు' అనే ఖండికలో శ్రీ లక్ష్మీ చివుకుల ఇలా అంటారు : 'అమ్మ పాడిన పాటలా కమ్మనైనది తెలుగురా/ ఉగ్గు పట్టి లాలపోసి ఊయలూపిన జోలలా/ వాన వాన వల్లప్పా అని కురిసిన చిరుజల్లులా/ మట్టి వాసన సుగంధం పులకించినట్టి అవనిలా' ఈ గేయం మెండైన అచ్చ తెలుగు పదాలతో నిండుగా సాగింది.

కొందరు కవులు దేశభక్తిని ప్రబోధించే గేయాలు రాశారు. 'జెండా వందనమంటూ' అనే గేయంలో సబ్బని లక్ష్మీనారాయణ 'జెండా వందనమంటూ సాగి ముందుకడుగేద్దాం/ సత్యమేవ జయతే అంటూ చాటి చెప్పి నడుద్దాం' అని స్వతంత్ర సమర వీరుల త్యాగాలు కొనియాడుతూ ఈ గేయాన్ని రాశారు.

ఈ సంకలనంలో ప్రకృతి సౌందర్యానికి సంబంధించిన గీతాలు కూడా ఉన్నాయి. 'ఋతుగీతం' గేయంలో అభిలాష అనే కవి 'వసంత రుతువు వచ్చింది/ చెట్లకు చిగురు తొడిగింది/



సమీక్ష

ఉగాది పండుగ వచ్చింది/ రుతువుల రాణి అయింది' ఆరు రుతువుల్నీ సరళమైన గేయ పాదాల్లో వర్ణించారు. ఎస్.లక్ష్మీనాధాచార్యులు 'అందాలు' గేయంలో 'వినువీధికి చుక్కలె అందం/ వనరాణికి మొక్కలె అందం/ కడలి రాజుకు అలలె అందం/ హిమగిరికి శిఖరాలె అందం' అంటూ అందం యొక్క పరమార్థాన్ని సృష్టిలోని అనేక అంశాలకు ఆరోపించి చెప్పారు.

'వినరయ్యా వినరమ్మా' అనే గేయంలో డా.ఎం. లక్ష్మణాచార్యులు 'పచ్చదనం లేకుంటే నరకం నరకం/ పచ్చదనం ఆనందం పచ్చదనం ఆరోగ్యం/ పచ్చదనం సౌభాగ్యం పచ్చదనం జీవనం' అంటూ వృక్షాల అవసరాన్ని ప్రబోధాత్మకంగా వివరించారు. 'యువగీతం' గేయంలో రామతీర్థ 'పాటంటే శివమెత్తిన నయాగరా/ పాటంటే శివుడు సీమ నగారా/ గొంతెత్తి పాడరా గాయకుడా/ ప్రగతి గీతం ప్రజల కోసం/ ప్రజల గీతం ప్రగతి కోసం' అని ఎలుగెత్తి చాటారు. 'నినదించు' గేయ కవితలో గార రంగనాథం 'చెమటను తడిసిన మట్టి బెడ్డపై/ విత్తనమై మొలకెత్తుతావు/ రూపాయి నోటుపై రూపెత్తి నీవు/ చదువూ సంధ్యా భక్తీ ముక్తీ/ రూకకు దొరికే అంగడి సరుకులు/ ఓటుకు నోటు నోటుకు ఓటు/ ధనం మూలమీ జగత్తు' అంటూ జాతిని జాగృతం చేస్తున్నారు. గంటా రామకృష్ణ రైతన్న వలస బాట, బి.గోవర్ధన్‌రావు 'పల్లె పిలిచింది' గేయ కవితలు పల్లెల ప్రాధాన్యాన్ని చెబుతున్నాయి.

'శైశవ వేదన'లో 'కన్న కలలు కరిగిపోయె/ కార్పొరేటు చదువులతో/ బాల్యమే లేని బతుకు/ బండగాను మారిపోయె' అంటూ చెళ్లపిళ్ల శ్యామల ఈనాటి విద్యార్థులు తమ బాల్యంలోని కమ్మని అనుభూతులను ఎలా కోల్పోతున్నారో వివరించారు. 'వారసుడా' అనే కవితలో జక్కు రామకృష్ణ 'సైరికుడవురా నీవు/ నీ పైరు గీతములే/ సూర్యునికి మేలుకొలుపు/ నీ కోటేరు వాలకం/ సాయంకాల సూచన' అంటూ రైతు దైనందిన జీవితాన్ని హృద్యంగా చూపుతారు. 'హంసగీతి' అనే గేయంలో అలపర్తి వెంకట సుబ్బారావు 'పండు ముసలినౌతున్నా/ తిండి తిప్పలెన్నున్నా/ గుండె రాయి చేసుకుని/ మొండిగా జీవిస్తున్నా' అని ఈనాడు చాలామంది వృద్ధులు ఎలాంటి దుర్భర జీవనాన్ని గడుపుతున్నారో తెలియజేస్తుంది. 'నువు తిరగబడ్డ పులిబిడ్డగా ఇకపై మారాలి/ నీ శరీరాన్ని ఉక్కు ముక్కగా చేసుకోవాలి/ అపరంజిల్లా నిన్నే నువ్వు సాన పెట్టుకోవాలి/ లింగ వివక్షకు తిరుగుబాటు జెండా ఎగురవేయాలి' అని మహిళా లోకాన్ని మేల్కొలుపుతారు పాతూరి అన్నపూర్ణ.

ఈ సంకలనంలో గేయాలతో పాటు పాట, వచన కవితలను కూడా ప్రచురించారు. మొదట ప్రయత్నమైనందువల్ల ఇలా జరిగుండొచ్చు. మాత్రాఛందస్సు సృష్టికర్త గురజాడ. ఈ గేయ కవితా సంకలనాన్ని ఆధునిక గేయ కవిత్వానికి ఆద్యుడైన మహాకవికి అంకితమివ్వడం ఔచిత్యవంతంగా ఉంది. ఇంతటి గొప్ప ప్రయత్నానికి 2021లో సంపాదకులు దరఖాస్తు చేయగా, రాష్ట్ర పౌర గ్రంథాలయ సంస్థ నుంచి సైటేషన్ నెంబర్ దొరకకపోవడం శోచనీయం. అంతరించిపోతున్న గేయ కవిత్వాన్ని పునరుద్ధరించడానికి చేసిన ప్రయత్నానికి ఇదేనా చేయూత? ప్రతులకు: సంపాదకులు, సీరపాణిని 87902 32565లో సంప్రదించొచ్చు.

– పిల్లా తిరుపతిరావు, 70951 84846


రైతుల, నేతన్నల పక్షపాతి తేళ్ళ సత్యవతి



జన్మత అన్నదాతల కుటుంబం అయినా సాధనతో ఉపన్యాసక వృత్తి చేపట్టి ఎందరో విద్యార్థులకు విజ్ఞాన బీజాలు నాటిన కృషీవలురాలు ఆచార్య తేళ్ళ సత్యవతి. ఉపన్యాసకత్వానికే పరిమితం కాకుండా విద్యార్థుల పరిశోధనలో చేయూతనిచ్చిన మార్గదర్శి. అనేక పరిశోధన వ్యాసాలను ప్రామాణికంగా అందించిన పండితమణి, ఎంత ఎదిగినా ఆధార మూలాలను మరవరాదనే 'వృక్ష సూత్రాన్ని' అక్షరాలా పాటించిన ఆదర్శమూర్తి ఆమె. గుంటూరు జిల్లా పాలపర్రులో 'తేళ్ళ సూర్యనారాయణ, మనోహరి దంపతులకు 10 మే 1951న జన్మించారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి తెలుగులో మాస్టర్ డిగ్రీ పొంది 'తెలుగువారి ఇంటి పేర్లు' అంశం మీద నాగార్జున విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసి డాక్టరేటు పొందారు, అనంతరం ఉపన్యాసక వృత్తి చేపట్టి నాగార్జున విశ్వవిద్యాలయంలోనే ఆచార్యురాలుగా ఉద్యోగ విరమణ చేశారు.

మూలాలు వీడని ఈ విద్వత్ మణి సాహితీ ప్రస్థానంలో అవిశ్రాంతంగా చేసిన కృషిలో భాగంగా ఆధునిక తెలుగు సాహిత్యంలో కర్షక జీవనంతో పాటు, 'రైతన్నల నేతన్నల ఆత్మహత్యలు – వచన కవిత్వంలో ప్రతిఫలనాలు' అనే పరిశోధనాత్మక వ్యాసాలతో ఒక విలువైన గ్రంథాన్ని అందించారు.



సందర్భం

ప్రతి మనిషికి అత్యంత ముఖ్యమైనవి కూడూ గుడ్డా. ఆ రెండిటిని అందించే రైతన్న నేతన్నల జీవితాలు మాత్రం కడు దుఃఖపూరితంగా మారడం.. ఆధునిక సమాజాన్ని పట్టిపీడిస్తున్న దుర్మార్గాల్లో ఒకటి. రైతుల, నేత కార్మికుల ఆత్మహత్యలు, వీరి బలవన్మరణాలకు కారణం పేదరికం మాత్రమే కాదని చారిత్రక ఆధారాలతో ప్రామాణికంగా రచయిత్రి సత్యవతి దీనిలో నిరూపించారు. పూర్వ, ఉత్తర రంగాలుగా విభజించుకున్న ఈ పుస్తకంలో పూర్వ రంగమంతా రైతు నేపథ్యం, ప్రపంచీకరణ ప్రభావం, ఆధునిక వ్యవసాయ రంగంలో రైతుల దుస్థితి, రైతుల ఆత్మహత్యలకు కారణాలు, ప్రభుత్వం పాత్ర, కవుల స్పందనలు, శాస్త్ర విజ్ఞాన ఆవశ్యకతతో పాటు చివరగా అత్యంత అవసరమైన అంశం, రైతుల ఆత్మహత్యలు నివారణ పరిష్కార మార్గాల గురించి చక్కటి విశ్లేషణ చేశారు.

ఉత్తర రంగంలో వస్త్ర నేపథ్యం చెబుతూనే మన తెలుగు పద్య కావ్యాల్లో చేనేతల దుస్థితి, చేనేత కథా పర్వం, చేనేత గుండె కోత, వచన కవిత్వంలో ప్రతిభవించిన నేతన్నల ఆత్మహత్యలు చేనేత రంగం, ఉత్పత్తి వ్యవస్థ, ప్రభుత్వ చర్యలతో పాటు నేతన్నల ఆత్మహత్యలకు పరిష్కారాలు, సూచనలు, సహేతుకంగా తెలపడంలో రచయిత్రిలోని సూక్ష్మ పరిశీలనా గుణం సహేతుక దృష్టి కోణం స్పష్టం అవుతున్నాయి.

చారిత్రిక అంశాలను సైతం సాహిత్య దృష్టితో వెలువరించడం రచయిత్రిలోని సృజనాత్మక భావనకు నిలువుటద్దం, 'వ్యవసాయం చేనేత బంధం'తో ప్రారంభమైన ఈ ప్రామాణిక వ్యాస ప్రస్థానంలో దేశానికి వ్యవసాయ – చేనేత రంగాలు రెండిటినీ రెండు చక్రాలుగా అభివర్ణించారు. గ్రామీణ ప్రాంతాల వికాసంలో కీలక పాత్ర పోషించిన ఈ రెండు రంగాలు కులమతాలకు అతీతంగా జీవనోపాధి కల్పిస్తున్నాయని వెల్లడించారు. వ్యవసాయ, చేనేత రంగాల్లో ప్రపంచీకరణ వల్ల వాటిల్లిన కష్ట నష్టాలను కూలంకషంగా వివరించారు. ఇది క్షేత్ర పర్యటనల, అభిప్రాయాల సమ్మేళన, సమహారంగా సాగించిన అక్షర మథనం. ప్రాచీన సాహిత్యంలో రైతుల ప్రస్తావనలు రైతు ఉద్యమాలు, కథలు, నవలలు, పద్య కావ్యాలు, దీర్ఘ కవితలు, వచన కవితల ఆధారంగా రైతుల జీవన ఔన్నత్యాన్ని అగచాట్లను ఆవిష్కరించారు.

పూర్వం కరువు కాటకాలు తాండవించినా... ఆకలి చావులు ఉన్నాయి తప్ప ఆత్మహత్యలు లేవు. సాంప్రదాయ పంటల స్థానంలో వాణిజ్య పంటలు రావడం, కల్తీ విత్తనాలు మందుల వల్ల వాణిజ్య మోసాలకు నష్టపోయిన ఆధునిక రైతు ఆర్థిక ఇబ్బందులకు లోనై నిస్సహాయ స్థితిలో బలవన్మరణం చెందుతున్నారని నిర్ధారించారు రచయిత్రి. రైతు మరణాలకు నీరు, విద్యుత్, విత్తనాలు, సెజ్‌లు ఎలా కారణమవుతున్నాయో ఆధునిక కవుల కవిత్వాల సాయంగా ఆవిష్కరించారు. వ్యవసాయ రంగంతో పాటు చేనేత రంగం గురించిన చారిత్రక విషయాలు చెబుతూ .. శ్రీకృష్ణదేవరాయల కాలంలో మన చేనేత వైభవం ఎలా ఉందో చెబుతూనే ఇంగ్లాండ్‌లోని పారిశ్రామిక విప్లవం వల్ల ఉత్పత్తి సాధనాల అభివృద్ధి తద్వారా వస్త్ర పరిశ్రమలో చోటు చేసుకున్న వేగం గురించి కూడా వివరించారు.

చేనేత రంగం పట్ల ప్రముఖుల అభిప్రాయాలు ఉదాహరిస్తూ... ఈస్టిండియా కంపెనీ అక్రమ విధానాలు, పాశ్చాత్యుల నిర్బంధ శాసనాల కారణంగా చేనేత పరిశ్రమ క్షీణించిన వైనం, ఆంధ్రలో జరిగిన చేనేత ఉద్యమాలు, సత్యాగ్రహాలు, జాతీయ ఉద్యమంతో సమానంగా సాగిన మద్రాసు చేనేత సత్యాగ్రహం గురించి కూడా ఉదహరించారు. 'చేనేత పరిశ్రమ' అనే ఖండకావ్యం చీరాలకు చెందిన కవులు 1946లో ప్రచురించగా, 1955లో కార్యంపూడి నాగభూషణం 'చేనేత' ఖండ కావ్యం ప్రచురించారు. కవి రాధేయ రాసిన 'మగ్గం బతుకు' దీర్ఘ కవితలో... చేనేత బతుకుల విషాదాలకు కారణాలను కవి మాటల ద్వారానే చెప్పారు. 'పల్లవి ప్రపంచీకరణది/ చరణం సామ్రాజ్యవాదానిది/ పాపం పాలన యంత్రాంగానిది....', 'నా జాతి జీవనానిదా/ నేతతో రూపు దాల్చిన/ ఈ జాతీయ జెండాదా?' అంటారు. ఇలా ఎందరో తెలుగు కవులు రైతన్న నేతన్నల స్థితిగతుల గురించి తమ రచనల ద్వారా స్పందించిన తీరును స్ఫూర్తివంతంగా ఒడిసి పట్టి ఆవిష్కరించారు ఈ రచయిత్రి.

పరిస్థితులకు కారణాలు చెప్పి ఊరుకోకుండా రెండు రంగాల్లో నెలకొని ఉన్న సంక్షోభాలు సమసిపోవడానికి అనేక సూచనలు చేశారు. వాటిని ఆచరించాల్సిన బాధ్యత పాలకులది. రైతులు, నేతకారులు అభివృద్ధి దిశగా ఎదగాలన్న ఆశయంతో కడదాకా జీవించిన ఈ పరిశోధక రచయిత్రి 2020 సెప్టెంబర్‌లో 16న గుంటూరులో కన్ను మూశారు. ఆమె ఆశయం సదా చిరంజీవి. తన జీవన లక్ష్యం నెరవేర్చడమే ఆమెకు నిజమైన నివాళి.

(మే 10 : ఆచార్య తేళ్ళ సత్యవతి జయంతి)

– డాక్టర్ అమ్మిన శ్రీనివాసరాజు, 77298 83223

భరతమాత సిగ్గు పడుతోంది



ఆత్మగౌరవాన్ని
ఆత్మాభిమానాన్ని
నిస్సిగ్గుతో పక్కకు నెట్టి
కామాంధుడి కోర్కెలు
గుర్రమెక్కితే ...
నా పతకాలకి తొడిగే కనకం
శునక చేష్ట బుద్ధులకు
అట్టుడికి
పాప పంకిలంతో
మలినమైపోతుంది
ఒకప్పుడు విజయగర్వంతో ఉప్పొంగిన
ఈ జాతి జాతీయ పతాకం
నిజంగా సిగ్గుపడి తలదించుకోదా?

మల్ల యుద్ధంలో
ప్రపంచాన్ని ఓడించి
విశ్వవిజేతగా నిలిపినపుడు
ఈ మువ్వన్నెల జెండా
రెపరెపలాడుతుంటే
మమ్మల్ని యోధానుయోధురాలిగా
కీర్తించిన వాణ్ణి ఒక్కసారి ఈడ్చుకురండి
గౌరవానికి గౌను తొడిగి మరీ
ఈ క్రీడా పుత్రికను విజయ పతాకంతో
వినువీధుల్లో ఊరేగించారు
టపాసులు కాల్చి మరీ
స్వాగత సత్కారాలూ
సన్మానాలూ
సంబరాలూ చేసినవాళ్ళని
ఒక్కసారి మా ముందుకి
తీసుకురండి

ఒంటి చేతులతో
బంగారు పతకాన్ని తెచ్చి
భరతమాత మెడలో అలంకరించిన
ఈ పోరాట మల్ల యోధినులు
భరతగడ్డపై పుట్టిన మట్టిలో
మాణిక్యాలు

కటిక నేలపై కఠోర దీక్ష చేస్తున్న చోటే
వాణ్ణి ఒక దోషిగా నిలబెట్టండి
లేదంటే ఒకప్పుడు
సగర్వంతో తలెత్తిన చోటే
ఇప్పుడు గర్వభంగమై
ఈ లోకం సిగ్గు పడుతుంది!


– రెడ్డి శంకరరావు
94943 33511

పడగ కింద పసితనం

మోహ తీరాల్లో హార్మోన్ల తాకిడిని
ఆత్మల ఐక్యంగా భ్రాంతి చెందినపుడు
చెత్త కుండీలో శైశవ గీతి పలికింది
ఆకలి ఆది మంత్రమైన ఆ శిశువుకి
అమ్మ స్తన్యం దూరమే
శిశువు వేదన అరణ్య రోదనే!
ఏ బలిసిన కాయమో విసిరేసిన బిర్యాని
ఏ సాంఘిక అలసత్వమో
బిడ్డకు జవసత్వాలు ఇవ్వలేని
విషాద సందర్భం!
ఏ తల్లి విసిరిన ఎంగిలో
అనివార్య ఆకలి తీర్చే పొంగలి
అనాధగా పేరు పడ్డవాడు
ఆ కళ్ళు ఆకలి కలలు నింపుకొన్న కొలనులు
అడుగడుగునా నిరాదరణ
పులుముకున్న పుడమి పుత్రుడు
నిత్యం అతని జీవితం
సంఘ స్వార్థపు పడగ నీడలో పసితనం!

– వీరేశ్వర రావు మూల
94947 46228

మట్టి మా సింధూరం



ప్రతి ఉదయాన్నీ తట్టి నిద్రలేపి
విత్తన భాషను వింటూ
పైరు కలల్ని కంటూ
నేలకు నాగలై తను పంటలా
మారి
శ్రమగీతం ఆలపిస్తూ ఉంటాడు

రైతు ఉన్న ఊరు, దేశం
ద్విగుణీకృత దీపంలా
వెలుగుతూనే ఉంటుంది
అప్పుల దుఃఖం, చీకటి కోణాలు
ఎన్నున్నా
వెన్నుపై ప్రపంచ పటాన్ని మోస్తూ
ఒక ధీరుడిలా కనిపిస్తూ
శ్రమైక్య చతురతను
మేల్కొలుపుతూనే ఉంటాడు

రైతు సేవలు అజరామరం
శ్రమ స్వేదం అభాసుపాలు
గిట్టుబాటు అశనిపాతం
అయినా అవనిపైనే అతని
వ్యవసాయ మమకారం

ప్రతి గింజా రైతు బిక్షే
ఆక్షేపణలు అడ్డుగోడలై నిలిచినా
కారు, కారుకు కొత్త గింజై
మొలకెత్తాల్సిందే
దేశ ఆకలి దిగుల్ని తీర్చాల్సిందే!

మబ్బు మురిపిస్తుంది
వాన ఉరికెత్తిస్తుంది
కలలన్నీ ఒక్కోసారి తడిసి
మొలకలై కన్నీరు కారుస్తాయి
అప్పులన్నీ ఉరితాళ్ళై వెక్కిరిస్తాయి
నమ్ముకొన్న నేల మాత్రం
రైతు నుదుటిన సింధూరంలా
విజయ తిలకమై నవ్వుతూ
కనిపిస్తుంది

– మహబూబ్ బాషా చిల్లెం
95020 00415

సూపర్ స్టార్ కృష్ణపై రచనలకు ఆహ్వానం

తన విలక్షణ నటనతో, ప్రయోగాలతో ఆబాల గోపాలాన్ని అలరించారు సూపర్‌స్టార్ కృష్ణ. సినీ వినీలాకాశంలో ధృవతారలా వెలుగొందారు. ఆయన జయంతి సందర్భంగా 'తనివి తీరలేదే..!' పేరిట ఒక సంకలనాన్ని ప్రచురించి, కృష్ణకు అక్షర నీరాజనం సమర్పిస్తున్నట్లు 'సూపర్ స్టార్ కృష్ణ కళా పరిషత్' అధ్యక్షుడు జాలాది మోహన్, పుస్తక సమన్వయకర్త, రచయిత డాక్టర్ మొగిలి దేవ తెలిపారు. కృష్ణ జీవితం, నటన, ఔన్నత్యం, సాహసం, మంచి మనసు, వ్యక్తిత్వం తదితర వస్తువులుగా ఏ సాహితీ ప్రక్రియల్లోనైనా తమ రచనలను 30, జూన్, 2023 లోపు వాట్సాప్ 6309 373 962కి గానీ,ఈ మెయిల్ p.news200@gmail.comకి గానీ తమ రచనలను పంపాలని కోరారు.

10న త్రిపురనేని శ్రీనివాస్‌తో ఓ సాయంకాలం!

ప్రముఖ కవి, అనువాదకుడు, విలక్షణ పాత్రికేయుడు త్రిపురనేని శ్రీనివాస్ 60వ పుట్టినరోజు సందర్భంగా సాంస్కృతిక శాఖ, కవి సంధ్య సయుక్త నిర్వహణలో 'త్రిపురనేని శ్రీనివాస్‌తో ఒక సాయంత్రం' కార్యక్రమం జరుగుతుంది. మే 10, బుధవారం సాయంత్రం 5.30 గంటలకు రవీంద్ర భారతి, కాన్ఫరెన్స్ హాలులో జరిగే ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ స్నేహితులు, అభిమానులు పాల్గొంటారు. కార్యక్రమంలో శ్రీనివాస్ జ్ఞాపకాల కలబోత, కవి సంధ్య పత్రిక–42, 'త్రి. శ్రీ 60' ప్రత్యేక సంచిక ఆవిష్కరణ, కవిత్వం ప్రచురణలు ప్రదర్శన ఉంటాయి.

– కవి సంధ్య

'కలుంకూరి గుట్ట' కథలకు గంటా కమలమ్మ స్మారక పురస్కారం

శ్రీమతి గంటా కమలమ్మ స్మారక కథా పురస్కారం 2023కు కథా రచయిత కేవీ మేఘనాథ్ రెడ్డి 'కలుంకూరి గుట్ట' కథా సంపుటి ఎంపికైందని, పురస్కార వ్యవస్థాపకులు, అరసం చిత్తూరు జిల్లా అధ్యక్షులు గంటా మోహన్ తెలిపారు. ఈ నెల 30న చిత్తూరులో జరిగే కార్యక్రమంలో రచయితకు 10 వేల రూపాయల నగదు, జ్ఞాపికతో సత్కారం జరుగుతుందని వారు తెలిపారు.

'కథా విరించి' కథల పోటీ ఫలితాలు

తెలుగు భారతి వారి సంస్థ నిర్వహించిన కథల పోటీకి 204 కథలు వచ్చాయి. వీటిలో ప్రథమ బహుమతి : ఎస్.ఆర్.కె రామచంద్రమూర్తి – నల్ల వంతెన; ద్వితీయ బహుమతి : కె.శ్రీనివాసరావు – రాతిబంధం; తృతీయ బహుమతి : ఆర్.భ్రమరాంబిక – ఆత్మహత్య కథలు ఎంపికయ్యాయి. విజేతలకు నగదు మొత్తాన్ని వారి ఖాతాలకు పంపినట్టు నిర్వాహకులు తెలిపారు.

కౌలు రైతుకు భరోసా కరువు!



- సాగు ఇబ్బందులు, పంట నష్టాలతో అన్నదాత విలవిల
- వరి, మామిడి రైతుల పరిస్థితి అగమ్యగోచరం
- ధాన్యం అమ్ముకునేందుకు సైతం రైతులకు పాట్లే
- కౌలు రైతులకు దక్కని ప్రభుత్వ సాయం
- బ్యాంకురుణాలు, పంటనష్టం సైతం భూయజమానుల ఖాతాల్లోకే
- దిక్కుతోచని స్థితిలో ఉమ్మడి జిల్లాలో 3 లక్షల మంది కౌలురైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సాగు ఇబ్బందులు, వరుస పంట నష్టాలతో కౌలురైతులు విలవిల్లాడిపోతున్నారు. ప్రభుత్వం నుంచి భరోసా దక్కకపోవడంతో వాస్తవ సాగుదారుడైన కౌలురైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అప్పుల బాధతో నిత్యం నరకం అనుభవిస్తున్న పరిస్థితి నెలకొంది. బ్యాంకులు అందించే పంట రుణాలు, ప్రభుత్వం అందించే పంట సాయం, బీమా వంటివి సైతం సాగు చేసే కౌలురైతులకు అందడం లేదు. సాగుకు దూరంగా ఉంటున్న భూయజమాని ఖాతాల్లోకే ప్రభుత్వ సాయం 90 శాతం చేరిపోతుంది. జిల్లాలో ప్రధానమైన పంట సాగుచేసే వరి రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా మారగా, మామిడిరైతులు సైతం తీవ్ర నష్టాలను మూటగట్టుకుంటున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నారు. జిల్లాలో దాదాపు 16 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతుండగా జిల్లా సాగులో 75 శాతం కౌలురైతులే చేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లా వ్యవసాయ రుణ ప్రణాళికలో పంట రుణాలకు రూ.వేల కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రణాళికలు రూపొందిస్తున్న కౌలురైతులకు ఒక్క శాతం రుణం కూడా అందని దుస్థితి నెలకొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏలూరు జిల్లాలో కౌలురైతులకు బ్యాంకుల నుంచి అందిన పంట రుణాలు దాదాపు రూ.50 కోట్లు మాత్రమే. పశ్చిమలోనూ కౌలురైతులకు పెద్దగా రుణాలివ్వని పరిస్థితి ఉంది. ప్రయివేటు వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీలకు అప్పు తెచ్చి కౌలురైతులు వ్యవసాయం చేస్తున్నారు. పంట దెబ్బతిన్నా తెచ్చిన అప్పులు వడ్డీతో సహా చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వం నుంచి చిల్లిగవ్వ సాయం అందడం లేదు. ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద అందించే రైతుభరోసా సొమ్ము సైతం వాస్తవ సాగుదారుడైన కౌలురైతులకు అందడం లేదు.

ప్రభుత్వానికి పట్టని కౌలురైతుల గోడు

కౌలురైతుల గోడు ఏ ప్రభుత్వానికీ పట్టడం లేదు. ఎన్నికల ముందు కౌలురైతులను ఆదుకుంటామని హామీలు గుప్పించడం మినహా ఆచరణలో మాత్రం ఏమీ లేకుండా పోతుంది. 2019లో వైసిపి ప్రభుత్వం కౌలురైతుల కోసం తెచ్చిన చట్టం రైతులకు ఉరితాడుగా మారింది. భూయజమాని అంగీకారంతో కౌలుకార్డు ఇవ్వాలని నిబంధన పెట్టడంతో కౌలురైతులకు కౌలుకార్డు కూడా అందని పరిస్థితి నెలకొంది. దీంతో ధాన్యం అమ్ముకునేందుకు సైతం రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ప్రతియేటా ఖరీఫ్‌లో పెద్దఎత్తున పంటలు దెబ్బతింటున్నా కౌలురైతులకు మాత్రం సాయం అందడం లేదు. బీమా సైతం భూయజమాని ఖాతాల్లోకే వెళ్లిపోతుంది. గడిచిన రెండేళ్లుగా వరి సాగులో రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. సంచుల్లేక, లారీలు సకాలంలో రాక ధాన్యం అమ్ముకునేందుకు రైతులకు నరకం చూస్తున్నారు. ప్రస్తుత రబీలో ఒకపక్క వర్షాలు, మరోపక్క ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గాలివానలకు మామిడి కాయలు రాలిపోయి రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు.

మామిడి సాగులోనూ అత్యధికంగా కౌలురైతులే ఉన్నారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో వ్యవసాయం చేయాలంటేనే భయపడే పరిస్థితికి రైతులు చేరుకున్నారు. సాగు చేసే కౌలురైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందకపోవడం రైతులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు కౌలురైతులకు న్యాయం చేసేవిధంగా చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో పరిస్థితులు దారుణంగా మారే ప్రమాదం కనిపిస్తోంది.

విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు దోహదం

- ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్ (పశ్చిమగోదావరి జిల్లా)



గ్రంథాలయాల నిర్వహణ ద్వారా సేవా, విజ్ఞానాన్ని అందించడం అభినందనీయమని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం బస్టాండ్ పక్కనున్న మీరా స్మారక గ్రంథాలయంలో నిర్మించిన సేవా విజ్ఞాన కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతీ, యువకులు, విద్యావంతులకు ఈ గ్రంథాలయం ద్వారా అందించే సేవ ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఈ గ్రంథాలయం, సేవా విజ్ఞాన కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయాలు, విజ్ఞాన కేంద్రాల నిర్వహణ వల్ల విద్య, సాంస్కృతిక సముపార్జనకు ఉపయోగపడతాయన్నారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మురళీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న విజ్ఞాన కేంద్రాలు ప్రజలకు అనేక విధాలుగా సేవలందిస్తూ తోడ్పాటునందిస్తున్నాయన్నారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం పోరాడిన మహ్మద్ మీరా పేరు మీద గ్రంథాలయం ఏర్పాటు చేసి అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రె వెంకటరమణ, మాజీ ఎంఎల్ఏ బండారు మాధవనాయుడు, వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు, ఉద్దరాజు రామం ట్రస్ట్ చైర్మన్ మంతెన సీతారాం, అల్లూరి సీతారామ రాజు భగత్ సింగ్ సేవా కేంద్రం ఛైర్మన్ బి.బలరాం, నరసాపురం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు నల్లిమిల్లి జోసఫ్, జకెట్, అల్లూరి సత్యనారాయణ రాజు సాంస్కృతిక కేంద్రం నిర్వాహకులు బాపూశ్రీ మాట్లాడారు. సభకు మీరా గ్రంథాలయ, సేవా విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు కవురు పెద్దిరాజు అధ్యక్షత వహించగా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు వందన సమర్పణ చేశారు.

పుష్కరిణి, కళ్యాణకట్టను ప్రారంభించిన టిటిడి చైర్మన్

ప్రజాశక్తి- తిరుపతి సిటి

బెంగళూరు నగరంలోని వయ్యాలి కావల్‌లో గల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో నిర్మించిన స్వామివారి పుష్కరిణి, కల్యాణకట్టను ఆదివారం టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు వైవి.సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.7లక్షల వ్యయంతో ఇక్కడ పుష్కరిణి నిర్మించామని, తిరుమలకు రాలేని భక్తులు ఇక్కడ తలనీలాలు సమర్పించి, స్వామివారి పుష్కరిణిలో స్నానం చేసేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరిణిని ప్రారంభిం చారు. అదేవిధంగా కల్యాణకట్ట, ప్రసాదాల విక్రయ కేంద్రం, టీటీడీ ఉత్పత్తుల విక్రయ కేంద్రం, టీటీడీ సేవాటికెట్ల కౌంటర్‌ను ఛైర్మన్ ప్రారంభించారు. ఇక్కడి టీటీడీ కళ్యాణ మండపంలో జరుగుతున్న శ్రీవెంకటేశ్వర భక్తి ఛానల్ స్టూడియో పనులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో బెంగళూరు స్థానిక సలహా మండలి అధ్యక్షులు సంపత్ రవి నారాయణన్, ఉపాధ్యక్షులు రాధాకష్ణ అడిగ, కార్యదర్శి భక్తవత్సలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూక శాతం పేరుతో ఇబ్బంది పెట్టొద్దు

- తీరు మారకపోతే మిల్లర్లపై చర్యలు
- ధాన్యం కొనుగోళ్లు జిల్లా పర్యవేక్షణాధికారి శశిభూషణ్‌కుమార్

ప్రజాశక్తి - ఉంగుటూరు (ఏలూరు జిల్లా)



మిల్లర్లు, సిబ్బందితో మాట్లాడుతున్న శశిభూషణ్ కుమార్

నూక శాతం పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని, ధాన్యం సేకరణలో రైతులను ఇబ్బంది పెట్టే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర జలవనరుల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి, ధాన్యం కొనుగోళ్లు జిల్లా పర్యవేక్షణాధికారి శశిభూషణ్‌కుమార్ హెచ్చరించారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు ఆర్‌బికె, నాచుగుంట రైస్‌మిల్లులను ఆదివారం ఆయన సందర్శించారు. రైతులు, ఆర్‌బికె సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ధాన్యం తేమ, నూకల శాతం కొలిచిన తరువాత ధాన్యాన్ని రైసుమిల్లుకు తరలించాక మిల్లర్లు తమకు పలుమార్లు ఫోన్ చేసి ధాన్యం కొనుగోలు విషయంలో పలు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. రవాణాలో లారీ డ్రైవర్లు అధిక మొత్తం డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై శశిభూషణ్‌కుమార్ స్పందిస్తూ ధాన్యం రవాణాకు ట్రక్ షీట్ రూపొందించాక ధాన్యాన్ని రైస్‌మిల్లుకు పంపి దిగుమతి చేయించాల్సిన బాధ్యత కస్టోడియన్ అధికారిదని, దీనిలో రైతులకు ఎటువంటి ప్రమేయమూ ఉండదని స్పష్టం చేశారు. ఆర్‌బికె అధికారులకు ధాన్యం అందించాక సొమ్ము 10 రోజుల్లో రైతుల ఖాతాల్లో జమవుతుందన్నారు. అధికారులు సమన్వయంతో పని చేస్తే ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎటువంటి ఇబ్బందులూ ఉండవన్నారు. రవాణా ఛార్జీలను జిల్లాస్థాయిలో లారీ యజమానులతో చర్చించి నిర్ణయించారని, లారీ డ్రైవర్లకు కూడా అధిక మొత్తం చెల్లించనవసరం లేదని, ఏ లారీ డ్రైవర్ అయినా ఇబ్బంది పెడితే వెంటనే దగ్గరలోని అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. కొన్ని కేంద్రాల్లో ధాన్యం సేకరణ లక్ష్యం పూర్తయినప్పటికీ మళ్లీ లక్ష్యాన్ని సవరించి ధాన్యం సేకరణ చేస్తున్నామన్నారు. తడిచి రంగుమారిన ధాన్యంను కూడా రైతుల నుండి కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటి వరకూ రూ.240 కోట్ల విలువైన ధాన్యాన్ని రైతుల నుండి సేకరించామన్నారు. నాచుగుంట గాయత్రి ట్రేడర్స్ రైస్‌మిల్లులో నూక శాతం విధానంపై సమీక్షించారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వై.రామకృష్ణ, డిప్యూటీ తహశీల్దార్ పోతురాజు, మండల వ్యవసాయాధికారి రామకృష్ణ, జిల్లా అధికారులు ఉన్నారు.



పెద్దదర్గాలో అల్లరి నరేష్ ప్రార్థనలు

ప్రజాశక్తి - కడప అర్బన్

అమీన్ పీర్ దర్గాను సినీ నటుడు అల్లరి నరేష్ ఆదివారం దర్శించుకున్నారు తాను నటించిన ఉగ్రం చిత్రం విజయోత్సవ యాత్రలో భాగంగా యూనిట్ బందంతో కలిసి అమీన్ పీర్ దర్గాకు విచ్చేశారు. వారికి దర్గా సంప్రదాయం ప్రకారం దర్గా నిర్వాహకులు స్వాగతం పలికారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, దర్గా విశిష్ఠతను అడిగి తెలుసుకున్నారు. దర్గాను దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉగ్రం సినిమాను ప్రేక్షకులు ఆదరించడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.ఉగ్రం సినిమా ప్రతి ఒక్కరూ తప్పకుండా చూడాలని కోరారు.

ఐసర్‌లో కార్మికులతో వెట్టిచాకిరి

- కానరాని మౌలిక వసతులు
- పారిశుధ్యం మరింత అధ్వానం
- రోగాలబారిన భవన నిర్మాణ రంగ కార్మికులు
- ఒకరు మృతి
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- బాధితులను పరామర్శించిన సిఐటియు నాయకులు



బాధితులను పరామర్శిస్తున్న సిఐటీయూ నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం జంగాలపల్లి సమీపంలో నిర్మిస్తున్న ఐసర్ (ఇండియన్ ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్)లో భవన నిర్మాణ రంగ వలస కార్మికులు అడుగడుగునా వివక్షకు గురవు తున్నారు. కనీస మౌలిక వసతులకు నోచుకోక దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు. సదరు కాంట్రాక్టర్ ఆ వలస కార్మికుల చేత వెట్టిచాకిరి చేయించుకుంటూ కనీసం వారి యోగక్షేమాలు పట్టించుకోని పరిస్థితి. దీం తో ఐసర్ నిర్మాణంలో భాగస్వాములైన సుమారు 1100మంది వలస కార్మికులు నిత్యం అనా రోగ్యం భారిన పడుతూ సతమతమవు తున్నారు. ఈ క్రమంలో గత వారం రోజులుగా సుమారు 30మంది కార్మికులకు సుస్తి చేయడంతో కాంట్రాక్టరే ఎవరికి తెలియ కుండా ప్రైవేటుగా వైద్యం చేస్తు న్నారు. ఈ నేపథ్యంలో మధ్య ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సుశీల్ కుమార్(33) అనే కార్మికుడు శని వారం తీవ్ర అనారోగ్యానికి గురి కాగా, ఆయన్ను ఆసుపత్రికి తరలిస్తుం డగా మార్గమధ్యలో మరణించడం గమనార్హం. వివరాల్లోకి పోతే...

తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం జంగాల పల్లి వద్ద నిర్మిస్తున్న ఐసర్ లో మధ్యప్రదేశ్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, బీహార్, చండీగర్ రాష్ట్రాలకు చెందిన సుమారు 1100 మంది భవన నిర్మాణంగా వలస కార్మికులు పనిచేస్తున్నారు. వీరంతా డిఇసి కంపెనీ పరి ధిలో ఒప్పంద కార్మికులుగా ఐసర్ నిర్మాణాలను చేపడు తున్నారు. అయితే సదరు కంపెనీ వీరికి వసతి సదు పాయాలు కల్పించకపోవడంతో కార్మికులంతా రేకుల షెడ్లలో తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రేకులషెడ్ల వద్ద కనీస మౌలిక వసతులు లేకపోవడంతో మలం, మూత్ర విసర్జన అక్కడే చేయాల్సి రావడం విచారకరం. కార్మికులు నివసించే చోట ఏమాత్రం పరిశుభ్రత లేకపోవడంతో నిత్యం వ్యాధులు భారినపడాల్సి వస్తోంది.

ఈనేపథ్యంలోనే గత మూడు రోజులు గా 30మంది కార్మికులు తీవ్ర అశ్వస్థత కు ఆసుపత్రి పాలయ్యారు. శనివారం సునీల్ కుమార్ అనే కార్మికుడి పరిస్థితి విష మించడంతో ఆయన శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. అయితే ఐసర్ వద్ద కార్మికులకు ఏర్పాటు చేసిన నివాస ప్రాంతం లో కనీస మౌలిక వసతులు లేకున్నా, కార్మికులు తరచూ అనారోగ్యం పాలవుతున్నా సదరు కంపెనీ పట్టించుకోక పోవడం వల్లే ఈ పరిస్థితులు తలెత్తాయని తెలుస్తోంది. కార్మికుల అశ్వస్థత విషయం వైద్యాధికారులు తెలియ డంతో ఆదివారం కంటితుడుపు చర్యగా మెడికల్ క్యాం పు నిర్వహించి మమ అనిపించారు. అయితే ఐజర్ వద్ద పరిస్థితులు అదుపులోకి రాని పరిస్థితి. కొందరు తీవ్ర అనారోగ్యం భారినపడి ప్రైవేట్ హాస్పిటల్‌కి వెళ్లినా వారి ఆచూకీ తెలియడం లేదు. కొందరు తీవ్ర భయాందోళ నలకులోనై కంపెనీ వారికి కూడా చెప్పకుండా బయట కు వెళ్లిపోయినట్లు సమాచారం. ఐజర్ వద్ద భవన నిర్మాణరంగా వలస కార్మికుల పట్ల ఇంత వివక్ష జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపో వడం విచారకరం. కనీసం ఐసర్ వద్దా ఎంతమంది కార్మికులు పనిచేస్తున్నారు వారి వివరాలు కూడా అధి కారుల రికార్డుల్లో లేకపోవడం దురదష్టకరం. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి అయితే నిర్మాణం లో భాగస్వాములైన వలస కార్మికులకు సత్వరమే అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పించి, నివాస ప్రాంతంలో కనీస మౌలిక వసతులు మెరుగుపరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలి: సిఐటియు

జంగాలపల్లి ఐసర్ వద్ద భవన నిర్మాణ రంగా వలస కార్మికుల కేటాయించిన నివాస ప్రాంతాన్ని ఆదివారం సిఐటియు నాయకులు పరిశీలించారు. అక్కడ కార్మికులకు కేటాయించిన రేకుల షెడ్లను, అపరిశుభ్ర పరిస్థితులను చూసి విస్తుపోయారు. కార్మికులకు కేటాయించిన నివాస ప్రాంతం పశువుల కొట్టం కంటే దారుణంగా ఉందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, రంగయ్య వాపోయారు. డీఈసీ కంపెనీ నిర్లక్ష్యం వల్లే సునీల్ కుమార్ అనే కార్మికుడు మతి చెందాడనీ, ఆయన కుటుంబానికి కంపెనీ రూ.25లక్షలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అనారోగ్యం పాలైన కార్మికుల వైద్య సదుపాయాలకయ్యే ఖర్చు మొత్తాన్ని కంపెనీ భరించాలని స్పష్టం చేశారు. వలస కార్మిక చట్టాలను అమలు చేసి కంపెనీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సాగరతీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు (పశ్చిమగోదావరి జిల్లా)

పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలంలోని పేరుపాలెం బీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఇసుక తేన్నెలపై, ఒడ్డు కొట్టుకొస్తున్న కెరటాలతో ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే కొబ్బరి తోటల్లో సహపక్తి భోజనాలు చేశారు.

రాజ్యాంగానికి లోబడే వ్యవస్థలు

- హైకోర్టు జడ్జి ఆకుల వెంకటశేషసాయి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రతి ఒక్కరికీ 'రైట్ టూ లైఫ్' కల్పించడం కోసం దేశంలో వ్యవస్థలు సక్రమంగా పని చేయడానికి అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగమే కారణమనిఎపి రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు జడ్జి ఆకుల వెంకటశేషసాయి అన్నారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్‌కు రుణపడి ఉండాలన్నారు. నగరంలో ఆధునీకీకరించిన డిఎల్ఎస్ఎ సమావేశ మందిరాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఆయనతో పాటు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సిహెచ్.మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ టి.మల్లి కార్జునరావు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి వెంకటశేషసాయి మాట్లాడారు. అందరికీ న్యాయం జరిగినప్పుడే దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరికీ కూడు, గుడ్డ,గూడు అందుతాయన్నారు. ఆర్థిక, సామాజిక హోదా ఆధారంగా కాకుండా, వారి హక్కుగా న్యాయం జరగాలన్నారు. ఏ భారతీయుడు ఆర్థిక, సామాజిక స్థితి కారణంగా అన్యాయానికి గురి కాకూడదు అని రాజ్యాంగం ఆర్టికల్ 39(ఎ)లో అంబేద్కర్ పొందుపర్చా రన్నారు. జాతీయ లోక్ అదాలత్, న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు ద్వారా సత్వర న్యాయం సాధ్యం అవుతుందన్నారు. జిల్లా స్థాయిలో న్యాయం కోసం వచ్చే వారికి డిఎల్ఎస్ఎ ద్వారా అందిస్తున్న సేవల పట్ల డిఎల్ఎస్ఎ చైర్మన్ సునీత గంధం, కార్యదర్శి కె.ప్రత్యూష కుమారిలను అభినం దించారు. అనంతరం హైకోర్టు జడ్జి జస్టిస్ సిహెచ్. మానవేంద్రనాథ్ రాయ్ మాట్లాడారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల పరిధిలో సత్వర న్యాయం సాధ్యం అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మరో హైకోర్టు జడ్జి జస్టిస్ టి. మల్లికార్జునరావు మాట్లాడుతూ మూడు దశాబ్దాల క్రితం న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటైందన్నారు. ఈ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత గంధం మాట్లా డుతూ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వ ర్యంలో సత్వర న్యాయం కోసం చర్యలు తీసుకుం టున్నామన్నారు. న్యాయ వ్యవస్థ, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కోవిడ్ సమయంలో తల్లి తండ్రులను కోల్పోయిన 9 మంది పిల్లలకు జిల్లా యంత్రాంగం ద్వారా గుర్తించి వారికి రూ.10 లక్షల చొప్పున రూ.90 లక్షలు అందజేస్తున్నామన్నారు. తొలుత జిల్లా కోర్టు ప్రాంగణానికి చేరుకున్న హైకోర్టు న్యాయ మూర్తులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, తది తరులు ఆహ్వానం పలికారు. అనంతరం పోలీసులు గార్డ్ ఆఫ్ హానర్ ఇచారు. న్యాయ మూర్తులు కోర్టు అవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డిఎల్ఎస్ఎ సెక్రటరీ కె.ప్రత్యూషకుమారి, న్యాయ మూర్తులు ఎం.నాగేశ్వరరావు, పిఆర్.రాజీవ్, యుయు.ప్రసాద్, ఎ.గాయత్రిదేవి, ఎస్‌పి సిహెచ్.సుధీర్‌కుమార్, జెసి ఎన్.తేజ్‌భరత్, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్, రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు జియువిబి.రాజు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం రైతుల దైన్యం!

- ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానావస్థలు
- వర్షానికి రంగుమారడం, మొలకెత్తడంతో ఆందోళన
- నింబంధనల పేరుతో కొనుగోలులో ప్రభుత్వం జాప్యం


కైకరలంలో వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యం

ప్రజాశక్తి- ఏలూరు, రాజమహేంద్రవరం ప్రతినిధులు

అకాల వర్షాలు, ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో వరి రైతులు నిండా మునిగారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం, అవసరమైన మేరకు గోనె సంచులు సరఫరా చేయకపోవడం, రైస్ మిల్లర్లు రవాణా వాహనాలను పంపించకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతూ వచ్చారు. రోజుల తరబడి రైతుల వద్ద ధాన్యం నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో అకాల వర్షాలకు ధాన్యం తడిచిపోయి మొలకలు రావడం, రంగు మారడంతో చెంపదెబ్బకుతోడు గోడదెబ్బ కూడా తగిలినట్లయింది. ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందుకు గురి చేస్తోంది.

రబీలో ఏలూరు జిల్లాలో 79 వేల ఎకరాలు, పశ్చిమ గోదావరి జిల్లాలో 2.13 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 9.28 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. 6.47 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఏలూరు జిల్లాలో 3.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఏప్రిల్ 16వ తేదీ వరకూ ధాన్యం కొనుగోలు ప్రారంభించకుండా ఆలస్యం చేశారు. ప్రస్తుతం అధికారిక లెక్కల ప్రకారం పశ్చిమగోదావరి జిల్లాలో మూడు లక్షల మెట్రిక్ టన్నులు, ఏలూరు జిల్లాలో లక్షా 40 వేల టన్నుల ధాన్యం మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసింది. అంటే ఈ రెండు జిల్లాల్లో మొత్తం 13.10 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడికిగానూ ఇప్పటి వరకూ కొనుగోలు చేసింది 4.40 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే. రైతు కొనుగోలు కేంద్రాలతో సంబంధం లేకుండా విక్రయించిన ధాన్యం మరో రెండు లక్షల మెట్రిక్ టన్నుల వరకూ ఉండొచ్చని అంచనా. ఆ లెక్కన ఇంకా 6.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్దే ఉంది.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 4.50 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. సుమారు 16 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. కాకినాడ, రాజమహేంద్రవరం, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ప్రస్తుతం 60 శాతం కోతలు పూర్తయ్యాయి. 7.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. ప్రభుత్వం కేవలం మూడు లక్షలు మెట్రిక్ టన్నులే కొనుగోలు చేసింది. మిగిలిన 4.50 లక్షల టన్నుల్లో 1.50 లక్షల టన్నులు ప్రయివేట్ వ్యాపారులు కొనుగోలు చేసినట్లు అంచనా. మిగతా ధాన్యం రైతుల కళ్లాల్లో, ఆరుబయట ఉంది. ఈ నేపథ్యంలో పడిన అకాల వర్షాలకు ధాన్యం తడిచిపోయాయి. ఇప్పుడు దీని కొనుగోలుకు అధికారులు నిబంధనల పేరుతో జాప్యం చేస్తున్నారు. మొలక వచ్చిందని, రంగు మారిందని, తేమ శాతం అధికంగా ఉందని చెప్తుండడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కళ్లాల్లోనూ, ఆరుబయట ఉన్న ధాన్యాన్ని రక్షించుకోవడానికి ఒక్కో బరకాకు రోజుకు రూ.25 చొప్పున అద్దె చెల్లించాల్సి వస్తోంది. గోనె సంచులు ఇస్తే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తామని రైతులు అంటున్నా అధికారుల్లో స్పందన లేదు. తేమ శాతం, నూక, తాలు పేరిట మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ క్వింటాలుకు రూ.150 నుంచి రూ.300 చొప్పున వసూలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కోతం సిద్ధంగా ఉన్న వరి చేలలో 40 శాతం ఒరిగిపోవడం, తడిచిపోవడంతో దిగుబడి తగ్గిపోయే, ధాన్యం రంగు మారే ప్రమాదం ఉందని వాపోతున్నారు. మొలకెత్తిన, రంగుమారిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులూ రాకపోవడంతో ఆందోళనతో ఉన్నారు. నిబంధనలు సడలించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, మద్దతు ధర కల్పించాలని కోరుతున్నారు.

నేడు రాష్ట్రంలోనే తొలి మహిళా పార్కు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేరింతలు కొట్టేందుకు రెయిన్ డ్యాన్స్, ఈత కొలను, వాకింగ్ ట్రాక్, శారీరక ఆరోగ్యం కోసం జిమ్, పిల్లలకు ఆడుకునే జారుడు బల్లలు, ఉయాలలు అందుబాటులోకి రానున్నాయి. అందుకు వేదికగా మహిళా లోకానికి ప్రకాశం పార్కు సిద్ధమైంది. విజయనగరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మహిళా పార్కును సోమవారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పర్యాటక శాఖామంత్రి ఆర్‌కె రోజా, శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించనున్నారు. అందుకు నగర పాలక సంస్థ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం పార్కులో పూర్తయిన అభివృద్ధి పనులను మేయర్, డిప్యూటీ మేయర్లు, మహిళా కార్పొరేటర్లు పరిశీలించారు. ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కౌన్సిల్ తీర్మానం మేరకు రూ98 లక్షలు వెచ్చించినట్లు చెప్పారు. మహిళలతో పాటు చిన్నారులు ఆడుకునేందుకు, వ్యాయామం చేసేందుకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించామని చెప్పారు. అందరూ సద్వినియోగం చేసుకునే అవకాశం ఉందని, ప్రవేశాలు, ఇతర అవసరాలకు సంబంధించి త్వరలో విధివిధానాలు ప్రకటిస్తామని తెలిపారు.

పాలీసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి -ఎటపాక (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఈనెల10న జరిగే పాలిసెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎటపాక పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రామ సత్యనారాయణ పత్రికా ప్రకటనలో తెలిపారు. గడచిన 22 రోజులుగా 10వ తరగతి పూర్తయిన విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించి, ప్రభుత్వ ఆశ్రమ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత కోచింగ్ ఇచ్చామన్నారు. ఉచిత కోచింగ్‌కు సహకరించిన ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, విభాగాధిపతులు, సిబ్బందికి ప్రిన్సిపల్ కృతజ్ఞతలు తెలిపారు. మే 10నఉదయం 11 గంటలనుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పాలిసెట్ పరీక్ష జరుగుతుందని, ఉదయం 10 గంటలకు పరీక్ష హాల్లోకి విద్యార్థులను అనుమతిస్తారన్నారు.

విశాఖకు మరో మణిహారం సీ - హారియర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

విశాఖకు మరో మణిహారంగా సీ – హారియర్ మ్యూజియం నిలవనుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ఈ నెల 11న విశాఖలో జరిగే ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఆయన పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మలతో కలిసి ఆదివారం పరిశీలించారు. సిఎం పర్యటించే సీ – హారియర్ యుద్ధ విమాన మ్యూజియం, వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం, ఆరిలోవ అపోలో ఆసుపత్రి ప్రదేశాలకు వెళ్లి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఎంఆర్‌డిఎ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీ – హారియర్ మ్యూజియం విశాఖ వాసులకు, టూరిస్టులకు మరింత సమాచారాన్ని, ఆహ్లాదాన్ని చేకూరుస్తుందని అన్నారు. టియు 142, కురుసుర సబ్‌మెరైన్‌లకు సీ – హారియర్ మ్యూజియం కూడా తోడవడంతో విద్యార్థులు, యువత ఎన్నో విషయాలను తెలుసుకోవడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన యుద్ధ విమానాన్ని గోవా నుంచి తీసుకువచ్చామని, ముఖ్యంగా ఐదు అంశాల ద్వారా ప్రదర్శన ఉంటుందని తెలిపారు. త్వరలోనే దీన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారన్నారు. పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ నేవీ, ఎయిర్ ఫోర్స్‌కు సంబంధించిన సాంకేతిక అంశాలను ప్రజలు తెలుసుకునే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని, కానీ ఈ మ్యూజియం ఏర్పాటు ద్వారా యువత, పిల్లలు ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ సీ – హారియర్ మ్యూజియం గొప్పతనాన్ని వివరించారు. అనంతరం వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం వద్ద ముఖ్యమంత్రి హెలీప్యాడ్ పనులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. స్టేడియం వద్ద ఏర్పాటు చేయనున్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద కార్యక్రమ ఏర్పాట్లపైనా చర్చించారు. ఆరిలోవలో అపోలో క్యాన్సర్ ఆసుపత్రిలో కార్యక్రమ ఏర్పాట్లపై ఆసుపత్రి నిర్వాహకులతో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, భీమిలి ఆర్‌డిఒ భాస్కర్ రెడ్డి, విఎంఆర్‌డిఎ, జివిఎంసి, ఆర్ అండ్ బి, పోలీసు, ఫైర్, ఎపిఇపిడిసిఎల్ అధికారులు పాల్గొన్నారు.

దేశాన్ని ప్రయివేటీకరిస్తున్న మోడీ

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖ)

ప్రధాని నరేంద్ర మోడీ దేశాన్ని ప్రయివేటీకరిస్తున్నారని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు వ్యక్తులకు అప్పగించే చర్యలు చేపడుతున్నారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ.పాల్ అన్నారు. ఆశీలుమెట్ట వద్ద ఉన్న కెఎ.పాల్ ఫంక్షన్ హాల్‌లో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులతో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో లాభాల్లో నడుస్తున్న స్టీల్‌ప్లాంట్, ఎల్ఐసిలను ప్రయివేటీకరణ చేయడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను ఉపసంహరించుకోవాలని, అందుకు జూన్ 8వ తేదీ వరకూ గడువు ఇస్తున్నామని అన్నారు. తర్వాత పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేంద్రం అనుమతిస్తే నెల రోజుల వ్యవధిలో అమెరికా నుంచి రూ.4 వేల కోట్లు తెచ్చి ప్లాంట్ పరిరక్షణతో పాటు విస్తరణ పనులు చేపడతామన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం జూన్ 4న కెఎ పాల్ ఫంక్షన్ హాల్ వద్ద భారీ బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు. స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం పోరాడుతున్న నాయకులను రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టులు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు కెఎస్ఎన్.రావు, రామస్వామి, నీరుకొండ రామచంద్రరావు, విల్లా రామ్మోహన్ కుమార్ పాల్గొన్నారు.

19 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- గొలుగొండ (అనకాపల్లి జిల్లా)

నర్సీపట్నంకు చెందిన ఓ ప్రైవేటు బస్సులో 19 కేజీల గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నామని గొలుగొండ ఎస్ఇబి సిఐ రాజారావు పేర్కొన్నారు. అల్లూరి జిల్లా చిత్రకొండ నుంచి నర్సీపట్నానికి వెళుతున్న ఎస్ఆర్‌సిఎంటికి చెందిన బస్సులో గంజాయి రవాణా జరుగుతుందని ముందస్తు సమాచారం రావడంతో గొలుగొండ మండలం ఏటిగైరంపేట వద్ద శనివారం సాయంత్రం బస్సును ఆపి తనిఖీ చేశామన్నారు. 19 కేజీల గంజాయి లభ్యమైందని, నలుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద 12వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఎల్‌జి పాలిమర్స్ బాధితుల పాదయాత్ర

ప్రజాశక్తి -యంత్రాంగం

ఎల్‌జి పాలిమర్స్ దుర్ఘటనకు మూడేళ్లు కావడంతో వెంకటాపురం గ్రామంలో బాధిత కుటుంబాలతో కలిసి సిఐటియు నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు గోపాలపట్నం కార్యదర్శి బలివాడ వెంకటరావు మాట్లాడుతూ ఎల్‌జి పాలిమర్స్ దుర్ఘటన తరువాత ప్రభుత్వం బాధితకుటుంబాలకు ఎటువంటి సౌకర్యాలూ సమకూర్చలేదన్నారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మిస్తామని చెప్పి శంకుస్థాపనకే పరిమితమైన దుస్థితి ఈ ప్రభుత్వంలో ఉందని ఎద్దేవా చేశారు. వెంకటాపురం గ్రామం రెడ్ జోన్‌లో ఉందని, ఈ గ్రామానికి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చి మరిచారని విమర్శించారు. ఎల్‌జి పాలిమర్స్ యాజమాన్యం చేసిన తప్పుకు 370 మంది కాంట్రాక్ట్ కార్మికులు బలైపోయారన్నారు. వీరికి ఒక్క రూపాయి కూడా నష్ట పరిహారం ఇవ్వకుండా చట్ట విరుద్ధంగా తొలగించారని తెలిపారు. సిఐటియు సీనియర్ నాయకులు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ, ఎల్‌జి పాలిమర్స్ ఘటన జరిగిన నెల రోజులు తరువాత మూడు కుటుంబాలకు చెందిన వ్యక్తులు మరణించారని, వారికి రూ.కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్.శ్రీనివాసరావు. పి.అనసూయ, ఎ.గోవిందరావు, బాధిత కుటుంబాలు పాల్గొన్నాయి.

పెందుర్తిలో కొవ్వొత్తుల ప్రదర్శన

ఎల్‌జి పాలిమర్స్ ఘటనకు మూడేళ్లయిన సందర్భంగా పెందుర్తి పోలీస్ స్టేషన్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి మాట్లాడుతూ, ఎల్‌జి పాలిమర్స్ ఘటనతో ఎంతో మంది ఎంతోమంది వికలాంగులుగా మారారని, వారిని నేటికీ ప్రభుత్వం ఆదుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కడతానని హామీ ఇచ్చినా నేటికీ అమలు కాలేదన్నారు. ఇప్పటికైనా బాధితులను ఆదుకోవాలని, లేకుంటే భారీ ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అప్పలనాయుడు, సంతోష్, రజిని తదితరులు పాల్గొన్నారు.


ఎల్‌జి పాలిమర్స్ బాధితులను ఆదుకోవాలని పెందుర్తిలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న సిపిఎం, ప్రజా సంఘాల కార్యకర్తలు

విద్వేషం రగిలించే స్టోరీలు



మతవాద, మితవాద శక్తులు సినిమాను ఒక ప్రచారాయుధంగా వాడుకోవటం ఇటీవల బాగా పెరిగింది. 2014, 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు చరిత్ర పేరిట కొన్ని వక్రీకరణ సినిమాలు వరస కట్టాయి. ఆ సినిమాలపై అనుకూల, వ్యతిరేక ప్రచారాన్ని పెద్దఎత్తున నిర్వహించటం; తద్వారా అర్హతకు, అవసరానికీ మించిన ఆసక్తినీ, చర్చనీ లేవనెత్తడం కూడా ఆ శక్తుల ఎత్తుగడ.

కొందరు తొలుత కొన్ని అబద్ధాలను, అతిశయోక్తులను జనంలోకి వదులుతారు. అర్ధ సత్యాలకు పూర్తి అబద్ధాలను జోడిస్తారు. భావోద్వేగాలను కలగలుపుతారు. దానినొక సినిమాగా వండుతారు. ఒక ప్రాంతం మీదనో, ఒక మతం మీదనో అకారణమైన ద్వేషాన్ని కలిగించే సన్నివేశాలూ, సంఘటనలూ అల్లుతారు. ఒక తీవ్రమైన భయాన్ని రేకెత్తించి, ఆ భయానికి కారకులుగా కొంతమందిని చూపిస్తారు. మెజారిటీ మతాన్ని ఏకీకృతం చేయటానికి మైనారిటీ మతాన్ని పావుగా వాడతారు. చరిత్ర పేరిట అవాస్తవాలను లేదా అర్ధ సత్యాలను చూపించి.. తీవ్రమైన విద్వేషాన్ని రగిలిస్తారు. 'కశ్మీర్ ఫైల్స్' దీనికి ఒక ఉదహరణ. తాజాగా వచ్చిన కేరళ స్టోరీ దీనికి కొనసాగింపు.

మతాన్ని రాజకీయాల్లోకి జొప్పించి, దాని ద్వారా ప్రయోజనం పొందిన శక్తులు ఈ ధోరణిని పథకం ప్రకారం కొనసాగిస్తున్నాయి. దేశంలోని చాలా సమస్యల గురించి మాట్లాడని ప్రధాని మోడీ ఎన్నికల సభల్లో కేరళ స్టోరీ గురించి ప్రస్తావించటం .. వారి దృష్టి కోణాన్ని పట్టిస్తోంది. కేరళ స్టోరీ ఈనెల 5వ తేదీన హిందీలో విడుదలైంది. కేరళలో మతవాద రాజకీయాలకు చోటివ్వని తరుణంలో– అక్కడ మతచిచ్చును రగిలించే ప్రయత్నం కొన్నేళ్లుగా జరుగుతోంది. అక్కడ అన్ని మతాల మధ్యా సామరస్యం, సౌభ్రాతృత్వం చారిత్రకంగానే కొనసాగుతోంది. దానిని దెబ్బ తీయటానికి చాలా ప్రచారాలు జరిగాయి. కేరళ నుంచి 32 వేల మంది హిందూ యువతులు అదృశ్యం అయిపోయారని, వారంతా ముస్లిం ఛాందస సంస్థల ఉగ్రవాద శిబిరాలకు తరలించబడ్డారనేది ఒక తీవ్రమైన అబద్ధ ప్రచారం. దానికి ఎలాంటి ఆధారాలూ లేవు. కానీ, అదే అంశాన్ని ప్రధానంగా తీసుకొని దర్శకుడు సుదీప్తో సేన్ ఈ కథను అల్లుకున్నాడు. కొన్ని ఉన్మాద సంస్థలు చేసిన తప్పుడు ప్రచారాన్నే ఈ సినిమా ట్రైలర్‌లో హైలైట్ చేశాడు. 32 వేల మంది యువతులు అదృశ్యమైపోయిన నేపథ్యంలో– ఈ కథ వస్తున్నట్టు చెప్పాడు. రాజకీయ ప్రయోజనం పొందాలనుకుంటున్న హిందూత్వ సంస్థలు చేసిన అబద్ధ ప్రచారాన్నే అతడు ఆసరాగా చేసుకున్నాడు.

సినిమా కథలో రకరకాల భావోద్వేగాలు రగిలిస్తూ ... ఇస్లాం, క్రైస్తవ మతాలను తప్పు పట్టేట్టు డైలాగులు చొప్పించాడు. ఒక పాత్ర చేత .. కమ్యూనిస్టు అయిన తండ్రితో– "నువ్వు మన దేవుళ్ల కథలు చెప్పి ఉంటే– నేను ఇలా అయ్యేదానిని కాదు" అనిపించాడు. వీటన్నిటిని బట్టి చూస్తే– హిందూత్వ రాజకీయ ప్రచారానికి ఊతం అందించే ఉద్దేశంతోనే ఈ సినిమా రూపొందినట్టు అర్థం అవుతుంది. మితిమీరిన హింస, అభ్యంతరకర సన్నివేశాలూ ఈ చిత్రం నిండా చోటు చేసుకున్నాయి. విడుదల అయిన సినిమానే ఇలా ఉందంటే– సెన్సారుకు ముందు ఇంకా ఎలా ఉందో అర్థం చేసుకోవొచ్చు.



స్వార్థపరులు రగిలించిన మత కొట్లాటల్లో మానవత్వం ఎలా పరిమళిస్తుందో, మత సామరస్యం ఎలా వెల్లివిరుస్తుందో ప్రతిభావంతులైన దర్శకులు గతంలో ఎన్నో సినిమాలను నిర్మించారు. అవి చూశాక మనుషులు మనుషుల వలె ఉండాలనే హృదయ కాంక్ష రగులుతుంది. ఉన్మాదం ఏ మతంలో ఉన్నా అది తప్పు అని, మంచి ఏ మతంలో ఉన్నా ఆహ్వానించదగ్గదని ప్రేక్షకులు అనుకుంటారు. కశ్మీర్ ఫైల్స్, కేరళ స్టోరీ వంటివి ఇందుకు భిన్నమైన చిత్రాలు. పక్షపాత వైఖరితో పరాయి మతాలను ద్వేషించే ధోరణిని ఇవి పెంచుతాయి.

దర్శకుల, కథకుల సృజనాత్మక స్వేచ్ఛను ఎవరూ కాదనకూడదు కానీ, ఆ పేరిట సామరస్యాన్ని దెబ్బతీసే విషబీజాలను నాటే ప్రయత్నం చేస్తే – ప్రజలు కచ్చితంగా వ్యతిరేకించాలి. నిరసించాలి. ఏ సృజనాత్మక కళ అయినా మనుషులను కలిపి ఉంచే ఉన్నతాదర్శాన్ని కాపాడాలి. విడగొట్టే విషతంత్రాలకు వేదిక కాకూడదు.

అరకొర వేతనం.. అగమ్య గోచరం

- 20 సంవత్సరాలుగా మూగజీవాలకు సేవలు
- కల్పించని ఉద్యోగ భద్రత
- అయోమయంలో గోపాలమిత్రలు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్

పాడి పరిశ్రమ అభివృద్ధిలో కీలకమైన గోపాలమిత్రలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటూ కృత్రిమ గర్భోత్పత్తి, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ ఇలా అనేక సేవలు అందిస్తూ శ్రమిస్తున్న గోపాలమిత్రలకు ప్రభుత్వం నుంచి ఆదరణ కరువైంది. 20 సంవత్సరాలుగా సేవలందిస్తూ శ్రమిస్తున్న గోపాల మిత్రులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు న్యాయం చేస్తాయనే ఆశ వారిలో సన్నగిల్లుతోంది నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 25 మంది గోపాల మిత్రలు పని చేస్తున్నారు. నాడు వైయస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో భాగంగా మన ప్రభుత్వం వస్తే గోపాల మిత్రలను ప్రభుత్వ ఉద్యోగులు గా గుర్తించి న్యాయం చేస్తానని మాట ఇచ్చారు. నేటికి నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్నా ఆ హామీ అమలు కాలేదు. వీరంతా పాడి రైతులకు అందుబాటులో ఉంటూ పశు సంవర్ధక శాఖలో సేవలందిస్తున్నారు. ఇందుకుగాను నెలకు రూ.6,500 గౌరవ వేతనం మాత్రమే అందిస్తున్నారు. అది కూడా ఏ ఐదు నెలలకో, ఆరు నెలలకో ఒకసారి మాత్రమే ఇస్తున్నారు. 2022 డిసెంబర్ నుండి 2023 మే నెల వస్తున్నా ఇప్పటివరకు ఆ గౌరవ వేతనం అందలేదు. గ్రామాలలో వీరి పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. రైతు భరోసా కేంద్రాల్లో పని చేసే పశు సహాయకులకు సమానంగా సేవలందిస్తున్నా వీరికి మాత్రం కేవలం రూ.6,500రూ మాత్రమే వేతనం వస్తుంది. రెండు దశాబ్దాలుగా అందిస్తున్న వీరి సేవలతో పాడి పరిశ్రమ ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పవచ్చు. కృత్రిమ గర్భధారణ ద్వారా సంకరజాతి పాడి పశువుల అభివృద్ధే ధ్యేయంగా పాల ఉత్పత్తి గణనీయంగా పెంచేందుకు వీరు ఎంతో కృషి చేశారు. అయినా వీరికి సరైన గుర్తింపు లేదు. రైతు భరోసా కేంద్రాల్లో జగన్ ప్రభుత్వం పశు సహాయకులను నియమించడంతో వీరి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వీరంతా అభద్రతా భావంతో జీవితం నెట్టుకొస్తున్నారు. సచివాలయ సిబ్బంది మాదిరిగా యాప్ ద్వారా హాజరు వేసినప్పటికీ ప్రభుత్వపరంగా గుర్తింపు లేదు. గోపాలమిత్రలు విజయవాడలో ధర్నా చౌక్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పుడు మంత్రిగా ఉన్న మోపిదేవి వెంకటరమణ హామితో నిరసన విరమించినా అవి నీటి మూటలుగానే మిగిలి పోయాయి.

ఎంతో మంది మంత్రులు, అధికారులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేశారు. అయినా వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. ప్రస్తుతం వీరికి 20 సంవత్సరాల సర్వీసు ఉన్నా ప్రభుత్వ ఉద్యోగులు గా గుర్తించలేదు. గ్రామాల్లో పని చేస్తున్న తమ పట్ల ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.


ఆదివారం సాయంత్రం ప్రమాదం చోటుచేసుకున్న ప్రాంతంలో ముమ్మరంగా కొనసాగుతున్న సహాయక చర్యలు

మలప్పురంలో పెను విషాదం

పడవ బోల్తా పడి 18 మంది మృతి

మలప్పురం : కేరళలోని మలప్పురం జిల్లాలో ఆదివారం సాయంత్రం ఒక పడవ బోల్తా పడిన మునిగి పోయిన ప్రమాదంలో 11 మంది మరణించారు. మృతుల్లో ఎక్కువ మంది చిన్నారులు ఉన్నారు. జిల్లాలోని తనూర్ ప్రాంతంలోని తువల్తిరం బీచ్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం వార్త తెలిసిన వెంటనే అక్కడకు చేరుకున్న రాష్ట్ర క్రీడల మంత్రి వి అబ్దురహిమాన్ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. వేసవి సెలవులు కారణంగా విద్యార్థులు అధికసంఖ్యలో రైడ్‌కు వచ్చారని, అందుకే మృతుల సంఖ్యలో వీరే అధికంగా ఉన్నారని అధికారులు చెప్పారు. ప్రమాదానికి కారణం ఇంకా వెల్లడి కాలేదని, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని అధికారులు తెలిపారు.

డబ్ల్యుఎఫ్ఐ చీఫ్ తప్పుకోవాల్సిందే

రెజ్లర్లకు రైతు నేతల మద్దతు
భారీస్థాయిలో పోలీసు బలగాలు
టిక్రీ సరిహద్దు వద్ద రైతులను అడ్డుకున్న పోలీసులు
బారికేడ్లను నెట్టుకొని జంతర్ మంతర్‌కు చేరుకున్న మహిళా రైతులు


రెజ్లర్లు మద్దతుగా తరలివచ్చిన రైతులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) చీఫ్, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని మహిళా రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఆధ్వర్యాన రైతు సంఘాల నేతలు మద్దతు తెలిపారు. ఎస్‌కెఎం నేతలు రాకేశ్ తికాయత్, దర్శన్ పాల్, హనన్ మొల్లా, యుధ్‌వీర్‌సింగ్, జోగేంద్ర సింగ్ ఉగ్రహాన్, అరబ్ సింగ్ అహ్లావత్, ఆశిస్‌మిట్టల్, ప్రేమ్‌సింగ్, ఇంద్రజిత్‌సింగ్, కృష్ణప్రసాద్ తదితర నేతలు జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న రెజ్లర్లను కలిశారు. పంజాబ్, హర్యానా, ఉత్తర ఉత్తరప్రదేశ్ నుండి వచ్చిన వేలాది మంది రైతులు, మహిళా రైతులతో కలిసి రైతు నేతలు మహిళా రెజ్లర్లకు సంఘీభావం ప్రకటించారు. హర్యానాలోని వివిధ 'ఖాప్‌ల' ప్రతినిధులు మహిళా రెజ్లర్లకు మద్దతిచ్చారు.

బ్రిజ్ భూషణ్ ను అరెస్టు చేయాలని, న్యాయం చేయాలని రెజ్లర్లు చేస్తున్న ఆందోళన 15వ రోజు ఆదివారం మరింత ఉధృతమైంది. రైతుల రాకతో జంతర్ మంతర్ వద్ద పోలీస్ బలగాలు భారీగా మోహరించాయి. హర్యానా, పంజాబ్ నుంచి వచ్చిన రైతులను ఢిల్లీ సరిహద్దుల వద్ద పోలీసులు అడ్డుకున్నారు. రైతులు ఢిల్లీలో ప్రవేశించకుండా టిక్రీ సరిహద్దు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులను నెట్టుకుంటూ రైతులు, మహిళా రైతులు ఢిల్లీలో ప్రవేశించారు. ఢిల్లీ పోలీసులు కొంతమంది ఖాప్ నాయకులను వారి ప్రైవేట్ వాహనాల్లో ఢిల్లీ సరిహద్దుల నుండి జంతర్ మంతర్ వరకు ప్రయాణించడానికి అనుమతించారు. ట్రాక్టర్లను నిలిపివేశారు. ఖాప్ పంచాయతీ అధ్యక్షుడు పాలం చౌదరి సురేందర్ సోలంకి మాట్లాడుతూ మహిళా రెజ్లర్లకు న్యాయం జరిగే వరకు నిరసన కొనసాగుతుందన్నారు. ఈ నిరసన కార్యక్రమాలను ఏ విధంగా మరింత ముందుకు తీసుకెళ్లాలో త్వరలోనే నిర్ణయిస్తామని చెప్పారు. ఖాప్ అధ్యక్షుడు బల్వంత్ ఫోగట్ మాట్లాడుతూ న్యాయం కోసం పోరాటంలో మల్లయోధులకు మద్దతు ఇవ్వడానికి వివిధ ఖాప్‌ల నాయకులు నిరసన ప్రదేశంలో సమావేశమయ్యామని తెలిపారు.

భారీగా మోహరించిన పోలీసులు

ఢిల్లీ పోలీసులు అన్ని ఎంట్రీ పాయింట్ల వద్ద అనేక వరుసల బారికేడ్లు ఏర్పాటు చేశారు. దాదాపు 300 మంది పోలీసులను, పారామిలటరీ సిబ్బందిని సింఘూ సరిహద్దుల్లో మోహరించారు. ఔటర్ ఢిల్లీలో పోలీసులు 200 మంది పోలీసులను మోహరించారు. బహదూర్‌ఘర్ (హర్యానా)కి అనుసంధానించే టిక్రీ సరిహద్దు వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. అన్ని వాహనాలను ఫరీదాబాద్-ఢిల్లీ సరిహద్దు, ఘజియాబాద్-ఢిల్లీ సరిహద్దు వద్ద నిలిపివేశారు. ఢిల్లీ పోలీసులు ఎలాంటి ట్రాక్టర్, ట్రాలీని ఏ సరిహద్దు నుంచి ఢిల్లీలో ప్రవేశించడానికి అనుమతించలేదు. సింఘూ సరిహద్దులో ఇసుక డంపర్లను మోహరింపచేశారు.


రైతు నేతలకు అభివాదం చేస్తున్న బజరంగ్ పునియా

ముగ్గురు సభ్యుల సస్పెన్షన్

రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ)కి అనుబంధంగా ఉన్న హర్యానా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ (హెచ్ఎడబ్ల్యుఎ) ముగ్గురు సభ్యులను సస్పెండ్ చేసింది. డబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్‌కు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో పాల్గొన్నందుకు ప్రతి ఝజ్జర్, హిసార్, మేవాత్ జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున సస్పెండ్ చేసింది. ఝజ్జర్‌లో వీరేందర్ సింగ్ దలాల్, హిసార్‌లో సంజయ్ సింగ్ మాలిక్, మేవాత్‌లో జై భగవాన్‌లను సస్పెండ్ చేస్తూ హెచ్ఎడబ్ల్యుఎ రాష్ట్ర అధ్యక్షుడు రోహతాస్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.

కమిటీ నివేదిక బయటపెట్టడంలో జాప్యం

బ్రిజ్ భూషణ్‌పై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ఏర్పాటైన కమిటీ నివేదికను బయటపెట్టడంలో ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని రెజ్లర్లు విమర్శిస్తున్నారు. ఆయన తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దర్యాప్తు జరుగుతున్నప్పటికీ డబ్ల్యుఎఫ్ఐ తన కార్యకలాపాలను పున్ణప్రారంభించడం పట్ల విచారం వ్యక్తం చేశారు.

బ్రిజ్ భూషణ్‌ను జైలుకు పంపండి

- సుప్రీం మాజీ న్యాయమూర్తితో విచారణ
- ఎఐకెఎస్ ఉపాధ్యక్షుడు హన్నన్ మొల్లా డిమాండ్


మాట్లాడుతున్న హన్నన్ మొల్లా

బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేసి, జైలుకు పంపాలని ఎఐకెఎస్ ఉపాధ్యక్షుడు హన్నన్ మొల్లా డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నాయకులతోపాటు పెద్ద సంఖ్యలో రైతులు జంతర్ మంతర్ వద్ద రెజ్లర్ల ఉద్యమానికి మద్దతు తెలిపారని ఎస్‌కెఎం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. బ్రిజ్‌భూషణ్ లైంగిక నేరాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న రెజ్లర్లకు పూర్తి మద్దతు ప్రకటించారని తెలిపింది. ఖాప్ పంచాయతీలు కూడా మద్దతుగా నిలిచాయని పేర్కొంది. ఎస్‌కెఎం తరపున హన్నన్ మొల్లా మాట్లాడుతూ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయడంతోపాటు డబ్ల్యుఎఫ్ఐ ఛైర్మన్ పదవి నుంచి తొలగించాలని అన్నారు. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో ఉన్నత స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బ్రిజ్ భూషణ్ నేరగాళ్ల వల్ల రెజ్లర్ల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నందున వారికి ప్రభుత్వం పూర్తి భద్రత కల్పించాలని కోరారు. బ్రిజ్ భూషణ్, కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మలను దగ్ధం చేసేందుకు పిలుపునిచ్చామని తెలిపారు. నేరస్తులకు శిక్ష పడే వరకు రెజ్లర్లకు అండగా ఉంటామని ప్రకటించారు.

మణిపూర్‌లో కర్ఫ్యూ సడలింపు

- నేడు సుప్రీం విచారణ



ఇంఫాల్ : మణిపూర్‌లో క్రమక్రమంగా సాధారణ పరిస్థితులు దీంతో ఆదివారం కొన్ని గంటల పాటు కర్ఫ్యూ సడలించారు. రాష్ట్రంలో గిరిజనులు, గిరిజనేతరుల మధ్య ఘర్షణల్లో ఇంతవరకు 54 మంది మరణించారు. ఇంకా అనేక మంది గాయపడ్డారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. దీంతో ఉద్రిక్తత నెలకొన్న ప్రాంతాల్లో గత వారం కర్ఫ్యూ విధించిన సంగతి తెలిసిందే. సైన్యం రంగంలోకి దిగిన తరువాత పరిస్థితి కొంతమేర అదుపులోకి రావడంతో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకూ మూడు గంటల పాటు కర్ఫ్యూను సడలించారు. ఆహారం, మందులు, ఇతర నిత్యావసర వస్తువులు కొనుగోలు కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు బయటకు వచ్చారు. అంతకు ముందు రోజు శనివారం సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకూ కర్ఫ్యూను సడలించారు. ఆర్మీ, పారా మిలటరీ, సిఆర్‌పిఎఫ్‌కు చెందిన పది వేల మంది జవాన్లను మోహరించారు. సాధారణ నిఘాతో పాటు గగనతల నిఘా వ్యవస్థను సైన్యం పెంచినట్లు రక్షణ శాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు.

రాష్ట్రంలో క్షేత్రస్థాయి నుంచి శాంతి భద్రతలు పునరుద్ధరణ కోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ శాంతి కమిటీలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ తెలిపారు. ఇప్పటి వరకూ 23 వేల మందికి పైగా పౌరులను రక్షించి, సురక్షిత శిబిరాలకు తరలించినట్లు చెప్పారు.

నేడు సుప్రీం విచారణ

మణిపూర్‌లో ఘర్షణలపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటుచేయాలని కోరుతూ దాఖలైన పిటీషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించనుంది. ఢిల్లీకి చెందిన మణిపూర్ గిరిజన ఫోరం వేసిన ఈ పిటీషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణకు షెడ్యూల్ చేసింది. మణిపూర్‌లో పరిస్థితి తీవ్రంగా ఉందని, ఈ దాడులకు రాష్ట్రం, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ నుంచి పూర్తి మద్దతు ఉందని పిటీషన్‌లో ఫోరం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ దాడులు ఢిల్లీకి వ్యాపించాయని, మేఘాలయాలోనూ ఇలాంటి దాడులు జరుగుతున్నాయని తెలిపారు. గిరిజనులపై దాడికి పాల్పడుతున్న సాయుధులు సెమీ ఆటోమేటిక్ ఆయుధాలతో తిరుగుతూ ఇళ్లల్లో లూటీకి పాల్పడుతున్నట్లు కొన్ని వీడియోలు, ఫోటోల్లో కనిపిస్తోందని పేర్కొన్నారు. పోలీసుల వద్ద కూడా ఇలాంటి అధునాతన ఆయుధాలు లేవని పిటీషన్ పేర్కొంది. ఇక ఆన్‌లైన్‌లో విద్వేష ప్రసంగాలు కూడా వ్యాప్తి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం సహాయ శిబిరాల్లో తలదాచుకుంటున్న గిరిజనుల పరిస్థితి చాలా దయనీయంగా ఉందని తెలిపింది.

మహారాష్ట్ర విద్యార్థుల కోసం ప్రత్యేక విమానం : ఏక్‌నాథ్ షిండే

మణిపూర్‌లో చిక్కుకున్న 22 మంది మహారాష్ట్ర విద్యార్థులను వెనక్కి తీసుకురావడం కోసం ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఆదివారం తెలిపారు. ప్రస్తుతం అక్కడ చిక్కుకున్న వారిలో విద్యార్థులతో మాట్లాడినట్లు షిండే చెప్పారు. వారిని ముందుగా అస్సాం తీసుకొచ్చి, ఆ తరువాత అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో రాష్ట్రానికి తరలిస్తామని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

నేటితో ప్రచారానికి తెర

- పూర్వ వైభవం కోసం కాంగ్రెస్ ఆరాటం
- అధికారం నిలుపుకునేందుకు బిజెపి తంటాలు


బాగేపల్లి పట్టణంలోని వివిధ వార్డుల్లో సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్‌కు మద్దతుగా భారీ రోడ్ షో కు హాజరైన ప్రజలు

బెంగళూరు : కర్ణాటకలో ఎన్నికల ప్రచారం చివరి దశకు చేరింది. సోమవారంతో ప్రచారానికి తెర పడుతుంది. మరోవైపు ఓటర్లను ఆకట్టుకునేందుకు తెరవెనుక ప్రయత్నాలు ప్రారంభమవుతున్నాయి. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి పూర్వవైభవం సంపాదించాలని కాంగ్రెస్ విశ్వప్రయత్నం చేస్తుంటే అధికారాన్ని నిలబెట్టుకునేందుకు బిజెపి తంటాలు పడుతోంది. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా వంటి నేతల ప్రచారం తమకు ఓట్లను కురిపిస్తుందని ఆ పార్టీ ఆశిస్తోంది. బెంగళూరులో శనివారం మోడీ 26 కిలోమీటర్ల మేర రోడ్‌షో నిర్వహించారు. ఆదివారం కూడా ఇది కొనసాగింది. 28 అసెంబ్లీ స్థానాలున్న బెంగళూరు నగరంలో మెజారిటీ సీట్లను సొంతం చేసుకునేందుకు బిజెపి వ్యూహరచన చేస్తోంది. 2018 ఎన్నికలలో బెంగళూరులో ఆ పార్టీ పనితీరు నిరాశాజనకంగానే ఉంది. అందుకే మోడీ ఈ నగరంపై ప్రధానంగా దృష్టిపెట్టి, మొత్తం 18 సభలలో ప్రసంగించారు.

మరోవైపు కాంగ్రెస్, జెడి (ఎస్) ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. కాంగ్రెస్ అగ్రనేతలందరూ రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. రాహుల్ గాంధీ ఆదివారం బెంగళూరులో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. డెలివరి బాయ్‌తో కలిసి బైక్‌పై రెండు కిలోమీటర్లు ప్రయాణించారు. కాంగ్రెస్ నేతలు ప్రధాని మోడీపై విమర్శనాస్త్రాలు సంధిస్తూ దుందుడుకుగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కర్ణాటకకు చెందిన వారు కావడంతో రాష్ట్ర రాజకీయాలు ఆయనకు బాగా తెలుసు. అందుకే ఆయన ప్రచార సారధిగా పార్టీని ముందుకు నడిపిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు జరుగుతున్న ఈ ఎన్నికలు ఆయనకు చాలా కీలకం. తన సొంత ప్రాంతమైన కల్యాణ్ కర్ణాటకపై ఆయన ఎక్కువగా దృష్టి కేంద్రీకరిస్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికలలో ఈ ప్రాంతంలోని ఎంపీ స్థానాలన్నింటినీ బిజెపి గెలుచుకుంది. ఖర్గే కూడా పరాజయం పాలయ్యారు. దీంతో ఈసారి ఎలాగైనా పార్టీని అక్కడ మెజారిటీ స్థానాల్లో గెలిపించాలని ఖర్గే కృతనిశ్చయంతో ఉన్నారు.



మరో కాంగ్రెస్ నేత, మాజీ సీఎం, ప్రస్తుతం ముఖ్యమంత్రి పదవిని ఆశిస్తున్న సిద్ధరామయ్య తాను పోటీ చేస్తున్న వరుణ స్థానానికే పరిమితమయ్యారు. ఆయనకు పోటీగా బిజెపి లింగాయత్ నాయకుడు, మంత్రి వి.సోమన్నను బరిలో దింపడంతో పోటీ ఆసక్తిదాయకంగా మారింది.

ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిజెపి హోరాహోరీగా తలపడుతుంటే జనతాదళ్ (ఎస్) కూడా తనేమీ తక్కువ కాదన్నట్లు ప్రచారంలో దూసుకుపోతోంది. ఆ పార్టీ తరపున మాజీ ప్రధాని దేవెగౌడ రోజుకు మూడు నాలుగు సభలలో ప్రసంగిస్తున్నారు. ఆయన కుమారుడు, మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం చెమటోడుస్తున్నారు. పాత మైసూరు ప్రాంతానికే పరిమితమైన తన పార్టీని ఇతర ప్రాంతాలకూ విస్తరించేందుకు కృషి చేస్తున్నారు. కుమారస్వామి తదుపరి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆ పార్టీ నాయకులు ఆశాభావంతో ఉన్నారు. ఏదేమైనా వీరందరి భవితవ్యాన్ని 5.21 కోట్ల కర్ణాటక ఓటర్లు ఈ నెల 10న ఇవిఎంలలో నిక్షిప్తం చేయబోతున్నారు.

సిపిఎం విస్తృత ప్రచారం

కర్ణాటకలో నాలుగు స్థానాల్లో పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థులు ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. బాగేపల్లి పట్టణంలోని వివిధ వార్డుల్లో సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్‌కు మద్దతుగా భారీ రోడ్ షో నిర్వహించారు.

అప్పుల ఊబిలో కర్ణాటక

- అరకొరగా 'సంక్షేమం'
- ప్రతి ఓటరు పైనా రూ.1.2 కోట్ల రుణ భారం
- 10న తేలనున్న బిజెపి భవితవ్యం



బెంగళూరు : కర్ణాటకలో ఇప్పటి వరకూ అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసింది. సంక్షేమానికి మాత్రం అరకొరగా కేటాయింపులు జరిపింది. ఈ నెల 10న జరగబోయే అసెంబ్లీ ఎన్నికలలో ఆ పార్టీకి ఓటమి తప్పదని పలు ఒపీనియన్ పోల్స్ అంచనా వేయడానికి బహుశా ఇది కూడా ఒక కారణం కావచ్చు. కర్ణాటకలో బిజెపి తిరిగి అధికారంలోకి రావడం కష్టమేనని మెజారిటీ సర్వేలు తేల్చేశాయి. దేశంలో ఆర్థికంగా పటిష్టంగా ఉన్న రాష్ట్రాల్లో కర్ణాటకది నాలుగో స్థానం. ఆధునిక పరిశ్రమలకు కూడా అది కేంద్ర స్థానంగా కొనసాగుతోంది. అయినప్పటికీ గత నాలుగేళ్లలో బిజెపి ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేసింది.


ఆర్‌బిఐ క్రోడీకరించిన రాష్ట్రాల బడ్జెట్ల సమాచారం ప్రకారం ఈ సంవత్సరం మార్చి నాటికి కర్ణాటక అప్పుల భారం రూ.5.35 లక్షల కోట్లకు చేరింది. 2018లో ఈ అప్పులు కేవలం రూ.2.46 లక్షల కోట్లు మాత్రమే. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రతి ఓటరు తల పైనా రూ.1,02,107 రుణ భారం పడుతోంది. గత ఐదేళ్లలో తలసరి అప్పు 106 శాతం పెరగడం (2018లో ఇది రూ.49,505 మాత్రమే) ఆందోళన కలిగిస్తోంది. 2017లో కేంద్రం జిఎస్‌టి విధించిన తర్వాత రాష్ట్రాలకు కేంద్ర సాయం తగ్గిపోయింది. రుణాలు సైతం అందడం లేదు. పైగా కోవిడ్ అనంతర పరిస్థితులను ఎదుర్కోవడానికి పెడుతున్న ఖర్చులో రాష్ట్రాలే ఎక్కువగా భరించాల్సి వస్తోంది. అయినప్పటికీ సామాజిక రంగాలపై ప్రభుత్వాలు తగినంత మొత్తాన్ని ఖర్చు చేయాల్సిన అవసరం ఉంది.


అప్పులు చేసినా.. సంక్షేమానికి అరకొర కేటాయింపులే

కర్ణాటకలో సంక్షేమానికి అరకొరగా కేటాయింపులు జరుపుతున్నారు. 2022-23 బడ్జెట్‌లో కర్ణాటకలోని డబుల్ ఇంజన్ ప్రభుత్వం మొత్తం వ్యయంలో విద్యపై 12 శాతం మాత్రమే ఖర్చు చేస్తానని ప్రతిపాదించింది. దేశంలోని ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు సగటున విద్యకు కేటాయించిన 13.6 శాతంతో పోలిస్తే ఇది తక్కువే. అదేవిధంగా వైద్యం, ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమం పద్దుకు కేటాయించింది 5.4 శాతమే. ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ రంగానికి సగటున కేటాయించిన 5.7 శాతం నిధులతో పోల్చినా కూడా ఇది తక్కువే.

వాస్తవానికి విద్యా రంగంపై 2019-20లో కర్ణాటక ప్రభుత్వం 12.4 శాతం ఖర్చు చేయగా, 2022-23 నాటికి అది 12 శాతానికి తగ్గిపోయింది. వైద్యం, ప్రజారోగ్యంపై 2019-20లో 4.1 శాతం ఖర్చు చేయగా, కోవిడ్ అనంతరం ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా 2021-22 (సవరించిన అంచనాలు)లో 5.8 శాతం ఖర్చు చేశారు. ఆ తర్వాత ఈ రంగంపై వ్యయం తగ్గుతూ వచ్చింది. 2022-23లో 5.4 శాతం మాత్రమే ఖర్చు చేశారు.

బిజెపి ప్రభుత్వం రుణాల ద్వారా సమీకరించిన వనరులను ప్రజా సంక్షేమానికి వెచ్చించడంలో విఫలమైంది. 2020-21లో రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో (జిఎస్‌డిపి) అభివృద్ధి వ్యయం 9.4 శాతం ఉండగా, 2021-22 నాటికి 8 శాతానికి, 2022-23 బడ్జెట్ అంచనాల్లో 7.6 శాతానికి తగ్గింది. 2020-21లో సామాజిక రంగంపై జిఎస్‌డిపిలో ఐదు శాతం ఖర్చు చేయగా, అది 2021-22లో 4.9 శాతానికి, 2022-23లో 4.5 శాతానికి తగ్గింది. దీనిని బట్టి అర్థమవుతోంది ఏమంటే బిజెపి పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలు అప్పుల ద్వారా వనరులు సమీకరిస్తాయి. ముఖ్యంగా వాణిజ్య లేదా మార్కెట్ నుంచి రుణాలు పొందుతాయి. విద్య, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం వంటి ప్రజా సంక్షేమ చర్యల కోసం మాత్రం నిధులు విదల్చవు. బహుశా ఈ రుణాలను మూలధనపు వ్యయం కోసం ఉపయోగిస్తూ ఉండవచ్చు. అంటే మౌలిక సదుపాయాల కల్పన వంటి పద్దుల కోసం వ్యయం చేయవచ్చు. అయితే అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఈ వ్యయం కూడా సరిగా ఉండడం లేదు. 2020-21లో జిఎస్‌డిపిలో మూలధనపు వ్యయం కోసం 2.6 శాతం కేటాయించగా 2021-22లో 1.9 శాతానికి తగ్గిపోయింది. 2022-23లో కూడా బడ్జెట్ అంచనాలు అదే విధంగా ఉన్నాయి. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఈ కేటాయింపు చాలా తక్కువ.





ఒక్క మాటలో చెప్పాలంటే ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో పోలిస్తే కర్ణాటకలో వివిధ రంగాలకు బిజెపి ప్రభుత్వం చేస్తున్న కేటాయింపులు చాలా తక్కువగా ఉంటున్నాయి. అభివృద్ధి వ్యయం కోసం ఇతర ప్రాంతాలు 12.5 శాతం కేటాయిస్తే కర్ణాటక కేవలం 7.6 శాతం, సామాజిక రంగానికి ఇతర ప్రాంతాలు 8.4 శాతం కేటాయిస్తే కర్ణాటక 4.5 శాతం, మూలధనపు వ్యయానికి ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు 2.9 శాతం కేటాయిస్తే కర్నాటక 1.9 శాతం మాత్రమే కేటాయించింది.

కర్ణాటకలో సంక్షేమ రంగాలకు బిజెపి ప్రభుత్వం చేస్తున్న అరకొర కేటాయింపుల కారణంగా సామాన్య ప్రజానీకానికి పెద్దగా ఒరిగిందేమీ లేదు. దీంతోపాటు ప్రభుత్వంలో అవినీతి పెచ్చరిల్లిపోయిందన్న విమర్శల జడివానలో బసవరాజ్ బొమ్మై ప్రభుత్వం తడిసి ముద్దవుతోంది. వీటన్నింటి నడుమ కర్ణాటక ప్రజలు ఇచ్చే తీర్పు కోసం దేశమంతా ఆసక్తిగా ఎదురు చూస్తోంది.




ఇదీ కేరళ అభివృద్ధి కథ

కేరళలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ లైఫ్ మిషన్ కింద 20,073 మందికి కొత్త ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్, మంత్రులు లబ్ధిపొందిన ఓ మహిళతో మాట్లాడి, ఆనందాన్ని పంచుకున్నారు. మరో 41,439 కుటుంబాలకు ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటి వరకు 3,42,156 కుటుంబాలు లబ్ధి పొందాయి. ఇదీ అసలు కేరళ కథ!

బిజెపి ప్రభుత్వ తప్పుడు పద్ధతుల వల్లే హింస

సిపిఎం మణిపూర్ రాష్ట్ర కార్యదర్శి శాంతా




న్యూఢిల్లీ : మణిపూర్‌లో బిజెపి ప్రభుత్వ తప్పుడు పద్ధతుల వల్లే జాతుల మధ్య ఘర్షణలు, హింస పెచ్చరిల్లాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి క్షేత్రిమయుం శాంతా అన్నారు. . మణిపూర్‌లో పరిస్థితిపై ఒక ప్రముఖ మీడియా సంస్థతో శాంత ఫోన్ ద్వారా మాట్లాడారు. రాష్ట్రంలో లోయ ప్రాంత ప్రజలను, కొండ ప్రాంత ప్రజలను బిజెపి ప్రభుత్వం తప్పుగా అర్థం చేసుకుందని, 50 మందికిపైగా మరణాలకు, 50 వేల మంది నిరాశ్రయులు కావడానికి ఇదే కారణమని అన్నారు. నిరాశ్రయులైనవారు రాష్ట్ర జనాభాలో 1.6 శాతంగా ఉన్నారు.. మణిపూర్‌లో నాలుగు రోజుల పాటు అల్లర్లు కొనసాగుతూనే ఉన్నాయని, అస్సాం, మేఘాలయ రాష్ట్రాలకు కూడా ఇవి వ్యాపించాయని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ మెజార్టీ వాదులైన మీషే తెగ ప్రజలతో సమావేశమై, తమ భూమిని ముస్లింలు, గిరిజనులు, బయట వ్యక్తులతో పంచుకోవద్దని కోరారని, ఇదే తప్పుడు సందేశాన్ని పంపిందని శాంతా చెప్పారు. ముఖ్యమంత్రి మెజారిటీవాద రాజకీయాలు ఆడేందుకు ప్రయత్నించడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని సిపిఎం నేత విమర్శించారు. రిజర్వేషన్ల సమస్యతో పాటు భూ సమస్య కూడా మణిపూర్‌లో ఎప్పటి నుంచో ఉందని చెప్పారు. అడవుల నుంచి గిరిజన జనాభాను బిజెపి ప్రభుత్వం వెల్లగొట్టిందని, వారు బలవంతంగా తొలగించబడ్డారని, ఎలాంటి చర్చలు జరగలేదని శాంత విమర్శించారు.


పోలీసుల ద్వారా ఆందోళనకారులకు తుపాకులు, మందుగుండు సామాగ్రి పంపిణీ జరిగిందనే ఆరోపణలను శాంతా మద్దతు ఇచ్చారు. దీనిపై దర్యాప్తును ఎన్ఐఎకు అప్పగించాలని డిమాండ్ చేశారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామని ప్రభుత్వం చెబుతోందని, కానీ డ్రగ్స్‌కు సంబంధిత కేసుల్లో ముఖ్యమంత్రి బంధువులే అరెస్టయ్యారని శాంతా గుర్తు చేశారు.

మణిపూర్ అసెంబ్లీని ప్రస్తుతానికి సస్పెండ్ చేయాలని, ఈ ప్రభుత్వాన్ని తాము విశ్వసించబోమని శాంతా తెలిపారు. ముఖ్యమంత్రి బిరేన్ సింగ్ నిరంకుశ, నియంత అని విమర్శించారు. ఈ సంక్షోభం నుంచి బయటపడ్డానికి చర్చలే ఏకైక మార్గమని శాంతా తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికల సమయం (2022 ఫిబ్రవరి-మార్చి)లో బిజెపి ముఖ్య నాయకులు కొందరు కుకి మిలిటెంట్లకు పెద్ద మొత్తంలో చెల్లింపులు జరిపారని, ఆ విధంగా ఎన్నికల్లో మెజార్టీ సాధించారని ఆయన పేర్కొన్నారు. దీనికి తోడు మిషే తెగను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న డిమాండు తెరపైకి వచ్చింది. ఈ డిమాండ్ చాలా కాలం నుంచి ఉంది. దీనిపై మణిపూర్ హైకోర్టు జోక్యం చేసుకుని మిషే తెగలను ఎస్టీలో చేర్చుతూ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం తన సిఫారసును నాలుగు వారాల్లో పంపాలని ఆదేశించింది. అప్పటికే గిరిజనులను అటవీ భూముల నుంచి ఖాళీ చేయించడం, మెజార్టీ వాదులైన మిషే తెగను గిరిజన రిజర్వేషన్ల పరిధిలోకి తేవడంతో వారిలో ఆగ్రహం కట్టలుతెంచుకుంది. ముఖ్యంగా కుకీ తెగకు చెందిన వారు వీధుల్లోకి వచ్చి నిరసనాగ్రహాలను వ్యక్తం చేయడంతో రెండు తెగల మధ్య ఘర్షణలకు అది దారి తీసిందని శాంతా వివరించారు.



ఫ్యాషన్ .. ఫ్యాషన్ ...





- రాళ్లబండి పూజిత, ఇంటర్,
వాగ్దేవి జూనియర్ కాలేజీ, నరసరావు పేట,
పల్నాడు జిల్లా.

నిజాయితీ

దివి అనే ఊరిలో చిట్టి అనే పాప ఉంది. ఐదో తరగతి చదువుతుంది. తను అంటే తల్లిదండ్రులకు ఎంతో ఇష్టం. ప్రతిరోజూ రాత్రి అన్నం తినిపిస్తూ వాళ్ల నానమ్మ మంచి నీతి కథలు చెప్పేవారు. చిట్టి అవి వింటూ నిద్రపోయేది.

ఓ రోజు చిట్టి స్కూలు నుంచి ఇంటికి వెళుతున్న దారిలో ఐదు వందల నోటు కనిపించింది. అది చూస్తూ... రోడ్డు చివరి వరకూ, వెనక్కి తిరిగి చూసింది. ఎవరూ కనిపించలేదు. దాంతో ఆ డబ్బును తీసుకుని బ్యాగులో ఉన్న జామెంట్రీ బాక్సులో పెట్టి, బ్యాగుకు జిప్ వేసి భుజాలకు తగిలించుకుంది. ఇంటికి వెళ్లి ఆ నోటును అమ్మకు ఇచ్చింది.

"ఎవరో పోగొట్టుకున్నారు అమ్మా!. వాళ్లు ఎవరో కనుక్కుని ఇవ్వాలి" అంది. ఎవరిదని కనిపెట్టడం ఎలా? అంది అమ్మ. చిట్టి కొంచెం సేపు ఆలోచించి 'అమ్మా!..ఈ డబ్బు నీ దగ్గరే ఉంచు. డబ్బు పోగొట్టుకున్న వారు వెతుక్కుంటూ ఆ రోడ్డులోకి వస్తారు. అప్పుడు వాళ్లకి ఇద్దాం. నేను ఆడుకోవడానికి ఆ వీధిలోకి వెళతా.' అంటూ చిట్టి బయటకు వెళ్లింది.


కొంత సమయం తర్వాత ఓ తాత, చిన్న పాప వచ్చారు. ఆ పాప ఏడుస్తూ తాత పక్కనే తిరుగుతుంది. తాత కళ్లజోడు సరిచేసుకుంటూ వీధిని అణువణువూ చూస్తున్నాడు. ఇది గమనించిన చిట్టి వారి దగ్గరకు వెళ్లింది. 'తాతా! ఏం పోయింది?' అని అడిగింది. ఆయన 'డబ్బులు పోయాయి తల్లీ!' అన్నారు. 'ఎంత?' అని అడిగింది. ఆయన తిరిగి సమాధానం చెప్పలేదు. చిట్టి వెంటనే ఇంటికి వెళ్లి అమ్మ దగ్గర ఉన్న ఐదు వందల రూపాయలు తీసుకుంది. వెళ్లి ఆ తాతకు ఇచ్చింది. అది చూసి.. ఆయన ముఖం వెలిగిపోయింది. ఆశ్చర్యంతో నవ్వాడు. చిట్టి చేతిలో ఉన్న డబ్బు తీసుకుంటూ...'నీకు దొరికాయా? చిట్టీ!' అని అడిగాడు. 'అవును తాతా!' అంది. వెంటనే ఆయన చిట్టి తలని నిమిరి 'చల్లగా ఉండు తల్లి'. అని దీవించి వెళ్లిపోయాడు.



- యోగి ఈశ్వర్,
2వ తరగతి,
బైటమంజులూరు, పంగులూరు
మండలం,
బాపట్ల జిల్లా.

అమ్మ ప్రేమ...

మనల్ని అర్థంచేసుకుంటుంది,
మనకి ధైర్యాన్ని ఇస్తుంది,
మనలో తనని చూసుకుంటుంది,
మనల్ని మంచి మార్గంలో
నడిపిస్తుంది,
మనకి చదువు చెబుతుంది,
మనల్ని క్రమశిక్షణగా పెంచుతుంది,
మనకి గోరుముద్దలు తినిపిస్తుంది,
సూర్యుడి కంటే ముందు లెగుస్తుంది,
పనులన్నీ చకచకా చేస్తుంది,
అందరికీ కావాల్సింది తెచ్చి ఇస్తుంది,
అందరి మనసుల్ని అర్థం చేసుకుంటుంది,
తనే మన తొలి గురువైన అమ్మ,
ఎన్ని జన్మలెత్తినా నీ ఋణం తీర్చలేను అమ్మ.





కె.శరణ్య,
ఏడో తరగతి,
అరవింద మోడల్ స్కూల్,
మంగళగిరి.

బొమ్మరిల్లు





- యార్లగడ్డ మౌర్య నాగ తేజ్,
5వ తరగతి,
పోలీస్ పబ్లిక్ స్కూల్,
బెంగళూరు,
కర్ణాటక.


పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జీవన సౌరభం

కింద పడకుండా ముందుకు సాగడంలో గొప్పదనం లేదు. కిందపడిన ప్రతిసారీ లేచి నిలబడి ముందుకు సాగడంలోనే గొప్పదనం ఉంది.

పిల్లలతో ఇలా ఉండండి!

వేసవి సెలవులతో పిల్లలు ఇళ్లల్లోనే ఉంటున్నారు. కొంత సమయం దొరికితే చాలు ఫోన్‌లో తల పెడుతున్నారు. వీడియో గేమ్స్ ఆడుకోవడం, వీడియోలు చూడటం చేస్తున్నారు. కొంచెం పెద్ద పిల్లలు అయితే ఇన్‌స్టాగ్రామ్, ట్వీట్టర్‌లో వీడియోస్ చేస్తున్నారు. దీంతో వీరికి శారీరక శ్రమ తగ్గుతుంది. ఎక్కువ సమయం ఫోన్ చూడటం వల్ల కంటి చూపు సమస్యతో పాటు, ఊబకాయం రావడం, మెడ భాగం పట్టేయడం, వినికిడి లోపం, నిద్రలేమి వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. వీటి వల్ల మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతోందని నిపుణులు చెబుతున్నారు. వారిచేత మెదడుకు పదును పెట్టే పనులు, ఆటలు ఆడించాలంటున్నారు. అందుకు తల్లిదండ్రులే పూనుకోవాలి. కాస్త ఓపిక తెచ్చుకోవాలి. అందుకు కొన్ని సూచనలు చేస్తున్నారు.



- ఉదయాన్నే వారిని తీసుకుని సరదాగా ఆడుకోవడానికి ప్రయత్నం చేయాలి. లేదా మీతో పాటు పిల్లలను వాకింగ్ తీసుకువెళ్లాలి. ఏదో ఒకటి ఫిజికల్ యాక్టివిటీస్‌లో పాల్గొనేలా చేయాలి. క్రమక్రమంగా సెల్ ఫోన్ అలవాటు నుంచి బయటపడతారు.
- ఇంట్లో ఏదైనా వస్తువులు ఉపయోగపడితే వాటిని తీసుకురమ్మని చెప్పి పిల్లలను బయటికి పంపించాలి. ప్రతిరోజూ వంట గదిలో సహాయం చేయమని చెప్పండి. ఫోన్ చూస్తున్నారని కోప్పడటం, అరవడం చేయకూడదు. ఇలా జరిగితే వారు మరింత మొండిగా మారే ప్రమాదం ఉంది.
- కొంతమంది పిల్లలు అయితే చేతిలో సెల్ ఫోన్ లేకపోతే అన్నం తినరు. ఫోన్ పట్టుకోవాలంటూ ఏడుస్తారు. పిల్లలు ఇలా ఫోన్‌కి అడిక్ట్ అయితే తల్లులు చాలా ఇబ్బంది పడతారు. దీని నుంచి బయట పడేయాలంటే వారికి కొత్త కొత్త ప్రదేశాలు చూపించాలి. వాటి గురించి వివరించాలి. పార్క్‌కి తీసుకెళ్లండి. అక్కడ ఆడించండి. అక్కడకు వెళ్లాక పెద్దలు ఫోన్ తీయకూడదు. చేతిలో ఫోన్ చూస్తే వారూ అడుగుతారు.
- డ్రాయింగ్ మంచి అలవాటు. పిల్లల సృజనాత్మక శక్తి పెరుగుతుంది. వీలు కుదిరితే ఆ క్లాసుల్లో చేర్చండి. లేదంటే బయట షాపుల్లో దొరికే డ్రాయింగ్ పుస్తకాలు మరిన్ని తీసుకొచ్చి ఇవ్వండి. వాటిని రంగులు రుద్దమనండి. వాటిని చూస్తూ కొత్త బొమ్మలు గీసే ప్రయత్నం చేయించండి. ఇలా ప్రతి రోజూ చేస్తూంటే ఫోన్‌ను మరిచిపోతుంటారు.
- వారి చేత కొంత దూరం పాటు సైకిల్ తొక్కించడం చేయాలి. క్యారమ్‌బోర్డు, కబడ్డీ, కో కో, రింగ్, షెటిల్ వంటి పిల్లలు బృందంతో కలిసి ఆడుకునేలా చూడాలి. రోజుకో కొత్త ఆటలు నేర్పండి. అవసరమైతే మీరూ కలిసి ఆడండి. వారినే టీం లీడర్‌గా ఉంచండి. దాంతో వారిలో నాయకత్వ లక్షణాలు అలవడతాయి.
- ఈ మధ్యకాలంలో మార్కెట్లోకి సరికొత్త బొమ్మలు వచ్చాయి. బిల్డింగ్ బ్లాక్స్ టాయ్స్ వచ్చాయి. వాటితో బిల్డింగ్స్ తయారు చేయండి అని చెప్పండి. ఇందులోనే కొన్ని వస్తువుల స్పెల్లింగ్స్‌తో కూడిన బ్లాక్స్ ఆటబొమ్మలు వచ్చాయి. వాటితో ఆడితే ఆటకి, చదువు కూడా నేర్పినట్టు ఉంటుంది.
- ఇంట్లో ఉన్న పాత వస్తువులు ఇచ్చి కొత్త బొమ్మ తయారు చేయమని చెప్పండి. చేసినప్పుడు వారి సృజనాత్మకతను ప్రశంసించాలి. దీంతో చిన్నారుల మనసు సంతోషంతో నిండుతుంది.
- రోజూ కథలు చెప్పండి. వారు ఏం గ్రహించారో అడిగి తెలుసుకోండి. వారిచేతా చెప్పించండి. చెప్పిన వాటిని పేపర్ మీద రాయమనండి. ప్రకృతికి దగ్గర చేసే పనులు చేపట్టండి. మొక్కలు నాటించడం, చేపలు పెంచడం చేయించండి. వాటి సంరక్షణ బాధ్యతలు వారికే అప్పగించండి.
- పిల్లల మనసులో తెలియని ఊహాలోకం ఉంటుంది. ఇల్లు, పక్షులు, ప్రకృతి, రైలు, పడవ ప్రయాణాలు వంటివాటి గురించి రకరకాల ఆలోచనలుంటాయి. వాటిని బొమ్మలుగా లేదా వాటి గురించి రాయమని చెప్పండి. అలాగే దెయ్యాలు, భూతాలు, దొంగలు అంటూ భయాలూ ఉంటాయి. వీటిని తొలగించే ప్రయత్నాలు చేయాలి.
- అలాగే దేశ నాయకులు, క్రీడాకారుల గురించి చెప్పండి. వాటికి సంబంధించిన పుస్తకాలను దగ్గరుండి చదివించండి. ఇవన్నీ వారిలో ఆందోళన, ఒత్తిడిని దూరం చేస్తాయి. దీంతో ఏ కొత్త విషయం చెప్పినా త్వరగా గ్రహించ గలుగుతారు. ఏకాగ్రత కూడా పెంపొందుతుంది.
- పిల్లలతో ఎక్కువ సమయమే గడపాలి. అప్పుడే వారు ఫోన్‌కు దూరం చేయగలరు. అందుకు పెద్దలకు కొంచెం కష్టమైన పనే. పిల్లలు భవిష్యత్తు మంచిగా ఉండాలంటే తప్పదు. వారితో కలిసి జోక్స్ వేస్తూ కలిసి నవ్వండి. ఇలా చేయడం వల్ల వారిలో మార్పు కనిపిస్తుంది.

గిల్, సాహా దూకుడు

- ప్లే ఆఫ్స్‌లో గుజరాత్ టైటాన్స్ అడుగు
- ఛేదనలో క్వింటన్ డికాక్ పోరాటం వృథా
- లక్నో సూపర్‌జెయింట్స్‌పై భారీ విజయం

పాండ్య సోదరుల సమరంలో హార్దిక్ పాండ్య పైచేయి సాధించాడు. లక్నో సూపర్‌జెయింట్స్‌పై తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన గుజరాత్ టైటాన్స్ 56 పరుగుల తేడాతో భారీ విజయం నమోదు చేసింది. ఈ విజయంతో 16 పాయింట్లు ఖాతాలో వేసుకున్న గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్16 ప్లే ఆఫ్స్‌కు చేరుకున్న తొలి జట్టుగా నిలిచింది. తొలుత గుజరాత్ టైటాన్స్ 227 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఛేదనలో లక్నో సూపర్‌జెయింట్స్ 171 పరుగులకే పరిమితమైంది. ఐపీఎల్‌లో లక్నో సూపర్‌జెయింట్స్‌తో ఆడిన నాలుగు మ్యాచుల్లో గుజరాత్ టైటాన్స్ విజయాలు సాధించటం విశేషం.

అహ్మదాబాద్




గుజరాత్ టైటాన్స్ అడుగు పెట్టింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2023 ప్లే ఆఫ్స్‌లో అధికారికంగా కాలుమోపింది. ఆదివారం లక్నో సూపర్‌జెయింట్స్‌పై 56 పరుగుల తేడాతో ఎదురులేని విజయం నమోద చేసిన గుజరాత్ టైటాన్స్.. సీజన్లో ఎనిమిదో గెలుపుతో ప్లే ఆఫ్స్‌లో చోటు ఖాయం చేసుకుంది. శుభ్‌మన్ గిల్ (94 నాటౌట్, 51 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్స్‌లు), వృద్ధిమాన్ సాహా (81, 43 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) ధనాధన్ అర్థ సెంచరీలతో చెలరేగారు. ఓపెనర్లు విజృంభించిన వేళ గుజరాత్ టైటాన్స్ తొలుత భారీ స్కోరు నమోదు చేసింది. 20 ఓవర్లలో 2 వికెట్లకు 227 పరుగులు సాధించింది. భారీ ఛేదనలో లక్నో సూపర్‌జెయింట్స్ చతికిల పడింది. క్వింటన్ డికాక్ (70, 41 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) పోరాడినా ఫలితం దక్కలేదు. 20 ఓవర్లలో 7 వికెట్లకు లక్నో సూపర్‌జెయింట్స్ 171 పరుగులే చేసింది. 56 పరుగుల భారీ వ్యత్యాసంతో గుజరాత్ టైటాన్స్ ఏకపక్ష విజయం నమోదు చేసింది. అజేయ అర్థ సెంచరీతో దంచికొట్టిన దంచికొట్టిన శుభ్‌మన్ గిల్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. 11 మ్యాచుల్లో గుజరాత్ టైటాన్స్‌కు ఇది ఎనిమిదో విజయం కాగా, 11 మ్యాచుల్లో లక్నో సూపర్‌జెయింట్స్‌కు ఇది ఐదో పరాజయం. పాయింట్ల పట్టికలో గుజరాత్ టైటాన్స్ (16) అగ్రస్థానంలో నిలవగా, లక్నో సూపర్‌జెయింట్స్ (11) మూడో స్థానంలో కొనసాగుతుంది.

ఛేదనలో చతికిల :

లక్నో సూపర్‌జెయింట్స్ లక్ష్యం 228 పరుగులు. ఈ సీజన్లోనే అత్యధిక స్కోరు సాధించిన రికార్డు ఆ జట్టు సొంతం. తొలి పది ఓవర్లలో లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్ లక్ష్యం దిశగా సాగింది. కానీ చివరి పది ఓవర్లలో లక్నో ఇన్నింగ్స్ గతి తప్పింది. ఫలితంగా ఆ జట్టు 56 పరుగుల తేడాతో భారీ పరాజయం పాలైంది. ఓపెనర్లు కైల్ మేయర్స్ (48, 32 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), క్వింటన్ డికాక్ (70, 41 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ ఆరంభాన్ని అందించారు. పవర్‌ప్లేలో లక్నో వికెట్ నష్టపోకుండా 72 పరుగులు పిండుకుంది. 24 బంతుల్లోనే 50 పరుగుల భాగస్వామ్యం జోడించిన మేయర్స్, డికాక్.. టైటాన్స్ బౌలర్లకు సవాల్ విసిరారు. ఏడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 31 బంతుల్లో క్వింటన్ డికాక్ అర్థ సెంచరీ నమోదు చేశాడు. అర్థ సెంచరీ ముంగిట కైల్ మేయర్స్ నిష్క్రమణతో లక్నో తడబాటు మొదలైంది. దీపక్ హుడా (11), మార్కస్ స్టోయినిస్ (4), నికోలస్ పూరన్ (3), కెప్టెన్ కృనాల్ పాండ్య (0) ఒత్తిడికి చిత్తయ్యారు. ఆయుశ్ బదాని (21, 11 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) ఒక్కడే మిడిల్ ఆర్డర్‌లో చెప్పుకోదగిన ప్రదర్శన చేశాడు. మేయర్స్ డగౌట్‌కు చేరుకున్నాక.. లక్నో సూపర్‌జెయింట్స్ మానసికంగా ఓటమికి సిద్ధపడింది. 20 ఓవర్లలో 7 వికెట్లకు ఆ జట్టు 171 పరుగులే చేసింది. గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో మోహిత్ శర్మ (4/29) నాలుగు వికెట్లతో రాణించాడు. మహ్మద్ షమి, రషీద్ ఖాన్, నూర్ అహ్మద్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

గిల్, సాహా ఉతికేశారు :

టాస్ నెగ్గిన లక్నో సూపర్‌జెయింట్స్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. సొంతగడ్డపై తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన గుజరాత్ టైటాన్స్‌కు ఓపెనర్లు బ్యాంగ్‌బ్యాంగ్ అందించారు. సీనియర్ ఓపెనర్ వృద్ధిమాన్ సాహా (81, 43 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లు), యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (94 నాటౌట్, 51 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్స్‌లు) అర్థ సెంచరీలతో కదం తొక్కారు. పవర్‌ప్లేలో వృద్ధిమాన్ సాహా లక్నో బౌలర్లను ఊచకోత కోశాడు. సాహా విధ్వంసక విన్యాసంతో తొలి ఆరు ఓవర్లలోనే టైటాన్స్ 78 పరుగులు పిండుకుంది. ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 20 బంతుల్లోనే సాహా అర్థ సెంచరీ మార్క్ అందుకున్నాడు. మరో ఎండ్‌లో గిల్ భిన్నమైన ఆటతీరు కనబరిచాడు. నాలుగు సిక్సర్లతో 29 బంతుల్లో అర్థ సెంచరీ సాధించాడు. సహజంగా బౌండరీలు ఎక్కువగా సాధించే గిల్.. లక్నోపై సిక్సర్ల వర్షం కురిపించాడు. తొలి వికెట్‌కు సాహా, గిల్ జోడీ 142 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పింది. కెప్టెన్ హార్దిక్ పాండ్య (25, 15 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు), డెవిడ్ మిల్లర్ (21 నాటౌట్, 12 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. ఓ ఎండ్‌లో గిల్ ఏడు సిక్సర్లతో అజేయంగా 94 పరుగులు సాధించాడు. గిల్ మెరుపులతో గుజరాత్ టైటాన్స్ 227 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్నో సూపర్‌జెయింట్స్ ఎనిమిది మంది బౌలర్లను ప్రయోగించినా ప్రయోజనం దక్కలేదు. మోహ్సిన్ ఖాన్, అవేశఖ్ ఖాన్‌లు చెరో వికెట్ ఖాతాలో వేసుకున్నారు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ చేతిలో లక్నో సూపర్‌జెయింట్స్‌కు ఇది వరుసగా నాల్గో పరాజయం.



స్కోరు వివరాలు :

గుజరాత్ టైటాన్స్ : వృద్ధిమాన్ సాహా (సి) ప్రేరక్ మన్కడ్ (బి) అవేశ్ ఖాన్ 81, శుభ్‌మన్ గిల్ నాటౌట్ 94, హార్దిక్ పాండ్య (సి) కృనాల్ పాండ్య (బి) మోహ్సిన్ ఖాన్ 25, డెవిడ్ మిల్లర్ నాటౌట్ 21, ఎక్స్‌ట్రాలు : 6, **మొత్తం : (20 ఓవర్లలో 2 వికెట్లకు) 227.**

వికెట్ల పతనం : 1-142, 2-184.

బౌలింగ్ : మోహ్సిన్ ఖాన్ 3-0-42-1, అవేశ్ ఖాన్ 4-0-34-1, కృనాల్ పాండ్య 4-0-38-0, యశ్ ఠాకూర్ 4-0-48-0, రవి బిష్ణోయ్ 2-0-21-0, కైల్ మేయర్స్ 1-0-16-0, స్వప్నిల్ సింగ్ 1-0-7-0, మార్కస్ స్టోయినిస్ 1-0-20-0.

లక్నో సూపర్‌జెయింట్స్ : కైల్ మేయర్స్ (సి) రషీద్ ఖాన్ (బి) మోహిత్ శర్మ 48, క్వింటన్ డికాక్ (బి) రషీద్ ఖాన్ 70, దీపక్ హుడా (సి) రాహుల్ తెవాటియ (బి) మహ్మద్ షమి 11, మార్కస్ స్టోయినిస్ (సి) మహ్మద్ షమి (బి) మోహిత్ శర్మ 4, నికోలస్ పూరన్ (సి) మహ్మద్ షమి (బి) నూర్ అహ్మద్ 3, ఆయుశ్ బదాని (సి) నూర్ అహ్మద్ (బి) మోహిత్ శర్మ 21, స్వప్నిల్ సింగ్ నాటౌట్ 2, కృనాల్ పాండ్య (సి) డెవిడ్ మిల్లర్ (బి) మోహిత్ శర్మ 0, రవి బిష్ణోయ్ నాటౌట్ 4, ఎక్స్‌ట్రాలు : 8, **మొత్తం :(20 ఓవర్లలో 7 వికెట్లకు) 171.**

వికెట్ల పతనం : 1-88, 2-114, 3-130, 4-140, 5-153, 6-166, 7-166.

బౌలింగ్ : మహ్మద్ షమి 4-0-37-1, హార్దిక్ పాండ్య 3-0-37-0, రషీద్ ఖాన్ 4-0-34-1, నూర్ అహ్మద్ 4-0-26-1, మోహిత్ శర్మ 4-0-29-4, అల్జారీ జొసెఫ్ 1-0-5-0.

సోదరుల సమరం



అన్నదమ్ములు కలిసి ఒకే జట్టుకు ఆడటం, ప్రత్యర్థి జట్ల తరపున ప్రాతినిథ్యం వహించటం ఇప్పటి వరకు మనం చూశాం. ఇర్ఫాన పఠాన్, యూసుఫ్ పఠాన్, మైకల్ హస్సీ, డెవిడ్ హస్సీ, టామ్ కరణ్, శామ్ కరణ్, షాన్ మార్ష్, మిచెల్ మార్ష్, అల్బీ మోర్కెల్, మోర్నీ మోర్కెల్, దీపక్ చాహర్, రాహుల్ చాహర్, బ్రెండన్ మెక్‌కలమ్, నాథన్ మెక్‌కలమ్, డ్వేన్ బ్రావో, డారెన్ బ్రావో, మార్కో జాన్సెన్, డ్వాన్ జాన్సెన్.. ఇలా ఎందరో అన్నదమ్ములు ఐపీఎల్‌లో కలిసి, ఒకరితో ఒకరు పోటీపడ్డారు. కానీ ఐపీఎల్ చరిత్రలో తొలిసారి రెండు జట్లకు సోదరులు సారథ్యం వహించి ముఖాముఖి తలపడ్డారు. గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్‌జెయింట్స్ మ్యాచ్‌లో ఇది చోటు చేసుకుంది. హార్దిక్ పాండ్య టైటాన్స్‌కు, కృనాల్ పాండ్య సూపర్‌జెయింట్స్‌కు కెప్టెన్సీ వహించారు. 'మా కల నిజమైంది. హార్దిక్, నేను మా జట్లకు సారథ్యం వహిస్తున్నాం. మా కుటుంబానికి ఇది భావోద్వేగ రోజు. మా నాన్న కచ్చితంగా గర్వపడతారు. ఇలా రెండు జట్లకు సోదరులు సారథ్యం వహించటం ఇదే ప్రథమం. మాటలు రావట్లేదు. కానీ మా కుటుంబం గర్వపడుతుంది' అని పాండ్య సోదరులు భావోద్వేగం పంచుకున్నారు.



బట్లర్ బాదేశాడు

- 59 బంతుల్లో 95 పరుగులు
- సంజు శాంసన్ ధనాధన్
- రాజస్థాన్ రాయల్స్ 214/2

జైపూర్ : ముంబయి ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్ చేతిలో వరుస పరాజయాలు చవిచూసిన రాజస్థాన్ రాయల్స్.. మానసికంగా బలహీనంగా ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై దండయాత్ర చేసింది. పరుగుల వేటలో నెమ్మదించిన జోశ్ బట్లర్, సంజు శాంసన్ సైతం సన్‌రైజర్స్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ధనాధన్ ఇన్నింగ్స్‌లో ఫామ్ అందుకున్నారు. 10 ఫోర్లు, 4 సిక్సర్లతో 59 బంతుల్లోనే 95 పరుగులు చేసిన జోశ్ బట్లర్ రాజస్థాన్ రాయల్స్‌కు భారీ స్కోరు అందించాడు. కెప్టెన్ సంజు శాంసన్ (66 నాటౌట్, 38 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ అర్థ సెంచరీతో విరుచుకుపడ్డాడు. జోశ్ బట్లర్, సంజు శాంసన్ విశ్వరూపంతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లలో 2 వికెట్లకు 214 పరుగుల భారీ స్కోరు చేసింది.

బట్లర్ మెరుపులు : టాస్ నెగ్గిన రాజస్థాన్ రాయల్స్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఆరంభం నుంచే ఎదురుదాడికి వెళ్లి గత రెండు మ్యాచుల్లో దెబ్బతిన రాజస్థాన్ రాయల్స్.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై పంథా మార్చుకోలేదు.

టాప్ ఆర్డర్‌లో ముగ్గురు కీలక బ్యాటర్లు మెరవటంతో రాజస్థాన్ రాయల్స్ తడాఖా చూపించింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (35, 18 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), జోశ్ బట్లర్ (95, 59 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 54 పరుగులు జోడించి శుభారంభం అందించారు. పవర్‌ప్లేలో జైస్వాల్ దూకుడుగా ఆడాడు. జైస్వాల్ వికెట్ కోల్పోయినా.. ఆరు ఓవర్లలో 61 పరుగులు జోడించింది. జోశ్ బట్లర్‌కు సంజు శాంసన్ జత కలవటంతో రాయల్స్ ఇన్నింగ్స్ దూకుడు పట్టాలెక్కింది. ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 32 బంతుల్లోనే జోశ్ బట్లర్ అర్థ సెంచరీ సాధించగా.. రెండు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 33 బంతుల్లో సంజు శాంసన్ ఫిఫ్టీ అందుకున్నాడు. ఓ ఎండ్‌లో బట్లర్, మరో ఎండ్‌లో శాంసన్ ఎడాపెడా బౌండరీలు బాదటంతో సన్‌రైజర్స్ బౌలర్లు తేలిపోయారు. సెంచరీ ముంగిట జోశ్ బట్లర్ నిష్క్రమించినా.. సంజు శాంసన్ మెరుపు ముగింపు అందించాడు. షిమ్రోన్ హెట్‌మయర్ (7 నాటౌట్) అజేయంగా నిలిచాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్, మార్కో జాన్సెన్ చెరో వికెట్ పడగొట్టారు.

భువనేశ్వర్ కుమార్, మార్కో జాన్సెన్ నాలుగు ఓవర్లలో 44 పరుగుల చొప్పున సమర్పించుకున్నారు. మాయగాడు మయాంక్ మార్కండె ఏకంగా 51 పరుగులు సమర్పించుకుని అర్థ సెంచరీ కొట్టాడు.

స్కోరు వివరాలు :

రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (సి) నటరాజన్ (బి) మార్కో జాన్సెన్ 35, జోశ్ బట్లర్ (ఎల్బీ) భువనేశ్వర్ కుమార్ 95, సంజు శాంసన్ నాటౌట్ 66, షిమ్రోన్ హెట్‌మయర్ నాటౌట్ 7, ఎక్స్‌ట్రాలు : 11, **మొత్తం : (20 ఓవర్లలో 2 వికెట్లకు) 214.**

వికెట్ల పతనం : 1-54, 2-192.

బౌలింగ్ : భువనేశ్వర్ కుమార్ 4-0-44-1, మార్కో జాన్సెన్ 4-0-44-1, నటరాజన్ 4-0-36-0, మయాంక్ మార్కండె 4-0-51-0, అభిషేక్ శర్మ 2-0-15-0, విగ్రాంత్ శర్మ 2-0-18-0.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68